


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

31.08.2026
సోమవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 110
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## కడప రైతు వరదరాజ్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు

- మన్‌కీ బాత్ ప్రసంగంలో అవకాడో సాగు
- అవకాడో సాగు విజయగాథ ప్రస్తావన
- కొత్త పంటను ఎంచుకుని సాగు



కడప, ఆగస్ట్ 30, అనంతజనశక్తి న్యూస్

అవకాడో సాగుకు దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణను, వివిధ ప్రాంతాల రైతులు అవకాడో సాగు ద్వారా లబ్ధి పొందుతున్న విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నాటి తన మన్‌కీ బాత్ ప్రసంగంలో ప్రస్తావించారు. 2లో..

## దేశానికి డ్రగ్స్ పీడ వదిలిపోవాలి



న్యూఢిల్లీ, ఆగస్ట్ 30, అనంతజనశక్తి న్యూస్

వికసిత్ భారత్ లక్ష్యం సాకారమయ్యేందుకు దేశానికి డ్రగ్స్ పీడ వదిలిపోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. మన్ కీ బాత్ రేడియో కార్యక్రమం 137వ ఎపిసోడ్‌లో నేడు ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. భారత దేశ భవితను కాపాడుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఇటీవల ప్రారంభమైన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమం' విజయవంతంగా సాగుతోందని ప్రధాని మోదీ అన్నారు. భారీ సంఖ్యలో యువత ఈ కార్యక్రమంలో పాల్గొంటోందని చెప్పారు. 2లో..

- 'మన్ కీ బాత్'లో ప్రధాని
- వికసిత్ భారత్ లక్ష్యం సాకారమయ్యేందుకు
- 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమం'
- విజయవంతంగా సాగుతోంది: ప్రధాని మోదీ



## ముస్లింలేని భారత్‌ను కోరుకునేవారు హిందువే కాదు

- ఆర్ఎస్ఎస్ చీఫ్ భగవత్ సంచలన వ్యాఖ్యలు
- మూడు దేశాల పర్యటనలో ఆర్ఎస్ఎస్ చీఫ్



2లో..

# మూడు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు

- సీఎం చంద్రబాబు నాయుడు
- వెలిగొండతో పశ్చిమ ప్రకాశం కల సాకారం
- సోమవారం ఫేజ్-1 ప్రారంభం
- 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు
- 4 లక్షల మందికి తాగునీరు
- రైతన్నకు వెలిగొండ భరోసా
- 11 గ్రామాల నిర్వాసితులకు నమస్కారం
- కృష్ణమ్మ జలాలతో నీటి కష్టాలకు చెక్
- 1న పశ్చిమ గోదావరిలో పర్యటన





అమరావతి, ఆగస్ట్ 30, అనంత జనశక్తి న్యూస్

మూడు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు లభించబోతోందని, మార్కాపురం జిల్లా గడ్డపై సోమవారం కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దాదాపు 30 ఏళ్లుగా కరవు పీడిత ప్రాంత ప్రజల వెలిగొండ కల.. కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని తెలిపారు. మార్కాపురం జిల్లా గంటవానిపల్లి వేదికగా వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1ను సోమవారం ప్రారంభించి, నీరు విడుదల చేయనున్న సందర్భంగా.. 'ఎక్స్'లో ప్రాజెక్టు వీడియోను ముఖ్యమంత్రి పంచుకున్నారు.

"కరవుతో అల్లాడుతున్న పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో మొదలుపెట్టిన ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం నన్ను భావోద్వేగానికి గురిచేస్తోంది. నా మనసుకు ఎంతో సంతోషాన్నిస్తోంది. వెలిగొండ అంటే కేవలం ఒక ప్రాజెక్టు కాదు.. కరవుతో పోరాడిన రైతన్నకు భరోసా. ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత. వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తు. పేదరికంలో మగ్గిన ప్రాంతానికి ప్రగతి మార్గం. మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ఈ మహాయజ్ఞం కోసం తమ భూములను, ఇళ్లను, పుట్టిపెరిగిన ఊళ్లను త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. నల్లమల కొండలను చీల్చుకుంటూ నల్లమల సాగర్‌లోకి దూసుకువచ్చే కృష్ణమ్మ జలాలు.. ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలను సమూలంగా తీర్చేస్తాయి. రేపటి నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులు.. అభివృద్ధికి రెక్కలు. రేపు వెలిగొండ పండుగ దగ్గర కలుద్దాం" అంటూ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2లో..

## ఇకపై వేరే విధంగా ట్రీట్ చేయాల్సి ఉంటుంది

- ఇప్పటి వరకూ మన సాయిరెడ్డి అనుకున్నాం
- మాజీ మంత్రి సజ్జల కామెంట్
- వ్యక్తిత్వాన్ని టార్గెట్ చేసి దాడులా?

2లో..

అమరావతి, ఆగస్ట్ 30, అనంత జనశక్తి న్యూస్

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తనపైనా, అధినేత వైఎస్ జగన్ పైనా చేస్తున్న విమర్శలకు వైసీపీ నేత, రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి కౌంటర్ ఇచ్చారు. వైసీపీలో సజ్జల నంబర్ వన్, జగన్ నంబర్ టూ అని ఆరోపిస్తూ విజయసాయిరెడ్డి బహిరంగ లేఖరాయటం సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బహిరంగ లేఖలో విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలకు విలేకర్ల సమావేశంలో సజ్జల కౌంటర్ ఇచ్చారు.

## నేడు విశాఖలో ఏఐజీ ఆస్పత్రికి శంకుస్థాపన

- రూ.2 వేల కోట్లతో ఆస్పత్రి నిర్మాణం
- 9 ఎకరాల్లో ప్రపంచస్థాయి క్యాంపస్ ఏర్పాటు
- 9 వేల మందికి ఉద్యోగాల కల్పన
- 50కిపైగా వైద్య ప్రత్యేక విభాగాలు



2లో..

## రాయలసీమ అభివృద్ధిపై పవన్ స్పెషల్ ఫోకస్

- రూ.8,022 కోట్లతో అభివృద్ధి పనులు
- 23 వేలకుపైగా రోడ్ల నిర్మాణం
- జల సంరక్షణతో పెరిగిన సాగు విస్తీర్ణం
- సెప్టెంబర్ 2న జనసేన యువజన విభాగం ఆవిష్కరణ

2లో..



అమరావతి, ఆగస్ట్ 30, అనంతజనశక్తి న్యూస్

రాయలసీమ అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. రాయలసీమలో పల్లెసీమల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు. రూ. 8,022 కోట్లతో గ్రామాలు, అటవీ అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్‌ను రూపొందించారు. రూ. 4,523 కోట్లతో 23,000కు పైగా రోడ్ల పనులు జరగనున్నాయి. ఇప్పటికే 5,238 కిలోమీటర్ల మేర బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేసిన విషయం తెలిసిందే.

## ఆ మూవీని ఫ్యామిలీతో చూడకండి

- నేను మధ్యలోనే థియేటర్ నుంచి..
- బయటకొచ్చా: ఎమ్మెల్యే రాజాసింగ్
- టాక్సిక్ సినిమాపై సంచలన కామెంట్లు



2లో..

## తెలంగాణలో గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు

- మంత్రి కొండా సురేఖ
- ఇప్పటివరకు రాజమండ్రి మాత్రమే గుర్తొచ్చేది
- ఇకపై తెలంగాణలోనూ పుష్కరాలను గ్రాండ్
- ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా ముందుకు

6లో..

హైదరాబాద్, ఆగస్ట్ 30, అనంతజనశక్తి న్యూస్

తెలంగాణలో గోదావరి పుష్కరాలను ఈసారి ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. గోదావరి పుష్కరాలు అంటే ఇప్పటివరకు రాజమండ్రి మాత్రమే గుర్తొచ్చేదని, ఇకపై తెలంగాణలోనూ పుష్కరాలను గ్రాండ్‌గా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

## దివ్యాంగులకు రూ.6వేలు

- గత ప్రభుత్వం పట్టించుకోలేదు
- హరీశ్ చెప్పేవన్నీ అబద్ధాలే
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కామెంట్

2లో..



హైదరాబాద్, ఆగస్ట్ 30, అనంతజనశక్తి న్యూస్

తెలంగాణలోని దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే భారీ శుభవార్త అందించనుంది. ప్రస్తుతం ఇస్తున్న ఆసరా పెన్షన్ మొత్తాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడించారు. దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే ప్రస్తుతం ఇస్తున్న 4,000 రూపాయల పెన్షన్‌ను 6,000 రూపాయలకు పెంచబోతున్నామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంపై ఎంతటి ఆర్థిక భారం ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల అమలులో వెనక్కి తగ్గేది లేదని, అర్హులైన దివ్యాంగులందరికీ పెన్షన్లు సక్రమంగా అందుతాయని ఆయన భరోసా ఇచ్చారు.

## 700 దాటిన మృతుల సంఖ్య 3000 మంది ఆచూకీ గల్లంతు

- నేపాల్ వరదల బీభత్సం
- భోటేకోశి ప్రవాహంలో కొట్టుకుపోయిన గ్రామాలు

2లో..



నేపాల్, ఆగస్ట్ 30, అనంతజనశక్తి న్యూస్

హిమాలయాల ఒడిలో ఊహించని ప్రకృతి విపత్తు తీవ్ర బీభత్సాన్ని సృష్టించింది! నేపాల్, టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో కొన్ని రోజుల క్రితం సంభవించిన ఆకస్మిక వరదలు.. ఊళ్లకు ఊళ్లనే తుడిచిపెట్టేశాయి. గడిచిన కొద్ది రోజులుగా నరకాన్ని తలపిస్తున్న ఈ ప్రాంతంలో రెస్క్యూ బృందాల చర్యల్లో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

# దివ్యాంగులకు రూ. 6వేలు

(మొదటి పేజీ తరువాయి)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు దివ్యాంగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2014 మేనిఫెస్టోలో ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశారని, 2018లో అసలు దివ్యాంగుల అంశాన్నే పట్టించుకోలేదని విమర్శించారు. నిన్నటి సమావేశంలో హరీష్ రావు పచ్చి అబద్ధాలు మాట్లాడారని, కేవలం ముఖ్యమంత్రిని తిట్టడమే లక్ష్యంగా దివ్యాంగుల సమావేశాన్ని ఏర్పాటు చేశారని మండిపడ్డారు. దివ్యాంగులను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్న హరీష్ రావుకు త్వరలోనే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడాలని, ప్రతి శాఖ నుంచి సమాధానం ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ చేశారు.

తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించిందని మంత్రి తెలిపారు. రూ. 50 కోట్ల నిధులతో మోపెడ్ వాహనాలు, బ్యాటరీ వీల్ చైర్లను పంపిణీ చేశామని పేర్కొన్నారు. అంతేకాకుండా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులకు ప్రత్యేక కోటాను ఏర్పాటు చేశామని చెప్పారు. పుట్టిన వెంటనే శిశువులకు ఏదైనా అంగవైకల్యం గుర్తిస్తే, 'బాల భరోసా' పథకం కింద ప్రభుత్వమే పూర్తి ఖర్చు భరించి కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత చికిత్స అందిస్తోందని వివరించారు. భవిష్యత్తులో దివ్యాంగులకు మరిన్ని పారదర్శకమైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

# రాయలసీమ అభివృద్ధిపై పవన్ స్పెషల్ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కల్యాణ్ చేపట్టిన జల సంరక్షణ చర్యలతో రాయలసీమ సస్యశ్యామలం కానుంది. ఉపాధి హామీ ద్వారా 62 వేల ఎకరాల్లో ఉద్యాన సాగు చేపట్టారు. దీని ద్వారా 28 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. నీటి కుంటలు, ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల వృద్ధి చెందనున్నాయి. 50 వేలకు పైగా ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. పాడి రైతులకు అండగా గోకులాలు, నీటి తొట్టెలను నిర్మించారు. సీమ దాహార్తి తీర్చేందుకు జేజేఎంఅమరజీవి జలధారాలు సిద్ధమవుతున్నాయి. 13 నగర వనాలతో పట్టణాల్లో పచ్చదనం పెంపొందనుంది.

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో సెప్టెంబర్ 2వ తేదీన జనసేన యువజన విభాగం ఆవిష్కరణ ఘనంగా జరగనుంది. పిఠాపురంలో జనసేన యువజన విభాగాన్ని ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవిష్కరించనున్నారు. ప్రస్తుతం అనారోగ్య సమస్యతో కేరళలో చికిత్స పొందుతున్న ఆయన.. ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమానికి హాజరుకానున్నారు. సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు యువజన విభాగాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించనున్నారు. అనంతరం విభాగం లక్ష్యాలు, యువతలో రాజకీయ చైతన్యం వంటి అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరుకానున్నారు. యువజన విభాగం లోగో, గీతాన్ని మంత్రి ఆవిష్కరించనున్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జనసేన ప్రణాళికలు రచించింది. అలాగే తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది. ఉప ముఖ్యమంత్రి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను ఘనంగా నిర్వహించబోతున్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు, వీర మహిళలు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొననున్నారు.

# ఆ మూవీని ఫ్యామిలీతో చూడకండి

**హైదరాబాద్, ఆగస్ట్ 30, అనంతజనశక్తి న్యూస్**

ఇటీవల విడుదలైన టాక్సిక్ మూవీపై గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. టాక్సిక్ సినిమాలో కేవలం అశ్లీలత, డ్రగ్స్, నరుకుడు, చంపుడు మాత్రమే ఉన్నాయని ఫైరయ్యారు. సమాజానికి మంచి మెసేజ్ ఏమీ లేదని వ్యాఖ్యానించారు. స్నేహితులతో కలిసి సినిమాకి వెళ్లిన తాను సినిమా మొదలైన కాసేపటికే బయటకు వచ్చేశానని తెలిపారు. దానికి బదులుగా ఇరుముడి, 'ఛావా లాంటి దేశభక్తి, ఆధ్యాత్మికత, చారిత్రక ధర్మం ఉన్న సినిమాలు తీయాలని హితవు పలుకుతూ సోషల్ మీడియోలో వీడియో రిలీజ్ చేశారు.

టాక్సిక్ సినిమాలో అశ్లీలత ఎక్కువగా ఉంది. నేను స్నేహితులతో కలిసి మూవీకి వెళ్లా. సినిమాలోని కొన్ని సన్నివేశాలను చూసిన అనంతరం మధ్యలోనే బయటకు వచ్చా. సినిమా అంటే కేవలం వినోదం మాత్రమే కాకుండా సమాజానికి ఏదో ఒక మంచి సందేశాన్ని అందించేలా ఉండాలి. టాక్సిక్ మూవీలో డ్రగ్స్, హత్యలు, మహిళల పట్ల అసభ్యకరమైన ప్రదర్శన తప్ప సమాజానికి ఉపయోగపడే సందేశం పెద్దగా కనిపించలేదు.' అని రాజాసింగ్ వ్యాఖ్యానించారు.

ఇదే సమయంలో ఇతర సినిమాలను ఉదాహరణగా ఎమ్మెల్యే రాజా సింగ్ ప్రస్తావించారు. మాస్ మహారాజా రవితేజ నటించిన ఇరుముడి సినిమాలో మంచి సందేశం ఉందని రాజాసింగ్ వ్యాఖ్యానించారు. అలాగే దైవ సంబంధమైన అంశాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చే సినిమాలు ప్రేక్షకుల్లో మంచి ప్రభావాన్ని చూపుతాయని అన్నారు. ఛావా సినిమా గురించి కూడా రాజాసింగ్ వీడియోలో ప్రస్తావించారు. ఆ సినిమాలో హిందూ ధర్మానికి సంబంధించిన అనేక అంశాలను ప్రస్తావించారని ఆయన వెల్లడించారు. ధార్మిక విలువలను కాపాడేలా కథను తెరకెక్కించారని వివరించారు.

టాక్సిక్ మూవీలో నటించిన హీరో యష్‌కు రాజాసింగ్ సలహా ఇచ్చారు. అటువంటి సినిమాల్లో నటించడం వల్ల భవిష్యత్తులో చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందని అన్నారు. సినిమా కథలను ఎంపిక చేసుకునే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని హితవు పలికారు. సినిమా రంగానికి భారీ స్థాయిలో అభిమానులు ఉన్న నేపథ్యంలో హీరోలు తమ సినిమాల ద్వారా సమాజంపై ఎలాంటి ప్రభావం పడుతుందనే విషయాన్ని సైతం పరిగణనలోకి తీసుకోవాలని రాజాసింగ్ సూచించారు. కాగా, టాక్సిక్ మూవీపై రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. యశ్ హీరోగా రిలీజ్ అయిన టాక్సిక్ మిక్స్‌డ్ టాక్‌తో రన్ అవుతోంది. ఇక రవితేజ నటించిన ఇరుముడి మూవీ మాత్రం దూసుకెళ్తుంది. చాలా మంది ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లలో సినిమా చూసేందుకు ఇష్టపడుతున్నారు. మూవీ రిలీజ్ అయి రెండో వారం అవుతున్నా.. క్రేజ్ మాత్రం తగ్గటం లేదు. చాలా మంది ఇరుముడి మూవీ బాగుందని చెబుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

# నేడు విశాఖలో ఏఐజీ ఆస్పత్రికి శంకుస్థాపన






**విజయవాడ, ఆగస్ట్ 30, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో అంతర్జాతీయ స్థాయి ఆస్పత్రి రానుంది. విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న ఏఐజీ ఆస్పత్రికి ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ప్రపంచస్థాయి హెల్త్‌కేర్, అకడమిక్ అండ్ రీసెర్చ్ హబ్ ఏర్పాటు చేయనుంది. రూ.2వేల కోట్ల పెట్టుబడితో 9వేల మందికి ఉద్యోగాలను ఏఐజీ హాస్పిటల్స్ కల్పించనుంది. విశాఖలో 9 ఎకరాల్లో ఈ ఆస్పత్రి క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏఐజీ హాస్పిటల్స్ ఏర్పాటు చేయనుంది. 50కు పైగా వైద్య ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనుంది. వైద్యరంగంలో ఏఐజీ హాస్పిటల్స్‌కు 30 ఏళ్లకు పైగా అనుభవం ఉంది.

# ఇకపై వేరే విధంగా ట్రీట్ చేయాల్సి ఉంటుంది

(మొదటి పేజీ తరువాయి)

జగన్ నాయకత్వాన్ని, వ్యక్తిత్వాన్ని టార్గెట్ చేసి దాడి చేస్తున్నారని సజ్జల మండిపడ్డారు. విజయసాయిరెడ్డి ఆరోపణలతో వైసీపీలో అపోహలు రావొచ్చన్న సజ్జల రామకృష్ణారెడ్డి.. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వివరణ ఇస్తున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్ కోటరీలో బందీ అయితే వైసీపీ తక్కువ సమయంలోనే అధికారంలోకి వచ్చేదా అని సజ్జల ప్రశ్నించారు. విజయసాయిరెడ్డి తన సొంత కారణాలతో వైసీపీ నుంచి బయటకు వెళ్లారని.. ప్రజల దృష్టి తన మీద ఉండాలనే ఉద్దేశంతోనే జగన్ మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని సజ్జల ఆరోపించారు. జగన్‌ను విమర్శిస్తే తనకు పబ్లిసిటీ వస్తుందనే, కోటరీ వంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్‌కు అన్ని మతాల పట్ల సమాన గౌరవం ఉందని స్పష్టం చేశారు. వైసీపీలో జగన్ ఒక్కరే నాయకుడని.. నంబర్ వన్, నంబర్ టూ అనే ప్రశ్నే లేదన్నారు. వైఎస్ జగన్ లేని వైసీపీకి అర్థమే లేదని.. తామంతా వైసీపీ కార్యకర్తలమని సజ్జల స్పష్టం చేశారు. వైఎస్ జగన్ విజయసాయిరెడ్డికి ఎంతో గౌరవం ఇచ్చారని, ఉన్నత స్థానంలో కూర్చోబెట్టారన్నారు. వైసీపీలో విజయసాయిరెడ్డికి వచ్చినన్ని పదవులు ఎవరికీ రాలేదని.. పార్టీలో ఆయనను వెనక్కి లాగారన్న ఆరోపణకు ఆయనకు వచ్చిన పదవులే సమాధానమని సజ్జల అభిప్రాయపడ్డారు. 2020 నుంచే వైసీపీలో తనను తగ్గించారని విజయసాయిరెడ్డి అంటున్నారని.. అలాంటప్పుడు 2022లో రాజ్యసభకు ఎందుకు పంపిస్తారని ప్రశ్నించారు. వైసీపీకి రాజీనామా చేసినప్పుడు వ్యక్తిగత కారణాలతో అని చెప్పిన విజయసాయి రెడ్డి.. ఇప్పుడు ఎందుకు మాట మార్చారని సజ్జల ప్రశ్నించారు. కొత్త పార్టీ పెట్టుకోవాలనుకుంటే పెట్టుకోవచ్చని, కానీ అందుకు కావాల్సిన ప్రచారం కోసం జగన్, వైసీపీని టార్గెట్ చేయడం సరికాదన్నారు. ఇప్పటి వరకూ మన సాయిరెడ్డి అని సంయమనంతో ఉన్నామని.. ఇకపైనా విజయసాయిరెడ్డి ఇదే ధోరణి కొనసాగిస్తే.. రాజకీయంగా వేరే విధంగా ట్రీట్ చేయాల్సి వస్తుందని సజ్జల రామకృష్ణారెడ్డి హెచ్చరించారు.

# కడప రైతు వరదరాజ్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాకు చెందిన రైతు వరదరాజ్ విజయగాథను ప్రధాని మోదీ ప్రస్తావించారు. మన్ కీ బాత్ 137వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. గతంలో భారతదేశంలో పెద్దగా పరిచయం లేని, తక్కువ విలువ, డిమాండ్ కలిగిన అవకాడో ఇప్పుడు ఎంతో ఆదరణ పొందిందని గుర్తు చేశారు. డైనింగ్ టేబుళ్ల మీద ఇది తరచుగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే కడపకు చెందిన వరదరాజ్, తమిళనాడుకు చెందిన చంద్రశేఖరన్ అనే రైతులను ఉదాహరణగా ప్రస్తావించారు. "ఈ రోజుల్లో అవకాడో గురించి బాగా చర్చ జరుగుతోంది. గతంలో ఈ పండు గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలిసేది. దీని విలువ, డిమాండ్ రెండూ తక్కువగా ఉండేవి. కానీ ఈ రోజు ఇది డైనింగ్ టేబుల్స్ మీద తరచుగా కనిపిస్తోంది, ఇది మన రైతు సోదర, సోదరీమణులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆరోగ్య, ప్రీమియం మార్కెట్లలో అవకాడోకు మంచి ఆదరణ లభిస్తోందని, రైతులకు ఇది కొత్త అవకాశాలను కల్పిస్తోందని పేర్కొన్నారు.

"కడపకు చెందిన వరదరాజ్.. తన పొలంలో ఏళ్లుగా టమోటాలు, అరటిపండ్లను సాగు చేస్తూ వచ్చారు. ఓ రోజు ఆయన తన స్నేహితుడి పొలంలో అవకాడో





పంటను చూశారు. ఆ తర్వాత, యూట్యూబ్ ద్వారా అవకాడో పంట సాగు గురించి సమాచారాన్ని సేకరించారు. వరదరాజ్ ఇప్పటివరకు దాదాపు నాలుగు టన్నుల అవకాడోలను పండించారు. వాటిని నేరుగా స్థానిక దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఈ కొత్త పంట, శాస్త్రీయ సలహాలు , ప్రత్యక్ష విక్రయ విధానం వరదరాజ్ చిన్న పొలం నుంచి వచ్చే ఆదాయాన్ని పూర్తిగా మార్చివేశాయి," అని ప్రధాని మోదీ ప్రశంసించారు.

తమిళనాడులోని కొడైకెనాల్‌కు చెందిన చంద్రశేఖరన్ అనే రైతు గురించి కూడా ప్రధాని మోదీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. చంద్రశేఖరన్ తనకు ఉన్న అర ఎకరం భూమిలో అవకాడో సాగు చేస్తున్నారని.. మంచి ధరల వలన, అతని ఆదాయం పెరిగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కర్ణాటకలోని చిక్కమగళూరులో రైతులు తమ కాఫీ తోటల మధ్య అవకాడో సాగు గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. దీనివల్ల వారికి కాఫీ, నల్ల మిరియాల సాగుతో పాటు అదనపు ఆదాయం లభిస్తోందని మోదీ వివరించారు. నగరాల్లోని రెస్టారెంట్లలో అవకాడో టోస్ట్ గురించి తరుచుగా వింటున్నామని.. అదే అవకాడో ద్వారా వినూత్న ఆలోచనలు కలిగిన రైతులు ఆదాయం పొందేందుకు కొత్త మార్గాన్ని కనుగొన్నారని మోదీ ప్రశంసించారు. మన దేశంలో పండిన అవకాడో.. టోస్ట్ రుచిని పెంచడంతో పాటు రైతుల ఆదాయాన్ని కూడా పెంచిందని మోదీ పేర్కొన్నారు.

# 700 దాటిన మృతుల సంఖ్య 3000 మంది ఆచూకీ గల్లంతు





(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం నాటికి నేపాల్, టిబెట్ సరిహద్దు పరిధిలో దాదాపు 734 మంది మృతదేహాలను అధికారులు వెలికితీశారు. కనీసం 3,000 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయినట్లు అధికారిక వర్గాలు ధృవీకరించాయి.

టిబెట్ వైపు ప్రారంభమైన ఈ ప్రళయ ప్రవాహం బుధవారం ఉదయం నేపాల్ సరిహద్దుల గుండా ఉధృతంగా విరుచుకుపడింది. రాజధాని కాట్మండుకు నైరుతి దిశలో ఉన్న రసువా, ధాడింగ్, నువాకోట్ జిల్లాల్లో భోటేకౌశి నది ప్రవాహం ఒక్కసారిగా ఉప్పొంగడంతో పదుల సంఖ్యలో గ్రామాలు.. నిమిషాల వ్యవధిలో నిలువునా కొట్టుకుపోయాయి.

మన పొరుగు దేశమైన నేపాల్‌లో సంభవించిన ఈ తీవ్ర ఘోరం పట్ల భారత ప్రభుత్వం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

**సొరంగంలో చిక్కుకున్న 100 మందికి పైగా కార్మికులు..**

వరద ప్రభావిత నదీ పరివాహక ప్రాంతాల్లోని జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న 933 మంది సిబ్బంది ఆచూకీ లభించడం లేదు. ముఖ్యంగా త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్రాజెక్టుకు చెందిన టన్నెల్‌లో దాదాపు 100 మందికి పైగా కార్మికులు చిక్కుకుపోయారు. వారిని ప్రాణాలతో బయటకు తీసేందుకు నేపాల్ సైన్యం తీవ్రంగా శ్రమిస్తోంది. పైపుల ద్వారా టన్నెల్లోకి ఆక్సిజన్‌ను పంపుతూ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది.

అయితే రాత్రివేళ భారీ వర్షాలు కురవడం, నదిలో నీటి మట్టం మరింత పెరగడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

**రంగంలోకి భారత్, చైనా ప్రత్యేక బృందాలు..**

టన్నెల్స్ లోపల చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసే ప్రక్రియలో భారత్ తన అనుభవాన్ని ఉపయోగిస్తోంది. మన దేశం నుంచి 11 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక రెస్క్యూ బృందాన్ని అక్కడికి పంపించగా, చైనా కూడా 9 మంది నిపుణుల బృందాన్ని రెస్క్యూ ఆపరేషన్ కోసం రంగంలోకి దించింది. నేపాల్ హోంమంత్రి సుదాన్ గురుంగ్ క్షేత్రస్థాయిలో ఉంటూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

**విపత్తుకు అసలు కారణం ఏంటి?**

యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) అందించిన సమాచారం ప్రకారం.. నేపాల్‌లోని 'లిరుంగ్ పీక్' దక్షిణ వాలుపై ఉన్న ఒక భారీ హిమానీనదం ఒక్కసారిగా బద్దలైంది. దీనితో టన్నుల కొద్దీ మంచు, రాళ్లు కొండచరియల రూపంలో కిందకి పడి నదీ ప్రవాహాన్ని అనూహ్యంగా ముంచెత్తాయి. హిమాలయ పర్వత ప్రాంతాల్లో రోజురోజుకూ పెరుగుతున్న వాతావరణ మార్పుల వల్లే ఇటువంటి భయానక ప్రమాదాలు ఎదురవుతున్నాయని నేపాల్ విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.

**అంతర్జాతీయ సమాజం భారీ ఆర్థిక సాయం..**

ఈ జలప్రళయం వల్ల 93,000 మందికి పైగా నిరాశ్రయులైనట్లు అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ తెలిపింది. పరిస్థితి విషమించడంతో నేపాల్ ప్రభుత్వం అంతర్జాతీయ సహాయాన్ని కోరింది. మృతదేహాలను గుర్తించడానికి డీఎన్ఏ టెస్టింగ్ కిట్లు, బాడీ ఫ్రీజర్లు, బరువైన నిల్వలను మోయగలిగే హెవీ లిఫ్ట్ డ్రోన్లను పంపాలని విజ్ఞప్తి చేసింది. నేపాల్‌ను ఆదుకునేందుకు అంతర్జాతీయ సమాజం ముందుకు వచ్చింది. అమెరికా, కెనడా చెరో 3.6 మిలియన్ డాలర్లు, బ్రిటన్ 6.8 మిలియన్ డాలర్లు, ఐక్యరాజ్యసమితి 2.5 మిలియన్ డాలర్ల అత్యవసర నిధులను ప్రకటించాయి. యూరోపియన్ యూనియన్ 2.3 మిలియన్ డాలర్ల ఆర్థిక సాయం అందించేందుకు ఒప్పందం కుదుర్చుకోగా, రెడ్ క్రాస్ సంస్థ 31 మిలియన్ డాలర్ల సాయం కోసం పిలుపునిచ్చింది. ప్రస్తుతం కాట్మండును దెబ్బతిన్న ప్రాంతాలతో అనుసంధానించే ప్రధాన రహదారులను పునరుద్ధరించేందుకు సహాయక బృందాలు శ్రమిస్తున్నాయి. నదీ ప్రవాహాలు మళ్లీ పెరిగే ప్రమాదం ఉండటంతో తీర ప్రాంత ప్రజల మొబైల్ ఫోన్లకు అధికారులు కంటిన్యూస్‌గా అలర్ట్ మెసేజ్‌లు పంపుతున్నారు.

# దేశానికి డ్రగ్స్ పీడ వదిలిపోవాలి



(మొదటి పేజీ తరువాయి)

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా కంటెంట్ క్రియేటర్లు తమ తమ భాషల్లో ప్రచారం చేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఈ వ్యసనం కుటుంబాలను, సమాజాన్ని నాశనం చేస్తుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాలకు యువత ఎందుకు దూరంగా ఉండాలో విశదీకరించాలని కంటెంట్ క్రియేటర్లకు సూచించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న వారిని, ఈ వ్యసనానికి బానిసలైన వారికి సాయం చేసే వారిని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించారు.

వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన సందర్భంలో ఈ సంవత్సరం భారతీయులందరికీ ఎంతో ప్రత్యేకమైనదని కూడా ప్రధాని చెప్పారు. సూర్యపథ్ తిరంగా కార్యక్రమం ద్వారా ఈ ఏడాది మువ్వన్నెల జెండా యావత్ ప్రపంచాన్ని చుట్టొచ్చిందని అన్నారు.

మహిళల అభ్యున్నతి కోసం ఉద్దేశించిన పీఎం స్వనిధి యోజన గురించి ప్రధాని మాట్లాడారు. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 35 లక్షల మంది మహిళలు తమ వ్యాపారాలను విస్తరించగలిగారని అన్నారు. పరిశరాల పరిశుభ్రతపై నిరంతరం దృష్టి పెట్టాలని కూడా పిలుపునిచ్చారు. స్థానిక ఉత్పత్తులకు భారతీయులు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు.

**కంటెంట్ క్రియేటర్లు..యూట్యూబర్లకు మోదీ సూచన..!**

క్షణికమైన ఆనందాన్నిచ్చే మత్తు పదార్థాలు ఉజ్వల భవితను దెబ్బతీసి వ్యక్తిగత జీవితాన్ని అంధకారంలోకి నెట్టేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతినబూనాలని యువతకు పిలుపునిచ్చారు. ఎటువంటి మత్తు పదార్థాలకైనా బానిసలు కాకుండా దూరంగా ఉండేలా మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అవగాహన కల్పించాలని కంటెంట్ క్రియేటర్లు, యూట్యూబర్‌లకు సూచించారు. ఆదివారం మన్‌కీ బాత్ 137వ కార్యక్రమంలో మాట్లాడుతూ..ఈ మేరకు యువతకు దిశానిర్దేశం చేశారు.

'మాదక ద్రవ్య రహిత భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశం యావత్తూ కలిసి రావాలని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు.

మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి విముక్తులైన వారిని సమాజం అక్కున చేర్చుకుని గౌరవించాలన్నారు. సమాజమద్దతు, యోగ, ధ్యానం, దృఢచిత్తం, ఆత్మవిశ్వాసం ద్వారా మత్తుపదార్థాలకు దూరం కావొచ్చన్నారు. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో యువత పెద్ద మొత్తంలో హాజరవుతున్నారని పేర్కొన్నారు.

**పీఎం స్వనిధి యోజన..**

వీధి వ్యాపారుల కోసం తీసుకొచ్చిన 'పీఎం స్వనిధి యోజన' లక్షల మంది మహిళలకు ఉపయోగపడుతోందని మోదీ పేర్కొన్నారు. దీనిద్వారా దాదాపు 46శాతం మంది మహిళలు తమ వ్యాపారాలను విస్తరించుకుంటూ.. ఆదాయాన్ని పెంచుకుంటున్న అంశాన్ని గుర్తుచేశారు.

**మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం**

ప్రధాని మోదీకి మరో అరుదైన గౌరవ పురస్కారం లభించింది. ఉజ్బెకిస్థాన్ అత్యున్నత 'ఒలియ్ దరాజాలి దస్లిక్' పురస్కారాన్ని అందుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆయనకు అవార్డు అందజేశారు. ఇది మోదీకి లభించిన 36వ అంతర్జాతీయ పురస్కారం. ఈ అవార్డు అందుకోవడం గర్వంగా ఉందని..

దీనిని ఇరుదేశాల మధ్య ఉన్న శాశ్వత బంధానికి అంకితం చేస్తున్నారని ప్రధాని పేర్కొన్నారు.

యురేనియం సరఫరా కోసం భారత్‌ఉజ్బెకిస్థాన్ దీర్ఘకాలిక ఒప్పందాన్ని చేసుకోనున్నట్లు ప్రకటించారు. మరిన్ని ఒప్పందాలపైనా చర్చలు జరుపుతున్నామన్నారు.

# ముస్లింలేని భారత్‌ను కోరుకునేవారు హిందువే కాదు

**యూకే, ఆగస్ట్ 30, అనంతజనశక్తి న్యూస్**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భగవత్ ప్రసంగిస్తూ మత సామరస్యానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఆ సంస్థ హిందూత్వ భావజాలం నేపథ్యంలో గతంలో ఆయనను పదేపదే అడిగిన 'మరి ముస్లింల పరిస్థితి ఏమిటి?' అనే ప్రశ్నకు ఆయన నేరుగా సమాధానమిచ్చారు. ''మిమ్మల్ని మీరు హిందువు అని చెప్పుకోవాలనుకుంటే, అన్ని మార్గాలు ఒకే గమ్యస్థానానికి చేరుకుంటాయని మీరు నమ్మాలి.. ప్రతి మనిషికి ఆత్మగౌరవం ఉంటుంది. మానవుల మధ్య ఎలాంటి తారతమ్యాలు లేవు'' అని భగవత్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన ఓ సంఘటనను గుర్తుచేసుకున్నారు. ''ఒకసారి నేను మాట్లాడిన కార్యక్రమంలో ముస్లిం సోదరులు కూడా ఉన్నారు. వారు నన్ను ఒక ప్రశ్న అడిగారు: 'మీరు హిందూ సంస్థ, హిందూ రాష్ట్రం అని చెబుతున్నారు, మరి ముస్లింలమైన మా పరిస్థితి ఏమిటి? మమ్మల్ని బయటకు పంపేస్తారా?'' అని. దానికి నేను 'లేదు, అది హిందూత్వ కానే కాదు' అని చెప్పాను.' అని అన్నారు. అంతేకాదు, ''భారత్‌లో ముస్లింలు ఉండకూడదని ఏ హిందువైనా భావిస్తే, అతడు అసలు హిందువుగానే మిగలడు'' అని ఆయన స్పష్టం చేశారు.

హర్యానాలో జరిగిన మరో సంఘటనను మోహన్ భగవత్ ప్రస్తావిస్తూ.. ''మా వాలంటీర్లు అందరికీ సమానంగా సేవ చేస్తారు... భారత్‌లోని హర్యానా ప్రాంతంలో ఉన్న దాద్రి అనే ప్రదేశం వద్ద రెండు విమానాలు ఢీకొన్నాయి... అందులోని ప్రయాణికులలో అత్యధికులు ముస్లింలు. మా స్వయంసేవకులు అందరికంటే ముందే అక్కడికి చేరుకున్నారు. క్షతగాత్రులకు వారు సేవ చేశారు.. అయితే ప్రాణాలతో చాలా తక్కువ బయటపడ్డారు.. మిగిలిన వారంతా మరణించారు.. మృతదేహాలను వెలికి తీసి, అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు... ఆ సమయంలో ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు 'వీరు ముస్లింలు' అని ఏనాడూ భావించలేదు'' ఆయన అన్నారు.

మరింత వివరణ ఇస్తూ ''అక్కడ ప్రధానంగా పని చేసిన సంస్థ ఆర్ఎస్ఎస్. మేము రాజకీయాలో లేకపోవడం వల్లే ఇది చేయగలిగాం. దీని నుంచి ఎలాంటి ప్రతిఫలం ఆశించం కాబట్టి మేము ఈ విషయాలను ప్రచారం చేసుకోం. మేము కేవలం సేవ మాత్రమే అందిస్తాం.. మాకు ఏమీ అవసరం లేదు'' అని ఉద్ఘాటించారు. ప్రయాణికులు, సిబ్బంది సహా 349 మంది ప్రాణాలు కోల్పోయిన 1996 నాటి అత్యంత ఘోరమైన విమాన ప్రమాదాన్ని ఉద్దేశించి ఆర్ఎస్ఎస్ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ దుర్ఘటనలో సౌదీ అరేబియన్ ఎయిర్‌లైన్స్ విమానం 763 (బోయింగ్ 747), కజకిస్థాన్ ఎయిర్‌లైన్స్ విమానం 1907 (ఇల్యూషిన్ Il76) ఒకదానినొకటి ఢీకొన్నాయి. భాషా సమస్య కారణంగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో సరిగ్గా సమాచారం లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని నివేదికలు తెలిపాయి.

అమెరికా పర్యటనలో ఉన్న భగవత్ పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అయితే, న్యూయార్క్ మేయర్, భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ నుంచి ఆయన విమర్శలను ఎదుర్కొన్నారు. భారత్‌లో అధికారంలో ఉన్న బీజేపీకి సిద్ధాంతకర్త అయిన ఆర్ఎస్ఎస్ ఒక మతతత్వ సంస్థ అని మమ్దానీ వ్యాఖ్యానించారు.

# మూడు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు

(మొదటి పేజీ తరువాయి)

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం నేపథ్యంలో అధికారులు ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. కొల్లం వాగు వద్ద ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని సొరంగ మార్గంలోకి విడుదల చేశారు. నీటి ప్రవాహం, గేట్ల పనితీరు, సొరంగంలో నీటి తరలింపు ప్రక్రియను పరిశీలించారు.

**శాప్ మాజీ చైర్మన్ కుమార్తె వివాహ వేడుకకు హాజరైన చంద్రబాబు**

తొట్టంబేడు మండలం సీఆర్ఎస్ కండ్రిగ సమీపంలోని సీసీఎన్ కన్వెన్షన్ హాల్‌లో శాప్ మాజీ చైర్మన్, దివంగత పీఆర్ మోహన్ కుమార్తె వివాహ వేడుకకు సీఎం చంద్రబాబు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, నెలవల విజయశ్రీ, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ తదితరులు వేడుకలో పాల్గొన్నారు.

**పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన ఖరారు**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 1వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారైంది. సెప్టెంబర్ 1వ తేదీన ఉదయం 9:45కు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో సీఎం బయల్దేరనున్నారు. ఉదయం 10:30కు మొగల్తూరు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. సీఎంకు మొగల్తూరులో ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలకనున్నారు. మొగల్తూరు నుంచి రోడ్డు మార్గంలో నరసాపురానికి ముఖ్యమంత్రి ప్రయాణించనున్నారు.

ఉదయం 11:05కు పొన్నపల్లిలో ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులతో సీఎం ముఖాముఖి నిర్వహించనున్నారు. గోదావరి గట్టు వద్ద పెన్షన్ లబ్ధిదారులతో చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం అవుతారు. నరసాపురంలో గోదావరి నదిలో బోట్ రైడ్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు మొగల్తూరు ప్రజా వేదికకు సీఎం చేరుకుంటారు. ప్రజావేదిక సమావేశానికి హాజరై ప్రసంగిస్తారు. అనంతరం మొగల్తూరులో వివిధ స్టాళ్లను సందర్శించనున్నారు.

మధ్యాహ్నం 2:55కు మొగల్తూరులో టీడీపీ కేడర్ సమావేశానికి ముఖ్యమంత్రి హాజరవుతారు. నరసాపురం నియోజకవర్గ కేడర్‌తో చంద్రబాబు సమావేశమై పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేస్తారు.



సాయంత్రం 4:35కు మొగల్తూరు నుంచి హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణం అవుతారు. సాయంత్రం 5:20కు ఉండవల్లి నివాసానికి సీఎం చంద్రబాబు చేరుకుంటారు.

# భారతీయ ప్రామాణిక సమయం నోటిఫై
# యూటీసీకి 5.30 గంటలు కలిపితే అదే ఐఎస్‌టీ



**- 180 రోజుల తర్వాత నుంచి అమల్లోకి**

భారతీయ ప్రామాణిక సమయాన్ని (ఇండియన్ స్టాండర్డ్ టైం) కేంద్ర వినియోగ వ్యవహారాల శాఖ నోటిఫై చేసింది. లీగల్ మెట్రాలజీ చట్టం2009లోని సెక్షన్ 52కింద ఉన్న అధికారాలను ఉపయోగించి ఇందుకు సంబంధించిన నిబంధనలను విడుదల చేసింది. కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైం (యూటీసీ)కి 5.30 గంటలను జతచేస్తే వచ్చే సమయాన్ని భారతీయ ప్రామాణిక సమయంగా ప్రకటించింది. అదే అధికారిక సమయం అని, దాన్నే భారత్‌లో వాణిజ్య, న్యాయపరమైన కార్యకలాపాలకోసం ఉపయోగించాలని స్పష్టంచేసింది. సమయాన్ని గంటలు: నిమిషాలు: సెకెండ్ల రూపంలో ప్రదర్శించాలి. లీగల్ మెట్రాలజీ (ఇండియన్ స్టాండర్డ్‌టైం) రూల్స్2026 పేరుతో జారీచేసిన ఈ నిబంధనలు 180 రోజుల తర్వాతి నుంచి అమల్లోకి వస్తాయి. దీన్ని అన్ని న్యాయ, ప్రభుత్వ, పరిపాలన కార్యకలాపాల్లో ఉపయోగించాలి. వాణిజ్యం, రవాణా, ఆర్థిక లావాదేవీలు, న్యాయపరమైన ఒప్పందాలకు ఈ సమయాన్నే ప్రాతిపదికగా తీసుకోవాలి. రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో భారతీయ ప్రామాణిక సమయాన్ని ప్రదర్శించడం తప్పనిసరి. టెలికం, బ్యాంకింగ్, ఇంధనం, డేటా సెంటర్లలాంటి ముఖ్యమైన రంగాలు తమ వ్యవస్థలను ఐఎస్‌టీతో అనుసంధానించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇస్రో 'నావిక్'ను, ప్రాంతీయ ప్రామాణిక ప్రయోగశాలల్ని ప్రాతిపదికగా తీసుకోవచ్చు.

**ఉల్లంఘిస్తే జరిమానా.. శిక్ష**

ఇతర సమయాలను ప్రామాణికంగా తీసుకోవడం ఇక నిషిద్ధం. జాతీయ, ఆర్థిక భద్రతను కాపాడుకోవడానికి రక్షణ, విద్యుత్తు వ్యవస్థలు, టెలికమ్యూనికేషన్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్, రవాణా, పరిశ్రమలు, డేటా సెంటర్లు నావిక్ లేదంటే ఇతర అధీకృత వనరులను ఉపయోగించాలి. అన్ని సంస్థలు, వ్యవస్థలు తమ గడియార వ్యవస్థల్ని వీటితో సమీకృతం చేసుకోవాలి. ఆదేశాలను ఉల్లంఘిస్తే లీగల్ మెట్రాలజీ డైరెక్టర్ విచారణ జరిపి జరిమానాలు, శిక్షలు విధిస్తారు.

# త్రివేణీ సంగమం.. సూక్ష్మజీవులకూ
# అపురూప సంగమమే

**- త్రివేణీ సంగమం.. సూక్ష్మజీవులకూ అపురూప సంగమమే**



ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీ సంగమం కేవలం ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన ప్రదేశం మాత్రమే కాదని, ఈ సంగమం వద్ద గంగా నదిని అత్యంత అద్భుతమైన సూక్ష్మజీవుల ప్రయోగశాలగా మార్చే ప్రత్యేకమైన వైరల్‌బ్యాక్టీరియల్ పరస్పర చర్య జరుగుతుందని ఒక కొత్త పుస్తకం పేర్కొంది. 'ది రివర్ దట్ రిమెంబర్స్: మైక్రోబియల్ ఇంటెలిజెన్స్ ఆఫ్ నేచర్' అనే పుస్తకంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రయాగ్‌రాజ్ నివాసి, స్వతంత్ర పరిశోధకుడైన అజయ్ కుమార్ సోంకర్ సూక్ష్మజీవశాస్త్రం (మైక్రోబయాలజీ), వైరాలజీ, సాంస్కృతిక స్మృతిని మేళవించి గంగా నది విశిష్టతను ఏకరవుపెట్టారు.
'త్రివేణీ సంగమంలో భక్తులు ఆచరించే ప్రతి పవిత్ర స్నానం గంగా జలాల్లో గాఢమైన సూక్ష్మజీవుల మార్పిడిగా రూపాంతరం చెందుతుందని రచయిత అభిప్రాయపడ్డారు. కుంభమేళా వంటి కార్యక్రమాల సమయంలో భక్తుల నుంచి భారీగా బ్యాక్టీరియా ప్రవేశించడం వల్ల ఫేజ్ పరిణామం వేగవంతం అవుతుందని, పుణ్యస్నానాల తర్వాత ఫేజ్ సాంద్రత, వైవిధ్యం గరిష్ఠ స్థాయికి చేరుకుంటాయని ఆయన చెప్పారు. బ్యాక్టీరియాను హతమార్చే వైరస్‌లనే బ్యాక్టీరియో ఫేజ్‌లు అంటారు. గత ఏడాది మహా కుంభమేళా జరిగిన 45 రోజులలో భారతదేశం నలుమూలల నుంచి, విదేశాల నుంచి 66 కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమానికి తరలివచ్చారు. ఈ తీర్థ యాత్రికులలో ప్రతి ఒక్కరూ ప్రత్యేకమైన మైక్రోబయోటా, బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్ ఇతర సూక్ష్మజీవులను తమతో పాటు తెస్తారని సోంకర్
రాశారు. భక్తులు గంగా స్నానం చేసినపుడు ఈ సూక్ష్మజీవులు నది నీటిలోకి విడుదలవుతాయి. అవి గంగా నదిలో అప్పటికే ఉన్న మైక్రోబయోమ్‌తో కలుస్తాయి' అని ఆయన వివరించారు. పుణ్య స్నానాల సమయంలో నదిలో ఒక అద్భుతమైన వైరల్‌బ్యాక్టీరియల్ సమరం ఆవిష్కృతమవుతుందని తెలిపారు. కాలక్రమేణా, గంగా మైక్రోబయోమ్ విభిన్న మానవ మైక్రోబయోటా ద్వారా
ఎదురయ్యే కొత్త సవాళ్లను ఎదుర్కోగల సజీవ, పరిణామ వ్యవస్థగా మారుతుందని సోంకర్ రాశారు. 'త్రివేణి సంగమం కేవలం మతపరమైన సంగమంగానే కాకుండా, భారతదేశం నలుమూలల నుండి వచ్చే వైరల్ సంగమంగా పరిణమిస్తుంద'ని సోంకర్

# బార్ కౌన్సిళ్లు ఆత్మవిమర్శ చేసుకోవాలి



**- రాజ్యాంగ విలువలకు మార్గదర్శకులు లాయర్లు**
**-ఎన్‌ఎల్‌యూ స్నాతకోత్సవంలో జస్టిస్ నాగరత్న**

పేరుకుపోతున్న కేసులు, పెరిగిపోతున్న వ్యయం వంటివాటిలో న్యాయవ్యవస్థ కూరుకుపోతున్న తరుణంలో తమ పాత్రపై న్యాయవాదులు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న అభిప్రాయపడ్డారు. ఆలోచనాధోరణిని మార్చుకుని, న్యాయం అందజేత వ్యవస్థపై న్యాయవాదులు ఒకే గొంతు వినిపించాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో శనివారం 'జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం' (ఎన్‌ఎల్‌యూ) 13వ స్నాతకోత్సవంలో ఆమె ప్రసంగించారు. బార్ కౌన్సిల్ తన సభ్యుల గౌరవాన్ని పొందకపోవడం న్యాయవాద వృత్తికి మంచి మంచిది కాదన్నారు.

''వృత్తిపరమైన విలువలు, నైతికత, సమర్థతలను కాపాడటంలో తమ ప్రాధాన్యం, పాత్ర ఏమిటనేది బార్ కౌన్సిళ్లు ఆత్మపరీక్ష చేసుకోవాలి. రాజ్యాంగ విలువలకు మార్గదర్శకులు న్యాయవాదులు. ప్రజాస్వామ్యాలకు వారు భద్రత కవచాలు. బార్‌లో ఎలాంటి వైఫల్యాలు, పొరపాట్లు జరిగినా అది మన రాజకీయ, ప్రజా జీవితాలపై ఎంతో ప్రభావం చూపిస్తుంది. క్లయింట్ల కోసం పనిచేయడాన్ని ప్రజాసేవగా భావించాలి. బార్ స్వతంత్రత అనేది న్యాయవాదుల వ్యక్తిగత లబ్ధికి ఇచ్చిన హక్కు కాదు. కక్షిదారులకు ఉపయోగపడటం, ప్రజాస్వామ్య పరిరక్షణ, న్యాయస్థానాల ఘనతను కాపాడటం వంటివాటిలో తమ పాత్ర ఎంత అనేది బార్ ఆలోచించాలి'' అని ఆమె చెప్పారు.

**ఏఐతో తీర్పులు అసాధ్యం**

న్యాయమూర్తులు ఇచ్చే తీర్పుల్ని కృత్రిమ మేధ (ఏఐ)తో ఇవ్వడం అసాధ్యమని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడానికి చట్టంపై అవగాహన మాత్రమే సరిపోదని చెప్పారు. ప్రజల్ని అర్థం చేసుకోవడం వంటివి దీనికి అవసరమవుతాయన్నారు. ఏఐని ఉపయోగించి వెలువరిస్తున్న తప్పుడు తీర్పుల వలలో పడవద్దని న్యాయవాదులకు సూచించారు.

# 1950 నాటి భూకంపం తరహాలో నేపాల్ విలయం!

**- 1950 నాటి భూకంపం తరహాలో నేపాల్ విలయం!**

**అస్సాంలో అప్పుడేం జరిగింది..**

నేపాల్‌ను ముంచెత్తిన జల ప్రళయంతో భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సరిగ్గా ఇలాంటి ప్రకృతి విపత్తే 1950లో అస్సాంలో సంభవించింది. ఆనాటి గ్రేటర్ అస్సాం, టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన భూకంపం ధాటికి జరిగిన ప్రాణ, ఆస్తి నష్టం గురించిన పూర్తి వివరాలు ఇప్పటికీ లభించకపోవడం గమనార్హం. అప్పట్లో ఆ భూకంపాన్ని కళ్లారా చూసిన ప్రత్యక్ష సాక్షులు చెప్పిన కథనాలే ఆధారంగా ఉన్నాయి.

భయంకరమైన రాత్రి..
అది 1950 ఆగస్టు 15వ తేదీ. స్వాతంత్ర్య దినోత్సవం రోజు. ఆ రోజు రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో రిక్టర్ స్కేల్‌పై 8.6 తీవ్రతతో అస్సాం, టిబెట్ ప్రాంతాలను ఒక భారీ భూకంపం వణికించింది. భూమిపై పెద్ద పెద్ద పగుళ్లు, రంధ్రాలు ఏర్పడ్డాయి. కొండచరియలు విరిగిపడి బ్రహ్మపుత్ర, దాని ఉపనదుల్లో పడ్డాయి. అలా ఏర్పడిన సహజసిద్ధమైన మట్టి ఆనకట్టలు నీటి ప్రవాహాన్ని అడ్డుకున్నాయి. ఆ తర్వాత అవి బద్దలై ఆకస్మిక వరదలకు కారణమయ్యాయి. ఇలా ఆకస్మిక వరదలు ముంచెత్తడంతో నివాస ప్రాంతాలు, వ్యవసాయ భూములు మునిగిపోయాయి. నదుల ప్రవాహ మార్గాలు మారిపోయి.. ఆ ప్రాంత భౌగోళిక స్వరూపాన్ని పూర్తిగా మార్చేశాయి. ముఖ్యంగా అస్సాంలోని బ్రహ్మపుత్ర నదీ గర్భంలో భారీగా మట్టి, ఇసుక పేరుకుపోవడంతో, నదిలోని నీటి మట్టం అమాంతం పెరిగిపోయింది. ఇది క్రమంగా ఆ రాష్ట్రంలో దీర్ఘకాలిక వరద సమస్యకు దారితీసింది. దీంతో 1950 ఆగస్టు 15న సంభవించిన భూకంపం కంటే.. ఆ తర్వాత వచ్చిన ఆకస్మిక వరదలవల్ల కలిగిన నష్టమే చాలా ఎక్కువ.



# మహిళను చంపి.. రైల్లో వదిలేసిన ఘటన.. అస్సాంలో నిందితుల అరెస్టు



చెన్నై-ఢిల్లీ రైలులో ఓ సూట్‌కేస్‌లో మానవ శరీర భాగాలు లభించిన కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. దర్యాప్తులో భాగంగా మూడు వందలకు పైగా సీసీ కెమెరాలను పరిశీలించిన అధికారులు.. అస్సాంలో తలదాచు కున్న నిందితులను అరెస్టు చేశారు. అస్సాంలోని దక్షిణ్ కృష్ణాపుర్‌కు చెందిన మాణిక్, భాగమతి దంపతులు కొన్నేళ్లుగా చెన్నైలో నివాసం ఉంటు న్నారు. ఆగస్టు 5న తమిళనాడు ఎక్స్‌ప్రె స్ ఎక్కి.. ఓ సూట్‌కేసును బోగీలో వదిలి వెళ్లి దిగిపోయారు. ఆగ్రా కంటోన్మెంట్ రైల్వే స్టేషన్‌కు రైలు చేరుకున్న తర్వాత.. బోగీలో దుర్వాసన వస్తున్నట్లు ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. తనిఖీలు నిర్వహించిన జీఆర్‌పీ పోలీసులు.. ఆ సూట్‌కేసును తెరచి చూడగా అందులో మానవ శరీర భాగాలు కనిపించాయి. దీనిపై చెన్నై పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీ కెమెరాలు పరిశీలించిన అధికారులు ఇద్దరు వ్యక్తులు ఓ సూట్‌కేసుతో అదే రైలు ఎక్కినట్లు గుర్తించారు. చెన్నైలో వారు ఉండే నివాసాన్ని గుర్తించి సోదాలు నిర్వహించారు. అక్కడ కుళ్లిన స్థితిలో రెండు శరీర భాగాలు గుర్తిం చారు. అవి ఒడిశాలోని జగత్‌సింగ్‌పు ర్‌కు చెందిన మహిళవిగా (నిషా) నిర్ధరించారు. ఆమె కూడా మాణిక్ దంపతులతో కలిసే ఉంటుందని తెలుసుకున్నారు. అయితే, హత్యకు గల కారణాలు తెలియలేదని, దర్యాప్తు చేస్తున్నామని తాంబరం పోలీసులు వెల్లడించారు.

# గెయిల్ పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీక్..
# 24కిలో మీటర్ల మేర ట్రాఫిక్ మళ్లింపులు



గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీక్ అవడంతో 24 కిలో మీటర్ల మేర ట్రాఫిక్‌ను మళ్లించారు. ఈ ఘటన మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాలో చోటుచేసుకుంది. శనివారం సాయంత్రం సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలో ఉన్న గెయిల్ పైప్‌లైన్ లీక్ అవుతుండడాన్ని గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం ఘటనా స్థలంలో అగ్నిమాపక పరికరాలను సిద్ధం చేసింది. పైప్ లైన్ రెండు వైపులా ఉన్న వాల్‌వ్‌లను మూసివేయడానికి నిపుణులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్‌ను ధూలేసోలాపూర్ హైవే వైపు మళ్లించారు. నాగ్‌పుర్ నుంచి ముంబయి వెళ్లే దారిలో కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

# కేంద్ర మంత్రుల మధ్య రిజర్వేషన్ల రగడ



దేశంలోని రిజర్వేషన్ల విధానాన్ని సమీక్షించాలంటూ హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్‌ఏఎంసెక్యులర్) చేస్తోన్న డిమాండ్ కేంద్ర మంత్రుల మధ్య వివాదానికి ఆజ్యం పోసింది. ప్రస్తుత రిజర్వేషన్లలో భాగంగానే ఎస్సీ, ఎస్టీలో ఉపకోటా/క్రిమీలేయర్ విధానాన్ని అమలుచేయాలని కేంద్ర మంత్రి జితన్‌రాం మాంఝీ నేతృత్వంలోని హెచ్‌ఏఎం(సెక్యులర్) కోరుతోంది. ఈ ఉపకోటా డిమాండ్‌ను మరో కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాస్వాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఓబీసీల్లో మాదిరిగా దళితుల్లోనూ క్రిమీలేయర్ విధానాన్ని ప్రవేశపెట్టాలంటున్న జితన్‌రాం..కేంద్ర మంత్రి పదవిని, ఆయన కుమారుడు సంతోష్‌కుమార్ బిహార్ రాష్ట్ర మంత్రి పదవిని వీడాలని పాస్వాన్ డిమాండ్ చేస్తుండడంతో వివాదం తీవ్ర రూపం దాల్చే సూచనలు కనిపిస్తున్నాయి. జితన్‌రాం మాంఝీ.. ఎస్సీలలోని బాగా వెనుకబడిన ముషాహర్ దళిత వర్గీయుడు. రిజర్వేషన్ల ప్రయోజనాలు అట్టడుగు వర్గాలకు అందడం లేదని, ఆర్థికంగా, పలుకుబడిపరంగా ముందున్న పాస్వాన్‌లు, రవిదాస్‌లు వాటిని దక్కించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. కులాల ఆధారిత రిజర్వేషన్లను రద్దుచేసి ఆర్థిక ప్రాతిపదికన వాటిని అమలు చేయాలని ఇతర వర్గాలు ఉద్యమిస్తున్న పరిస్థితుల్లో ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాలైన హెచ్‌ఏఎం(సెక్యులర్), లోక్‌జనశక్తి పార్టీ(రాంవిలాస్) మధ్య ఉపకోటా వివాదం ముదరడం గమనార్హం.

# బిహార్‌లో ఫెయిల్ ఉండదిక!



బిహార్‌లో ఇక 10, 12వ తరగతి విద్యార్థులెవరూ ఫెయిల్ కారు. కనీస మార్కులు రాకున్నా ఫెయిల్ అని ఎక్కడా కనిపించదు. కారణం... బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల మార్క్‌షీట్లలో 'ఫెయిల్' అనే పదాన్ని బిహార్ ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచే ఎత్తేస్తోంది. ఎవరైనా విద్యార్థి ఉత్తీర్ణులు అవటానికి అవసరమైన కనీస మార్కులు సాధించలేకపోతే... మెమోలో ఫెయిల్ బదులుగా... 'నైపుణ్య శిక్షణకు అర్హులు' అనే పదంతో భర్తీ చేయాలని బిహార్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విద్యార్థులను బిహార్ బోర్డ్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ అండ్ ఎగ్జామినేషన్ (బీబీఓఎస్ఈ) అందించే వృత్తి విద్యాశిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తారు. ''పరీక్షలో కనీస మార్కులు రానంత మాత్రాన విద్యార్థుల్లో నైపుణ్యం లేనట్లు కాదు. అందుకే ఈ ఏర్పాటు. ఈ మార్పును అమల్లోకి తేవడానికి విద్యాశాఖ నిబంధనలు సవరిస్తుంది'' అని బిహార్ విద్యాశాఖ మంత్రి మిథిలేశ్ తివారీ వివరించారు.

# ఆహార ఉత్పత్తులపై అధిక కొవ్వు, ఉప్పు, చక్కెర హెచ్చరికలు



ఏదైనా ఆహార ఉత్పత్తిలో సంతృప్త (శాచ్యురేటెడ్) కొవ్వు, చక్కెర, ఉప్పు అధికంగా ఉన్నట్లయితే ఆ విషయాన్ని దాని ప్యాకెట్‌పై ఎర్ర రంగులో ప్రముఖంగా హెచ్చరిక రూపంలో ముద్రింపజేయాలని ప్రతిపాదిస్తున్నట్లు 'భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ' (ఎఫ్ఎస్ఎస్ఏఐ) తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో ప్రమాణపత్రం దాఖలుచేసింది. ఆందోళన కలిగించే పోషకాలు ఎక్కువగా ఉన్న ఆహార ఉత్పత్తులపై వినియోగదారులకు సులభంగా తెలియజెప్పేందుకు ఈ ప్రతిపాదనను సిద్ధం చేసినట్లు దానిలో తెలిపింది. 'భారతీయుల ఆహార మార్గదర్శకాలు 2024' చెబుతున్న పరిమితుల కంటే ఈ మూడింటిలో ఏవి ఎక్కువగా ఉన్నా వినియోగదారులు గుర్తించేలా చేయనున్నట్లు వెల్లడించింది. ప్యాక్ చేసిన ఆహార ఉత్పత్తులపై హెచ్చరిక గుర్తులను తప్పనిసరి చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ఈ నెల 13న విచారించి, ఎఫ్ఎస్ఎస్ఏఐ పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం కోరుకోవట్లేదా అని ప్రశ్నించింది. మార్గదర్శకాలపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అఫిడవిట్ దాఖలు చేసింది. నెయ్యి, వంటనూనె, ఉప్పు, చక్కెర, బెల్లం, తేనె వంటివాటిలో సహజంగా ఈ మూడింటిలో ఏదో ఒకటి ఎక్కువగా ఉంటుంది కాబట్టి వాటిని మినహాయించి మిగిలినవాటిపై హెచ్చరికలు ముద్రింపజేస్తామని దానిలో పేర్కొంది. పరిశ్రమలకు తగినంత సమయం ఇవ్వడానికి వీలుగా దశలవారీగా అమలు చేయనున్నట్లు తెలిపింది.



## నిరంతర విద్యుత్తుకు

# అణు భరోసా

పంద్రాగస్టు సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోట ప్రసంగంలో సెమీకండక్టర్ చిప్‌లు, అణు రియాక్టర్లు వంటి కీలక అంశాలను ప్రస్తావించారు. పైకి ఇవి వేర్వేరు రంగాల్లా కనిపించినా, వాటి మధ్య బలమైన లంకె ఉంది. చిప్ కర్మాగారాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవసరం. మరి, ఆ విద్యుత్తు ఎక్కడి నుంచి వస్తుందన్నదే ప్రశ్న. ఇటీవల కల్పాక్కంలోని ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ క్రిటికాలిటీ సాధించడంతో, ఆరు దశాబ్దాల భారత అణు కార్యక్రమం రెండో దశలోకి అడుగుపెట్టింది. దీంతో ఇంధన భద్రతపై ఆశలు పెరుగుతున్నాయి.

అణు విద్యుత్ కేంద్రం కూడా ఒక సాధారణ బొగ్గు(ఉష్ణ) విద్యుత్ కేంద్రంలాగే పనిచేస్తుంది. ఈ రెండింటి మధ్య ఉన్న ఒకే ఒక్క తేడా- నీటిని వేడి చేయడానికి వాడే ఇంధనమే. బొగ్గు కేంద్రంలో కోల్‌ను మండించి వేడిని పుట్టిస్తే, అణు రియాక్టర్‌లో అణువిచ్ఛిత్తి ద్వారా వేడిని తయారు చేస్తారు. ఆ వేడితో నీటిని మరిగించి ఆవిరిగా మార్చి, ఆ ఆవిరి ఒత్తిడితో టర్బైన్‌ను వేగంగా తిప్పుతారు. తద్వారా టర్బైన్‌కు అనుసంధానించిన జనరేటర్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. కేవలం ఒక కిలో యురేనియం నుంచి వచ్చే శక్తి, కిలో బొగ్గు కంటే దాదాపు పదిలక్షల రెట్లు ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల పర్యావరణానికి హాని చేసే కర్బన ఉద్గారాలు కూడా తక్కువే వెలువడతాయి. కాలుష్య రహితమైన అపార శక్తిని అందిస్తుండటంతో ప్రపంచవ్యాప్తంగా అణు విద్యుత్తుకు ప్రాధాన్యం పెరుగుతోంది.

**కీలక మైలురాయి**

దేశంలో ప్రస్తుతం 24 అణు రియాక్టర్లుండగా, మొత్తం 8,780 మెగావాట్ల సామర్థ్యం ఉంది. 2024-25లో అవి దాదాపు 5,700 కోట్ల యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశాయి. అయినా దేశ విద్యుత్ ఉత్పత్తిలో అణు వాటా సుమారు మూడు శాతమే. బొగ్గు వాటా 70 శాతానికి దగ్గరగా ఉంది. 2031-32 నాటికి అణు విద్యుత్ సామర్థ్యాన్ని 22,480 మెగావాట్లకు, 2047 నాటికి 100 గిగావాట్లకు పెంచాలన్నది లక్ష్యం. భారత అణు పితామహుడిగా పేరొందిన హోమీ భాభా మన దేశంలోని వనరుల పరిమితిని దృష్టిలో పెట్టుకుని అణు కార్యక్రమాన్ని రూపొందించారు. మనకు యురేనియం నిల్వలు తక్కువ. థోరియం సమృద్ధిగా ఉంది. కానీ థోరియాన్ని నేరుగా ఇంధనంగా వాడలేం. మొదటి దశలో సహజ యురేనియంతో భారజల రియాక్టర్లు నడుస్తాయి. ఈ ప్రక్రియ ద్వారా తయారయ్యే ప్లుటోనియం-239ను రెండో దశలో ఫాస్ట్‌బ్రీడర్ రియాక్టర్లలో ఇంధనంగా వాడతారు. ఈ రియాక్టర్లలోని యురేనియం-238 న్యూట్రాన్లను గ్రహించి కొత్త ప్లుటోనియం-239గా మారుతుంది. మూడో దశలో థోరియం-232 న్యూట్రాన్లను గ్రహించి, వరస అణు పరివర్తనల ద్వారా యురేనియం-233గా మారుతుంది. అప్పుడు దీన్ని ఇంధనంగా ఉపయోగించవచ్చు. అందుకే రెండోదశ విజయం మూడోదశకు కీలకం. మొన్న ఏప్రిల్ 6న కల్పాక్కంలోని 500 మెగావాట్ల ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ తొలిసారి క్రిటికాలిటీ సాధించింది. అంటే బయటి నుంచి న్యూట్రాన్లను అందించాల్సిన అవసరం లేకుండా, గొలుసు చర్య తనంతట తానే స్థిరంగా కొనసాగే స్థితికి రియాక్టర్ చేరుకుంది. అయితే, ఈ రియాక్టర్ నిర్మాణం 2004లో మొదలై, తొలి క్రిటికాలిటీకి 22 ఏళ్లు పట్టింది. కొత్త లక్ష్యాలు సాధించాలంటే వేగం పెరగాల్సిన అవసరాన్ని ఇది చెబుతోంది. థోరియం మన నేలలో ఉన్నా, దాన్ని ఇంధనంగా మార్చేందుకు రెండో దశ రియాక్టర్లు ముందుగా పనిచేయాలి. అందుకే కల్పాక్కం రియాక్టర్ క్రిటికాలిటీ ఒక మైలురాయి.

నిరుడు పార్లమెంటు 'శాంతి' చట్టాన్ని ఆమోదించింది. లైసెన్సు పొందిన ప్రైవేటు సంస్థలకు అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణం, నిర్వహణకు మార్గం తెరిచింది. యురేనియం శుద్ధి, ఇంధన పునఃశుద్ధి ప్రభుత్వ అధీనంలోనే ఉంటాయి. నష్టపరిహార వ్యవస్థలోనూ మార్పులు చేసి, సరఫరాదారుల బాధ్యతను తొలగించి నిర్వాహక సంస్థ బాధ్యతకు పరిమితి విధించారు. దీంతో దేశీయ ప్రైవేట్ పెట్టుబడులకు, విదేశీ సంస్థల నుంచి సాంకేతికత, పరికరాల సరఫరాకు మార్గం సుగమమైంది. భవిష్యత్ సామర్థ్యంలో చిన్న రియాక్టర్ల పాత్ర కీలకం కావడంతో భాభా అణు పరిశోధన కేంద్రం 200 మెగావాట్ల భారత్ స్మాల్ మాడ్యులర్ రియాక్టర్, 55 మెగావాట్ల చిన్న రియాక్టర్, హైడ్రోజన్ ఉత్పత్తికి 5 మెగావాట్ల థర్మల్ గ్యాస్ రియాక్టర్‌ను రూపొందిస్తోంది. చిన్న రియాక్టర్లను కర్మాగారంలో తయారు చేసి, అవసరమైన చోటుకు తరలించవచ్చు. మూతపడుతున్న బొగ్గు కేంద్రాల స్థలాల్లో వీటిని ఏర్పాటుచేస్తే, ఇప్పటికే ఉన్న గ్రిడ్ సదుపాయాన్ని కూడా వాడుకోవచ్చు.

**పెరుగుతున్న అవసరం**

రానున్న కాలంలో విద్యుత్ అవసరం భారీగా పెరగనుంది. వాతావరణ లక్ష్యాల దృష్ట్యా బొగ్గుపై ఆధారపడలేం. సౌర, పవన విద్యుత్తు నిరంతరం అందుబాటులో ఉండవు. భారీ నిల్వ వ్యవస్థ కూడా సిద్ధంగా లేదు. అందుకని నిరంతరాయంగా విద్యుత్తును అందించే అణుశక్తి మన ఇంధన వ్యవస్థలో కీలక భాగం కావాలి. భాభా 1950లలో ఈ దారిని ఎంచుకున్నప్పుడు పరిశ్రమలు తక్కువ, వనరులు పరిమితం. యురేనియం తక్కువగా, థోరియం సమృద్ధిగా ఉన్న దేశానికి ఇది సుదీర్ఘ ప్రయాణమని ఆయనకు తెలుసు. అందుకని, మూడు దశల మార్గాన్ని రూపొందించారు. ఇన్నేళ్లకు రెండో దశకు చేరుకున్నాం. ఇక మూడో దశను సాకారం చేయాల్సిన సమయం వచ్చింది. రియాక్టర్ల ఏర్పాటుకు భూసేకరణ, అనుమతులు, ఇంధన సరఫరాతో పాటు వేలమంది ఇంజినీర్లు, రేడియేషన్ భద్రతా నిపుణులు, నియంత్రణ అధికారులను సిద్ధం చేసుకోవాలి. రియాక్టర్లను సకాలంలో నిర్మించి, నిపుణులను సిద్ధం చేయగలిగితే, ప్రణాళికలను కార్యాచరణ రూపంలోకి తేగలిగితే 2047 నాటికి అణు భారతం కేవలం లక్ష్యం కాదు- సాధించగలిగే వాస్తవమవుతుంది. ఈ ప్రయాణాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లడమే ముందున్న కర్తవ్యం.

# అచ్చేదిన్ కాదు...సచ్చేదిన్ వచ్చిందా?

## హామీల నుంచి కార్పొరేట్ రుణాల వరకు...... ప్రజల డబ్బు, ప్రభుత్వ విధానాలు ఎటు?

**"అచ్చేదిన్ వస్తుంది" అన్న నినాదంతో అధికారంలోకి వచ్చిన పాలకుల పాలనలో సామాన్య ప్రజల జీవితాల్లో నిజంగా మంచి రోజులు వచ్చాయా? లేక సామాన్యుడికి "సచ్చేదిన్" వచ్చిందా? అనే ప్రశ్న నేడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతోంది. ఎన్నికల సమయంలో విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తిరిగి తీసుకొచ్చి ప్రతి జనధన్ ఖాతాదారుడి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామనే ప్రచారం ప్రజల్లో భారీ అంచనాలను కలిగించింది. అయితే ఆ హామీ నెరవేరకపోవడం ప్రజల్లో తీవ్ర నిరాశకు కారణమైంది. ఎన్నికల హామీలు, వాటి అమలు మధ్య ఉన్న అంతరం నేడు ప్రజాస్వామ్యంలో కీలకమైన చర్చగా మారింది. ఇదే సమయంలో పెద్ద కార్పొరేట్ రుణాలు, బ్యాంకుల మొండి బకాయిలు, రుణ పరిష్కారాలు, ఆస్తుల విలువలు, ప్రజాధనంతో నడిచే ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడులపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.**






డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

**సామాన్యుడికి అప్పు భారమా? కార్పొరేట్‌కు రుణ పరిష్కారమా?**

సామాన్య రైతు, చిన్న వ్యాపారి లేదా మధ్యతరగతి కుటుంబం తీసుకున్న రుణానికి వాయిదా ఆలస్యమైనా బ్యాంకుల ఒత్తిడి తప్పదు. కానీ వేల కోట్ల రూపాయల కార్పొరేట్ రుణాలు మొండి బకాయిలుగా మారినప్పుడు, వాటి పరిష్కారంలో భారీ "హెయిర్‌కట్‌లు" కనిపించడం ఆర్థిక వ్యవస్థలో సమానత్వంపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. చిన్న రుణ గ్రహీతపై కఠిన నిబంధనలు అమలవుతుండగా, పెద్ద రుణగ్రహీతల విషయంలో వేల కోట్ల రూపాయల బకాయిలకు భారీ తగ్గింపులు ఎందుకు జరుగుతున్నాయి? ఇది నిజమైన ఆర్థిక న్యాయమా? అనే ప్రశ్న సామాన్య ప్రజల మనసుల్లో తలెత్తడం సహజం.

**విజయ్ మాల్యా నుంచి నీరవ్ మోదీ వరకు...**

విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, లలిత్ మోదీ వంటి వివాదాస్పద ఆర్థిక కేసుల్లో సంబంధిత వ్యక్తులు దేశం వెలుపల ఉండటం, వారి కేసులు సంవత్సరాల తరబడి కొనసాగడం ప్రజల్లో సహజంగానే ప్రశ్నలను రేకెత్తిస్తోంది. ప్రజల డబ్బుతో పనిచేసే బ్యాంకుల నుంచి వేల కోట్లు బయటకు వెళ్లినప్పుడు, వాటి వసూళ్లలో ఎందుకు జాప్యం జరుగుతోంది? బాధ్యత ఎవరిది? రుణాలు మంజూరు చేసే సమయంలో బ్యాంకింగ్ వ్యవస్థలో ఎలాంటి పర్యవేక్షణ జరిగింది? రుణాలు తిరిగి చెల్లించని పరిస్థితి ఏర్పడిన తర్వాత ప్రజాధనాన్ని రక్షించడానికి తీసుకున్న చర్యలు ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సిన అవసరం ఉంది.

**అదానీ వ్యవహారం...సెబీపై ప్రశ్నలు**

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక తర్వాత అదానీ గ్రూప్‌పై దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగానూ విస్తృత చర్చ జరిగింది. షేర్ మార్కెట్ నియంత్రణ, విదేశీ పెట్టుబడిదారుల వెల్లడింపులు, యాజమాన్య నిర్మాణం వంటి అంశాలపై సెబీ విచారణలు, చర్యలు, వివాదాలు కొనసాగాయి.ఇలాంటి సందర్భాల్లో నియంత్రణ సంస్థల స్వతంత్రత, పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత ముఖ్యమైనవి. ఏ సంస్థపైనా ఆరోపణలు వచ్చినప్పుడు వాటిపై నిష్పాక్షికంగా విచారణ జరగాలి. నియంత్రణ సంస్థలపై కూడా అనుమానాలు వ్యక్తమైతే వాటికి పారదర్శకమైన సమాధానాలు ఇవ్వాలి.ఆరోపణలు, విచారణలు, తుది నిర్ధారణలు మూడు వేర్వేరు అంశాలు. అందువల్ల ఆరోపణలను నేరాలుగా పరిగణించకుండా, నిజానిజాలు తేలే వరకు వాటిని ప్రశ్నలుగా చూడడం ప్రజాస్వామ్య పద్ధతి.

**ఎల్ఐసి వంటి ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడులు**

ప్రభుత్వ రంగ సంస్థలు, ముఖ్యంగా ఎల్ఐసి వంటి సంస్థలు కోట్లాది పాలసీదారుల నమ్మకంతో పనిచేస్తాయి. వాటి పెట్టుబడుల విషయంలో పారదర్శకత, రిస్క్ అంచనా, స్వతంత్ర నిర్ణయ ప్రక్రియ, పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణ అత్యంత ముఖ్యమైనవి.ప్రజల పొదుపులతో నడిచే సంస్థలు ఏ కంపెనీలో ఎంత పెట్టుబడి పెడుతున్నాయి? ఆ పెట్టుబడులకు సంబంధించిన ప్రమాద అంచనా ఎలా జరిగింది? పెట్టుబడుల నిర్ణయాల్లో ఏ ప్రమాణాలు అనుసరించారు? అనే విషయాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది.ఇది ఏ ఒక్క కంపెనీకి సంబంధించిన ప్రశ్న కాదు. ఇది ప్రభుత్వ రంగ సంస్థల పాలన, పెట్టుబడి విధానం, నియంత్రణ వ్యవస్థపై ప్రజల విశ్వాసానికి సంబంధించిన ప్రశ్న.

**సుభాష్ చంద్ర కేసు: కొత్త చర్చకు తెర**

ఇటీవల జీ గ్రూప్ వ్యవస్థాపకుడు, ఎస్సెల్ గ్రూప్ చైర్మన్ సుభాష్ చంద్రకు సంబంధించిన వ్యక్తిగత దివాలా పరిష్కార కేసు దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. రూ.22,006.57 కోట్లు సుభాష్ చంద్ర వ్యక్తిగతంగా తీసుకున్న రుణం కాదు. ఆయన వ్యక్తిగత హామీదారుగా ఉన్న కేసులో రుణదాతలు చేసిన క్లెయిమ్‌ల మొత్తం అది. అసలు రుణాలను సంబంధిత కంపెనీలు తీసుకున్నాయి.ఎన్సిఎల్టి ఆమోదించిన పరిష్కార ప్రణాళిక ప్రకారం, సుమారు రూ.22,006.57 కోట్ల క్లెయిమ్‌లకు సంబంధించి చంద్ర వ్యక్తిగత ఎస్టేట్ నుంచి సుమారు రూ.6.5 కోట్లు చెల్లించే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. లెక్కల ప్రకారం ఇది క్లెయిమ్ చేసిన మొత్తంలో సుమారు 0.03 శాతం రికవరీకి సమానం.ఈ పరిణామం సహజంగానే ఒక పెద్ద ప్రశ్నను ముందుకు తెచ్చింది. వేల కోట్ల రూపాయల క్లెయిమ్‌లకు సంబంధించి వ్యక్తిగత హామీదారుడి ఆస్తుల నుంచి ఇంత తక్కువ మొత్తం మాత్రమే అందుబాటులో ఉంటే, మిగిలిన రుణాల బాధ్యత ఎవరిది? అసలు రుణగ్రహీత కంపెనీల నుంచి ఎంత మొత్తాన్ని తిరిగి రాబట్టారు? బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు ఎంత నష్టం జరిగింది? అనే ప్రశ్నలకు సమగ్ర సమాధానాలు అవసరం.అయితే దీనిని కేవలం "రూ.22,000 కోట్ల రుణమాఫీ"గా పేర్కొనడం కూడా పూర్తి వాస్తవాన్ని ప్రతిబింబించదు. ఇది ప్రధానంగా చంద్ర వ్యక్తిగత హామీదారుగా ఉన్న బాధ్యతకు సంబంధించిన పరిష్కారం. అసలు రుణగ్రహీత కంపెనీల బాధ్యతలు వేరుగా ఉంటాయి.

**రూ.22,006 కోట్ల క్లెయిమ్‌లు...రూ.6.5 కోట్ల పరిష్కారం**

ఎన్సిఎల్టి ఆమోదించిన పరిష్కార ప్రణాళికపై కొంతమంది రుణదాతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. హెచ్డిఎఫ్సి, ఎల్ఐసి హోసింగ ఫైనాన్స్, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్ తదితర రుణదాతల ప్రయోజనాలు కూడా ఈ పరిణామంతో ముడిపడి ఉన్నాయి.ఇది కేవలం సుభాష్ చంద్రకు సంబంధించిన వ్యక్తిగత కేసుగా చూడకూడదు. భారతదేశంలోని దివాలా చట్టాలు, వ్యక్తిగత హామీలు, బ్యాంకుల రుణ వసూళ్లు, ప్రజాధనం, కార్పొరేట్ బాధ్యత, రుణ పరిష్కార విధానాలపై ఇది పెద్ద చర్చకు దారితీసే అంశం.

**స్విట్జర్లాండ్‌లో కొత్త ప్రయాణం?**

ఇదే సమయంలో సుభాష్ చంద్ర స్విట్జర్లాండ్‌లో పెట్టుబడి రంగంలోని తన స్నేహితులతో కలిసి పని చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు. తన వద్ద మిగిలిన సుమారు రూ.6.5 కోట్లను ఆమోదిత పరిష్కార ప్రణాళిక ప్రకారం చెల్లించాల్సి ఉంటుందని, అవసరమైతే కుటుంబం నుంచి రూ.2-4 కోట్ల వరకు రుణం తీసుకుని కొన్ని స్టార్టప్‌లలో పెట్టుబడి పెట్టే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒకవైపు వేల కోట్ల క్లెయిమ్‌లపై అతి తక్కువ వ్యక్తిగత రికవరీ, మరోవైపు కొత్త పెట్టుబడుల గురించి ప్రకటన——ఈ విరుద్ధ దృశ్యం సహజంగానే ప్రజల్లో అనేక ప్రశ్నలను రేకెత్తిస్తోంది.అయితే ఆయనపై ఉన్న క్లెయిమ్‌లు, అసలు రుణగ్రహీతల బాధ్యతలు, వ్యక్తిగత హామీ బాధ్యతలను వేరు చేసి చూడాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో రుణదాతల ప్రయోజనాలు, ప్రజాధనం, బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రభావాన్ని కూడా పరిశీలించాల్సిందే.

**అసలు ప్రశ్న: ప్రజాధనానికి జవాబుదారీ ఎవరు?**

భారతదేశంలో బ్యాంకులు ప్రజల డిపాజిట్లతో పనిచేస్తాయి. ఎల్ఐసి వంటి సంస్థలు కోట్లాది పాలసీదారుల డబ్బుతో పనిచేస్తాయి. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజల ఆస్తులుగా పరిగణించబడతాయి. అందువల్ల పెద్ద మొత్తంలో రుణాలు మంజూరు చేసినప్పుడు వాటి వెనుక ఉన్న నిర్ణయ ప్రక్రియపై ప్రజలకు స్పష్టత ఉండాలి.రుణం ఎవరి ఆధారంగా మంజూరు చేశారు? ఆస్తుల విలువను ఎవరు అంచనా వేశారు? రుణం ఇచ్చే ముందు రిస్క్ విశ్లేషణ ఎలా జరిగింది? రుణం మొండి బకాయిగా మారిన తర్వాత బాధ్యత ఎవరిది? ఆస్తుల విలువ ఎలా తగ్గింది? రుణదాతలకు ఎంత మొత్తాన్ని తిరిగి రాబట్టారు? ప్రజల డబ్బుకు ఎంత నష్టం జరిగింది? సంబంధిత సంస్థలు, అధికారులు లేదా నిర్ణయాధికారులపై ఏమైనా బాధ్యత నిర్ణయించబడిందా? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాలి.

**అచ్చేదిన్ అంటే ఏమిటి?**

అచ్చేదిన్ అంటే కేవలం స్టాక్ మార్కెట్ పెరగడం కాదు. రైతుకు రుణం అందుబాటులో ఉండటం, యువతకు ఉద్యోగం రావడం, మధ్యతరగతికి ధరల భారం తగ్గడం, చిన్న వ్యాపారికి బ్యాంకు రుణం లభించడం, ప్రజాధనం సురక్షితంగా ఉండటం, పెద్ద రుణగ్రహీతైనా చిన్న రుణగ్రహీతైనా ఒకే న్యాయ ప్రమాణం వర్తించడం, ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడుల్లో పారదర్శకత ఉండటం, నియంత్రణ సంస్థలు స్వతంత్రంగా పనిచేయడం, ఆర్థిక అక్రమాలపై వేగంగా చర్యలు తీసుకోవడం——ఇవన్నీ కలిసినప్పుడే ప్రజలు నిజంగా "అచ్చేదిన్ వచ్చాయి" అని చెప్పగలరు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు, పాలనలో కనిపించే వాస్తవాలకు మధ్య అంతరం పెరిగినప్పుడు ప్రజల్లో అసంతృప్తి పెరగడం సహజం. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల పని మాత్రమే కాదు; ప్రతి పౌరుడి హక్కు, బాధ్యత కూడా.ప్రజలకు కావలసింది కేవలం నినాదాలు కాదు. ప్రజాధనానికి జవాబుదారీ పాలన కావాలి. ఆర్థిక వ్యవస్థలో సమాన న్యాయం కావాలి. ప్రభుత్వ సంస్థల్లో పారదర్శకత కావాలి. నియంత్రణ వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేయాలి. పెద్ద కార్పొరేట్ సంస్థలైనా, చిన్న వ్యాపారులైనా ఒకే నిబంధనలు వర్తించాలి. అప్పుడే దేశ ప్రజలు నిజమైన "అచ్చేదిన్"ను అనుభవిస్తున్నామని చెప్పగలరు.లేకపోతే...

అచ్చేదిన్ పేరుతో వచ్చినది సచ్చేదిన్ కాదా? ఇదే నేడు దేశ ప్రజల ముందున్న ప్రశ్న.

# ఉద్యోగాల్లో కోత... ప్రభావమెంత?

**"ఈ ఏడాది దేశీయంగా, అంతర్జాతీయంగా లేఆఫ్‌ల తాకిడి అధికమైంది. దిగ్గజ సంస్థల్లో సిబ్బంది తొలగింపు వార్తలు యువతలో గుబులు రేపుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల పురోగతి లేదా పతనానికి ఉద్యోగాల లభ్యతే ప్రధాన దిక్సూచి అని అందరూ భావిస్తారు. కానీ, ఇది సరైంది కాదు. ఉద్యోగ గణాంకాలను చూసి భవిష్యత్ ఆర్థిక స్థితిగతులు ఎలా ఉండబోతున్నాయో ఊహించడం సాధ్యం కాదు. ఆ లెక్కలు ఆర్థిక వ్యవస్థలో మార్పులు చోటుచేసుకున్న చాలాకాలం తర్వాత కనిపించే సూచీలు మాత్రమే. అందుకే, లేఆఫ్‌లను చూసి భవిష్యత్ ఆర్థిక అంచనాలను మార్చుకోవాల్సిన అవసరం లేదు."**

భారతదేశంలో సేవలు అందిస్తున్న అంతర్జాతీయ దిగ్గజ టెక్ సంస్థలతో పాటు, అనేక కంపెనీల్లో ఉద్యోగాల కోత 2026లో మరింత పెరిగింది. కృత్రిమమేధపై దృష్టి సారిస్తూ చేపట్టిన అంతర్జాతీయ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఒరాకిల్ సంస్థ ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో 12వేల మంది ఉద్యోగులను తొలగించింది. ప్రపంచవ్యాప్తంగా 3,200 ఉద్యోగాల్లో కోత విధిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ ఎక్స్‌బాక్స్ ప్రకటించింది. దీని ప్రభావం అనేకమంది భారతీయ ఉద్యోగులపై పడనుంది. ఈ పరిస్థితి ఒక్క ఐటీ రంగానికే పరిమితం కాలేదు. అన్ని రంగాలకూ విస్తరించింది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లోని కారంపూడి పరిధిలో ఉన్న శ్రీనరసింహపురి యూనిట్ లో లేఆఫ్‌లు విధిస్తున్నట్లు శ్రీచక్ర సిమెంట్ ప్రకటించింది. అలాగే చాలాచోట్ల పలు ఎంఎస్‌ఎంఈలు మూతపడటంతో వేల మంది ఉద్యోగాలు కోల్పోవడం విచారకరమే. అయితే, విస్తృత స్థాయిలో పరిశీలిస్తే భారత ఉద్యోగ విపణి అంచనా వేసిన దానికంటే మెరుగైన స్థితిలోనే ఉంది. జూన్‌లో నిరుద్యోగం 5.5శాతంతో పెద్దగా మారకపోవడం ఆర్థిక వ్యవస్థకు ఉపశమనం కలిగించే అంశమే. తక్కువ ఉపాధి అవకాశాల సమస్య వేధిస్తున్నప్పటికీ, అనుకున్నంత తీవ్రస్థాయిలో ఉద్యోగ కోతలు ఉండకపోవచ్చని ఈ గణాంకాలు చెబుతున్నాయి.

**వాస్తవాలపైనే దృష్టి**

అమెరికా ఉద్యోగ విపణిలో నిరుడు జరిగిన సిబ్బంది తొలగింపులు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఉద్యోగులకు అలా భారీ స్థాయిలో కోతలు పడినా, ఏడాది మొత్తమ్మీద కొలువుల సంఖ్య వాస్తవానికి పెరిగింది. అమెరికాలో వారపు నిరుద్యోగ భృతి దరఖాస్తులు తక్కువ స్థాయిలోనే ఉన్నాయి. ఈ క్రమంలో ఉద్యోగాల ఆధారంగా భవిష్యత్ ఆర్థిక పురోగతిని అంచనా వేయడం ఆర్థిక సూత్రాల ప్రకారం సముచితం కాదు. వినియోగదారుల వ్యయం భారత జీడీపీలో 58శాతంగా, అమెరికా జీడీపీలో 68శాతంగా ఉంది. ఉద్యోగాలు కోల్పోయేవారి సంఖ్య పెరిగితే ఆ ఖర్చులు దెబ్బతింటాయి కదా! కానీ ఆ అంచనాలు తప్పని తేలాయి. నిరుద్యోగం కాస్త పెరిగినా, వినియోగ వ్యయం తీవ్రస్థాయిలో కుప్పకూలే అవకాశాలైతే లేవు. ఆర్థిక మాంద్యం కాలంలో కూడా ఇది ఎప్పుడూ స్థిరంగానే ఉంటుంది. నిరుద్యోగంపై ఆందోళనకు సంబంధించిన తాజా కథనాలు ప్రధానంగా సామాజిక అంశాలపైనే దృష్టి సారిస్తున్నాయి. జీడీపీ వాస్తవిక పరిస్థితిని అంచనా వేయాలంటే కచ్చితమైన వాస్తవాలపైనే దృష్టి పెట్టాలి. 200709 నాటి ప్రపంచ తీవ్ర ఆర్థిక మాంద్యం సమయంలో అమెరికా జీడీపీ 3.8 శాతానికి పడిపోయింది. అదే కాలవ్యవధిలో, ద్రవ్యోల్బణ ప్రభావంతో కూడిన అమెరికా వాస్తవ వినియోగ వ్యయంలో క్షీణత కేవలం 2.3 శాతమే నమోదైంది. ఉద్యోగం కోల్పోయిన వారెవరైనా అన్నిరకాల విలాసాలకు దూరంగా ఉంటారు. కాకపోతే వినియోగ వ్యయంలో ప్రధాన భాగం నిత్యావసర సరకులు, ఇల్లు, నీటి, విద్యుత్ ఛార్జీల వంటి ప్రాథమిక అవసరాలకే పరిమితమవుతుంది. ఇలాంటి ఖర్చులు విపరీతంగా పెరగడం లేదా దారుణంగా పడిపోవడం అనేది జరగదు. ఇవెప్పుడూ దాదాపుగా స్థిరంగానే ఉంటాయి. అలాగే, ఉపాధి రంగానికి సంబంధించిన మార్పులు ఆర్థిక పరిస్థితులను కాస్త ఆలస్యంగానే ప్రతిబింబిస్తాయి. ఆర్థిక మందగమనం అమ్మకాలను దెబ్బతీస్తుండటంతో, సీఈవోలు వ్యయ నియంత్రణపై దృష్టిసారిస్తూ, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై కోత విధిస్తున్నారు. ఉద్యోగుల తొలగింపు అనేది సీఈవోలకు ఏమాత్రం ఇష్టం లేని, అత్యంత ఆలస్యంగా ఎంచుకునే చివరి ప్రత్యామ్నాయం. ఎందుకంటే, ఉద్యోగుల తొలగింపుల వల్ల సంస్థల ప్రతిష్ఠ దెబ్బతినడమే కాకుండా, ప్రతికూల కథనాలు వ్యాప్తి చెందుతాయి. ఫలితంగా కంపెనీల పని సంస్కృతితోపాటు అందరి జీవితాలు అస్తవ్యస్తంగా మారతాయి. పరిస్థితులు చక్కబడినప్పుడు, అనుభవజ్ఞులైన సిబ్బంది స్థానంలో కొత్తవారిని భర్తీ చేయడం సంస్థలకు ఎంతో భారంతో కూడుకున్నపని అవుతుంది. మార్కెట్లు మళ్లీ ఆశాజనకంగా మారినా కంపెనీలు వెంటనే నియామక ప్రక్రియను వేగవంతం చేయవు. ఊరించే తాత్కాలిక మార్కెట్ ఊపును నమ్మి ఇబ్బందుల్లో పడకూడదనే ఉద్దేశంతో, విక్రయాలు స్థిరంగా పుంజుకునేదాకా ఆచితూచి అడుగులు వేస్తాయి. అందుకని, ఆర్థిక వృద్ధి క్షీణించినా, పుంజుకున్నా ఉద్యోగాల గ్రాఫ్ దాని వెనకే నడుస్తుంది. ఎప్పుడూ వాస్తవంగా జరిగేది ఇదే.

**ఊహాజనిత భయాలతో...**

కొవిడ్ లాక్‌డౌన్ వల్ల 2020లో ఒక్కసారిగా నమోదైన తీవ్ర క్షీణతను మినహాయిస్తే, ఇటీవల భారత్‌లో జీడీపీలో పెద్దగా కుదింపులు లేకపోవడంతో, మళ్లీ అమెరికా పరిస్థితులను పరిశీలించాల్సి వస్తోంది. 200709 నాటి మాంద్యం కాలంలో, అమెరికా జీడీపీ 2007 డిసెంబరులో గరిష్ఠస్థాయికి చేరుకుంది. 2008 ఫిబ్రవరి నుంచే కొలువుల కోత మొదలైంది. 2009 రెండో త్రైమాసికంలో జీడీపీ అత్యంత కనిష్ఠ స్థాయిని తాకిన తర్వాత మళ్లీ కోలుకున్నప్పటికీ, 2010 ఫిబ్రవరి వరకు ఉద్యోగాల సంఖ్య క్షీణిస్తూ రావడం గమనార్హం. 2001 నాటి ఆర్థిక మాంద్యం అమెరికాలో ఆ ఏడాది నవంబర్ వరకు కొనసాగింది. అయినప్పటికీ, నిరుద్యోగ రేటు 2002 ఏప్రిల్ నాటికి గాని గరిష్ఠ స్థాయికి చేరుకోలేదు. మొదట ఆర్థికవృద్ధి, ఆ తర్వాతే ఉపాధి అవకాశాలు... ఎక్కడైనా ఇలాగే జరుగుతుంది. ఉద్యోగాల కోత అనేది వాస్తవం. కానీ అవెప్పుడూ ఆర్థిక వృద్ధిని ముందస్తుగా అంచనా వేయలేవు. కాబట్టి, ఊహాజనిత భయాలతో ఆందోళన చెందాల్సిన పనిలేదు.

# ఉద్యోగాల సృష్టికి స్టార్టప్ సంస్కృతి

**స్టార్టప్‌లు విరివిగా ఏర్పాటైతే అవి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి. కొత్త ఆలోచనలను, సాంకేతికతలను ముందుకు తెచ్చి ఉత్పాదకతను పెంచి, మార్కెట్‌ను విస్తరిస్తాయి. తద్వారా దేశార్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఈ విషయాన్ని గుర్తించే కేంద్ర ప్రభుత్వం స్టార్టప్‌లను ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో 2014లో కేవలం నాలుగు వందల లోపుగానే ఉన్న వాటి సంఖ్య ఈ ఏడాది మార్చి నాటికి 2.23 లక్షలకు మించింది. అవన్నీ కలిసి ప్రత్యక్షంగా 23లక్షలకుపైగా ఉద్యోగాలను సృష్టించాయి. దేశీయంగా నేడు దాదాపు 130 యూనికార్న్ స్టార్టప్‌లు (వంద కోట్ల డాలర్లకు పైగా విలువైనవి) ఉన్నాయి. స్టార్టప్ ఆవరణ వ్యవస్థ పరంగా ఇండియా ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలుస్తోంది. కానీ, నిధుల కటకటకు తోడు పటిష్ఠ ప్రణాళికలు, క్రమశిక్షణ కరవవ్వడంతో 90శాతం సంస్థలు అయిదేళ్ల లోపే కనుమరుగవుతున్నాయి. పైగా మన స్టార్టప్ ఎకోసిస్టమ్ ఎక్కువగా సాంకేతిక రంగం, మెట్రోనగరాలు, యూనికార్న్‌ల చుట్టూనే తిరుగుతోంది. గ్రామ, జిల్లా స్థాయుల్లో విభిన్న వ్యాపారాలకు ఊతమిచ్చేందుకుగానూ మేధో సంపత్తి సంస్థ 'భారత్ ప్రాజెక్ట్' తాజాగా సూచించినట్లు, ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు కదలాలి!**

కొత్త వ్యాపారాలకు చేయూతనిచ్చేందుకు తెచ్చిన స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్, ముద్ర, సమృద్ధి వంటి పథకాలు వేర్వేరు విభాగాల పరిధిలో అమలవుతున్నాయి. గ్రామీణ, చిన్నపట్టణాల యువతకు వాటిపై సరైన అవగాహన ఉండట్లేదు. రిజిస్ట్రేషన్లు, అనుమతులు, సబ్సిడీల కోసం వేర్వేరు పోర్టళ్లను ఆశ్రయించాల్సి వస్తుండటంతో విలువైన సమయంతో పాటు డబ్బూ వృథా అవుతోంది. ఈ నేపథ్యంలో స్టార్టప్‌లకు సంబంధించిన అన్ని పథకాలను ఒకే గొడుగు కిందకు తేవాలన్న 'భారత్ ప్రాజెక్ట్' సూచన ఎన్నదగినది. తగిన మార్గదర్శకత్వం కొరవడటం వల్లే చాలా స్టార్టప్‌ల మనుగడ ప్రమాదంలో పడుతోంది. దీన్ని నివారించాలంటే ప్రభుత్వం నుంచి లబ్ధి పొందే ప్రతి సంస్థకు ఒక మెంటార్‌ను నియమించాలి. ఆయా జిల్లాల్లో కొత్త వ్యాపార అవకాశాలను గుర్తించి, ఔత్సాహికుల వెన్నుతడితే స్టార్టప్ సంస్కృతి చిన్నపట్టణాలకూ విస్తరిస్తుంది. ఈ మేరకు జాతీయ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మిషన్‌ను చేపడితే వచ్చే అయిదేళ్లలో పది లక్షల స్టార్టప్‌లను, 50 లక్షల దాకా ఉద్యోగాలను సృష్టించవచ్చునన్న విశ్లేషణలు వినసొంపుగానే ఉన్నాయి. కానీ, కొన్ని కీలక సవాళ్లను అధిగమిస్తేనే ఆ ప్రగతి ఫలాలను అందుకోగలం! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, స్థానిక యంత్రాంగాన్ని సమన్వయపరుస్తూ అన్ని సేవలను ఒకే డిజిటల్ వేదిక కిందకు తేవడం అంత తేలికేమీ కాదు. దానికి తోడు బ్యాంకుల సహకారం, మెంటార్ల నాణ్యత, మార్కెట్ల అందుబాటు, అధికారగణం నిబద్ధతపై స్టార్టప్‌ల విజయం ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఫిన్‌టెక్, ఈకామర్స్, సాఫ్ట్‌వేర్ సేవలు, అంతరిక్ష రంగ స్టార్టప్‌లలో ఇండియా ముందంజలో ఉంది. ఇలా కొన్నింటికే పరిమితం కాకుండా చైనా తరహాలో రోబోటిక్స్, ఏఐ మోడళ్లు, విద్యుత్ వాహనాలు, సెమీకండక్టర్లు వంటి భిన్న రంగాల్లో కొత్త సంస్థలు వేళ్లూనుకునేందుకు తగిన వాతావరణాన్ని కల్పించాలి. అవి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులను రూపొందించేలా చూడాలి. స్టాన్‌ఫోర్డ్, ఎంఐటీ వంటి వర్సిటీల్లో జరిగే ఆధునిక పరిశోధనల నుంచే అమెరికాలో ఎన్నో ప్రభావశీల సంస్థలు ఆవిర్భవించాయి.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
సోమవారం ⁝ అనంతపురం ⁝ 31.08.2026 ⁝ 01

## అసదుద్దీన్ ఓవైసీ లేకుండా అఖిలేష్ సీఎం కావడం కలే!

**కీలక వ్యాఖ్యలు చేసిన ఎంఐఎం నేత షాదాబ్ చౌహాన్**

**– అమరావతి, ఆగస్టు 30:అనంత జనశక్తి న్యూస్**

ఉత్తర్ ప్రదేశ్ ఎన్నికలకు మరికొన్ని నెలలు మాత్రమే సమయం ఉంది. బీజేపీ, సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)ల మధ్య తీవ్ర పోటీ ఉంది. అయితే, ఎన్నికల్లో కూడా ఏఐ ఎంఐఎం పార్టీ కూడా కీలక పాత్ర పోషించబోతోంది. ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ ఉత్తర్ ప్రదేశ్ సీఎం కావాలంటే అసదుద్దీన్ ఓవైసీ మద్దతు తీసుకోవాల్సిందే అని ఎంఐఎం నేత షాదాబ్ చౌహాన్ అన్నారు. అఖిలేష్ రాజకీయ వ్యూహం ఓవైసీ లేకుండా పూర్తి కాదని అన్నారు. ఎస్పీ అవలంభిస్తున్న PDA (పిచ్చడా, దళిత్, అల్పసంఖ్యాకులు) ఫార్ములాలోని 'A' అంటే అసదుద్దీన్ ఒవైసీ కావాలని ఎద్దేవా చేశారు. అఖిలేష్ యాదవ్ PDAలో అసదుద్దీన్ ఒవైసీకి 'A' చోటు దక్కే వరకు ఆయన అధికారంలోకి రావడం కలే అని అన్నారు. ఎస్పీ వెనకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీలను కలుపుకుని రాజకీయ వ్యూహాన్ని రచిస్తోంది. ఇదిలా ఉంటే, కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్‌పై షాదాబ్ చౌహాన్ విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఆయన బీజేపీని ప్రశంసిస్తున్నారని ఆరోపించారు. మసూద్ వ్యాఖ్యలు చూస్తే అధికార పార్టీ బీజేపీతో రాజకీయంగా కలిసిపోయినట్లు అనిపిస్తోందని అన్నారు. అఖిలేష్ యాదవ్ తన సొంత సామాజిక ఓటు బ్యాంకుపై మరింత దృష్టి సారించాలని, ఆయనకు మద్దతుగా ఉన్న కొన్ని వర్గాలు బీజేపీ వైపు వెళ్తున్నాయని హెచ్చరించారు.

# కరువు నేలకు కృష్ణమ్మ వరప్రదాయిని..
# వెలిగొండతో రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు

- 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు.. లక్షలాది ప్రజలకు తాగునీటి భరోసా
- నాడు శంకుస్థాపన చేసిన చంద్రబాబు చేతుల మీదుగానే నేడు జాతికి అంకితం
- మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తున్న ముఖ్యమంత్రి దూరదృష్టికి వెలిగొండ నిలువెత్తు నిదర్శనం
- వెలిగొండతో కరువు, వలసలకు శాశ్వత పరిష్కారం – మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, ఆగస్టు 30:అనంత జనశక్తి న్యూస్**

దశాబ్దాలుగా కరువుతో అల్లాడుతున్న ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల రైతుల జీవితాల్లో పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కొత్త వెలుగులు నింపబోతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్న సందర్భం రాష్ట్ర సాగునీటి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి 43.53 టీఎంసీల కృష్ణా వరద జలాలను నల్లమల కొండల గుండా మళ్లించి, మొత్తం 4,47,300 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో వెలిగొండ ప్రాజెక్టును రూపొందించారని మంత్రి తెలిపారు. మార్కాపురం జిల్లాలో 3,08,700 ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 27,400 ఎకరాలు, వైఎస్ఆర్ కడప జిల్లాలో 27,200 ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84,000 ఎకరాలకు సాగునీరు అందేలా ప్రాజెక్టు రూపకల్పన జరిగిందన్నారు. వెలిగొండ అంటే కేవలం ఒక సాగునీటి ప్రాజెక్టు కాదు.తరతరాలుగా కరువుతో పోరాడిన రైతుకు భరోసా.. నీటి కోసం ఎదురుచూసిన గ్రామాలకు జీవనాధారం.. ఉపాధి కోసం వలస వెళ్లిన కుటుంబాలకు సొంత గడ్డపైనే బతికే అవకాశం అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావం, నీటి వసతుల లేమి కారణంగా ప్రజలు కరువు కాటకాలను ఎదుర్కొంటూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవని అన్నారు. వెలిగొండ ద్వారా సాగునీటితో పాటు కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో లక్షలాది ప్రజలకు సురక్షిత తాగునీటి భరోసా లభిస్తుందని మంత్రి తెలిపారు. 4 జిల్లాల్లోని 30 మండలాలకు చెందిన 15.25 లక్షల మందికి కాలువల నెట్‌వర్క్ ద్వారా తాగునీటి సౌకర్యం, పశ్చిమ ప్రకాశంలోని 7 నియోజకవర్గాల్లో 1,657 ఆవాసాలకు తాగునీటి ప్రయోజనం కలగనుందన్నారు. 23 లక్షల ప్రజానీకానికి తాగునీరు అందించేందుకు ప్రాజెక్టు రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారని తెలిపారు. నల్లమలసాగర్ జలాశయం నిండటం, కాలువలు-చెరువులకు నీరు చేరడం వల్ల ఆయకట్టు ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి మెట్ట ప్రాంత వ్యవసాయ ముఖచిత్రమే మారే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం 30 నుంచి 60 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు కొన్ని ప్రాంతాల్లో సుమారు 8 మీటర్ల లోతులోనే అందుబాటులోకి వచ్చే అవకాశముందని ప్రాజెక్టు నివేదిక అంచనా వేసిందని పేర్కొన్నారు. నాడు 1996లో వెలిగొండకు శంకుస్థాపన చేసిన నాయకుడు చంద్రబాబు నాయుడు. నేడు అదే ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేసే చారిత్రక ఘట్టానికి ఆయన నాయకత్వం వహించడం అరుదైన సందర్భం. ఒక నాయకుడి దూరదృష్టి మూడు దశాబ్దాల తర్వాత లక్షలాది మంది ప్రజల జీవితాలను ఎలా మార్చగలదో చెప్పడానికి వెలిగొండ ప్రత్యక్ష నిదర్శనం అని అచ్చెన్నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పెండింగ్ పనులకు వేగం పెంచిందన్నారు. టన్నెల్ 2లో మిగిలిన 4.924 కిలోమీటర్ల బోరింగ్‌ను 23 నెలల్లో పూర్తి చేయడం, హెడ్ రెగ్యులేటర్లు, సొరంగాలు, ఫీడర్ కాలువ తదితర కీలక పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కేవలం 26 నెలల్లో దాదాపు రూ.2,402 కోట్ల విలువైన పనులు పూర్తి చేసినట్లు, నల్లమల కొండల్లో దాదాపు 18.8 కిలోమీటర్ల పొడవుతో నిర్మించిన రెండు భారీ సొరంగాలు ఇంజినీరింగ్ అద్భుతమని మంత్రి పేర్కొన్నారు. ఈ రెండు సొరంగాల ద్వారా వరద సమయంలో కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు తరలించేలా వ్యవస్థను రూపొందించారని తెలిపారు. నల్లమలసాగర్ నుంచి తీగలేరు, గొట్టిపడియ, తూర్పు ప్రధాన కాలువల ద్వారా విస్తారమైన ఆయకట్టుకు సాగునీరు చేరుతుందని అన్నారు. వెలిగొండ నీరు రైతు పొలానికి చేరితే అది కేవలం నీరు కాదు.. రైతు కుటుంబానికి ఆర్థిక భరోసా. చెరువులు నిండుతాయి, భూగర్భ జలాలు పెరుగుతాయి, బోర్లు బతుకుతాయి, పంటలు పండుతాయి, గ్రామాల్లో ఉపాధి పెరుగుతుంది. ముఖ్యంగా కరువు కారణంగా జరిగే వలసలకు అడ్డుకట్ట పడుతుంది.



అందుకే వెలిగొండను ఈ ప్రాంత ప్రజల జీవన రేఖగా చూడాలి అని అచ్చెన్నాయుడు అన్నారు. రైతుల సంక్షేమం, సాగునీటి భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. నదుల అనుసంధానం నుంచి పోలవరం వరకు, హంద్రీ-నీవా నుంచి వెలిగొండ వరకు నీటిని సంపద సృష్టించే శక్తిగా మార్చాలన్నదే చంద్రబాబు ఆలోచన. నేడు వెలిగొండ జాతికి అంకితం కావడం ఒక ప్రాజెక్టు ప్రారంభం మాత్రమే కాదు, కరువు సీమలో రైతుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే కొత్త అధ్యాయం అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి దంపతులు.



- అమ్మవారి సేవ పూర్వజన్మ సుకృతం : మంత్రి నారాయణ
- 1.01 కోట్లతో మహాలక్ష్మి ఆలయ పునర్నిర్మాణం.
- నవాబుపేటలో ఆధ్యాత్మిక సందడి.
- మంత్రికి రాఖీలు కట్టి అభిమానాన్ని చాటిన మహిళలు

**నెల్లూరు ఆగస్ట్ 30,అనంత జనశక్తి న్యూస్**

నెల్లూరు సిటీ నియోజకవర్గం నవాబుపేటలోని అత్యంత ప్రాచీనమైన బలిజ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తన సతీమణి రమాదేవితో కలసి ఆలయ పనులకు భూమిపూజ చేశారు.మంత్రి దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.అమ్మవారి సేవ చేయడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు.2019లోనే ఆలయ స్థల సేకరణ కోసం 23 అంకణాల స్థలానికి 28 లక్షల రూపాయల సొంత నిధిని అందించామన్నారు.దాతల సాయంతో 1.01 కోట్ల అంచనా వ్యయంతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారని తెలిపారు. ఆలయ నిర్మాణానికి కృషిచేస్తున్న దేవస్థాన కమిటీ, బలిజకుల సంక్షేమ నాయకులు, దాతలకు అభినందనలు తెలిపారు.భక్తులందరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక మహిళలు మంత్రికి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.మంత్రిని ఆదర్శంగా తీసుకొన్న సిటీ టీడీపీ నాయకులు
ఆలయ పునర్నిర్మాణానికి తమవంతు విరాళాలు ప్రకటించారు.డాక్టర్ పోకల రవి (5 లక్షలు), పప్పు నారాయణ (2 లక్షలు), సుబ్రహ్మణ్యం ( 1 లక్ష), రంగయ్య నాయుడు ( 25 వేలు) మొత్తం 8.25 లక్షల నగదు విరాళాలను మంత్రి నారాయణ చేతులమీదుగా ఆలయ కమిటీకి అందజేశారు.ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,నారాయణ విద్యాసమస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, 7వ డివిజన్ కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి,జిల్లా మార్కెటింగ్ కమిటీ మెంబర్ గునుకుల విజయలక్ష్మి,రామాలయ పాలకమండలి చైర్మన్ శ్రీనివాసులు ,స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# పరిటాల రవీంద్ర ఒక చరిత్ర..
# అయన ఆశయాలు కొనసాగిస్తాం



- పరిటాల రవీంద్ర 68వ జయంతి సందర్భంగా పరిటాల సునీత, శ్రీ రామ్
- పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించిన సునీత, పరిటాల శ్రీరామ్
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు
- రాష్ట్రంలో పలుచోట్ల జయంతి, సేవా కార్యక్రమాలు

**రాప్తాడు ఆగస్టు 30,అనంత జనశక్తి న్యూస్**

మాజీ మంత్రి, టీడీపీ నేత పరిటాల రవీంద్ర ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపారని... ఆయన ఆశయాల సాధన కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు.అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పరిటాల రవీంద్ర 68వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. రామగిరి మండలం వెంకటాపురంలోని పరిటాల ఘాట్ వద్ద పెద్ద ఎత్తున జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ తమ కుటుంబ సభ్యులతో కలసి పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించారు.అనంతరం వందలాదిగా తరలివచ్చిన అభిమానులు ఘాట్ వద్ద నివాళులర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి రవి ఘాట్ కు నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే సునీత అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈసందర్భంగా పరిటాల సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ పరిటాల రవి అంటే ఒక పేరు కాదని అది ఒక చరిత్ర అని అన్నారు. అందుకే ఆయన మరణించి ఇన్నేళ్లు గడిచిన ప్రజలు అదే అభిమానాన్ని చూపిస్తున్నారన్నారు. ఒకప్పుడు అనేక పోరాటాలతో పేదల పక్షాన నిలిచిన పరిటాల రవీంద్ర..మంత్రి అయ్యాక ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు. అయితే పేరూరు జలాశయానికి శాశ్వతంగా నీరు అందించాలన్నది ఆయన లక్ష్యమని అది త్వరలోనే నెరవేరుస్తామని పరిటాల సునీత అన్నారు రవి ఆశయ సాధన కోసం శ్రీరామ్ ప్రతినిత్యం పనిచేస్తారని ఆమె స్పష్టం చేశారు. పరిటాల రవికి రాప్తాడు, పెనుకొండ, ధర్మవరం ప్రాంతాలంటే చాలా ఇష్టమని.. ఆయనపై చూపిన ప్రేమే నేటికీ మాపై చూపిస్తున్నారని శ్రీరామ్ అన్నారు. ప్రజలు, అభిమానులు పెట్టుకున్న నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా.. పనిచేస్తామని తెలిపారు.



## వ్యాయామ అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం




**కళ్యాణదుర్గం ఆగస్టు 30, అనంత జనశక్తి న్యూస్**

స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న వ్యాయామ అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. హర్షలత తెలిపారు.అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులతో వ్యాయామ విద్యలో స్నాతకోత్తర విద్యను పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్ర అర్హత పరీక్ష, జాతీయ అర్హత పరీక్ష లేదా పరిశోధనా పట్టా కలిగిన వారికి ఎంపికలో తొలి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.మౌఖిక పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని వివరించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ అసలు విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు వాటి రెండు ప్రతులను తీసుకుని ఈ నెల 31న కళాశాలలో నిర్వహించే ముఖాముఖి పరీక్షకు నేరుగా హాజరు కావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. హర్షలత కోరారు.
ప్రిన్సిపల్ హర్షలత విలేకరులకు సమాచారం ఇవ్వదు వార్తలు పంపండి అని వారు పంపించినదే వేదం అంటూ వాట్సప్ గ్రూపులలో పంపుతారు. ప్రిన్సిపల్ పనితీరుపై పిల్లలలోనూ అసంతృప్తిగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. సమయపాలన ఉండదు . నేను చెప్పేది వార్తలు రాయాలంటూ క్రింది స్థాయి ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని ఆరోపణలు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు విగ్రహావిష్కరణ

- దొమ్మేరు బస్టాండ్ సెంటర్ లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ఘన నివాళులర్పించిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- కార్యక్రమంలో పాల్గొన్నఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, కామినేని శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)

**కొవ్వూరు ఆగస్టు 30, అనంత జనశక్తి న్యూస్**



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, దివంగత శ్రీ పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) విగ్రహావిష్కరణ మహోత్సవం దొమ్మేరు బస్టాండ్ సెంటర్‌లో అత్యంత వైభవంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యనపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరై పెండ్యాల కృష్ణబాబు విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, కైకలూరు శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, సీనియర్ రాజకీయ నాయకులు కేవీపీ రామచంద్రరావు, మహమ్మద్ అహ్మద్ షరీఫ్, ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) తదితరులు పాల్గొన్నారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో నాయకులందరూ కృష్ణబాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... నిస్వార్థ రాజకీయ నాయకునిగా సుదీర్ఘకాలం ప్రజలకు సేవలందించిన పెండ్యాల కృష్ణబాబు కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమించారని, ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సభలో పాల్గొన్న ఇతర ప్రముఖులు సైతం ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ నివాళులు అర్పించారు.

## రైల్వే ట్రాక్ పక్కన యువకుడి మృతదేహం కలకలం

- ధర్మవరం ఇందిరానగర్‌కు చెందిన హర్ష మృతదేహం లభ్యం....
- మృతికి కారణాలు తెలియాల్సి ఉంది....

**ధర్మవరం ఆగష్టు 30 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన కాంతమ్మ కుమారుడు హర్ష మృతదేహం సిగేపల్లి మండలం ప్యాధిండి సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన లభ్యమైంది. హర్ష మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు సమాచారం అందించడంతో ఘటనపై పోలీసులు దృష్టి సారించారు. అయితే హర్ష మృతికి గల అసలు కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేపట్టే అవకాశం ఉంది. రైల్వే ట్రాక్ పక్కన యువకుడి మృతదేహం లభించడం స్థానికంగా కలకలం రేపింది. హర్ష మృతి వెనుక అసలు కారణం ఏమిటనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.



## ఒక పేరు కాదు.. ఒక పోరాట స్ఫూర్తి.. పరిటాల రవీంద్ర



**ధర్మవరం ఆగష్టు 30 అనంత జనశక్తి న్యూస్ :**

కీర్తిశేషులు పరిటాల రవీంద్ర గారి 68వ జయంతి సందర్భంగా వెంకటాపురంలోని ఆయన ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా నివాళులర్పించాము. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి.. వారి కోసం నిరంతరం పోరాడిన ఆ మహనీయుని జ్ఞాపకాలను మరోసారి స్మరించుకున్నాము. అనంతరం కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించాము. మనిషి భౌతికంగా దూరమైనా.. ఆయన ఆశయం ప్రజల మధ్య బతికే ఉంటుంది.
పరిటాల రవీంద్ర గారి పేరు చరిత్రలో ఒక అధ్యాయం కాదు.. ప్రజల గుండెల్లో చెరిగిపోని సంతకం. ఆయన అడుగుజాడల్లో నడవడం.. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనందరి బాధ్యత. జోహార్ పరిటాల రవీంద్ర!

## మరణంలోనూ మహాదానం



**- రెండు కుటుంబాల్లో వెలుగులు నింపిన నేత్రదాత....**
**- చూపును కోల్పోయిన వారికి చూపునివ్వడం కంటే గొప్ప దానం మరొకటి లేదు...**

**ధర్మవరం ఆగష్టు 30 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం కేశవనగర్‌కు చెందిన గిర్రాజు పార్థసారథి (53) సం, 30082026 ఆదివారం ఉదయం బీపీ కారణంగా మృతి చెందారు. ఆయన మరణానంతరం కుటుంబ సభ్యులు చూపిన మానవత్వం అభినందనీయం. సామాజిక సేవకులు సత్య నిర్ధారణ్, యువర్స్ ఫౌండేషన్ సభ్యులు కుటుంబ సభ్యులకు నేత్రదానం పై అవగాహన కల్పించగా, వారి అంగీకారంతో నేత్రదానానికి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డి.వై. కుళ్లాయప్ప కంటి రిట్రీవల్ బృందం సహకారంతో యువర్స్ ఫౌండేషన్ సభ్యుడు, ఆప్తమాలజిక్ అసిస్టెంట్ శిఖందర్, ఎల్.వి. ప్రసాద్ హాస్పిటల్ టెక్నీషియన్ ప్రసాద్ కలిసి కార్నియాలను సేకరించారు. పార్థసారథి నేత్రదానం ద్వారా రెండు కుటుంబాల్లో వెలుగులు నిండే అవకాశం కల్పించారు. ఒకరి జీవితం ముగిసినా.. మరొకరి జీవితంలో వెలుగుకు మార్గం చూపడం నిజమైన మానవత్వానికి నిదర్శనం. ఈ మహత్తర నిర్ణయానికి సహకరించిన పార్థసారథి భార్య గిర్రాజు మమత, కుమారుడు సౌరవ్ కి యువర్స్ ఫౌండేషన్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ పాస్ట్ ప్రెసిడెంట్ వై.కె. శ్రీనివాసులు, పోలా ప్రభాకర్ పాల్గొన్నారు. “మనిషి వెళ్లిపోయినా.. అతని కళ్లలోని వెలుగు మరొకరి జీవితంలో కొనసాగాలి.”

## వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కందికుంట



**కదిరి ఆగస్టు 30, అనంత జనశక్తి న్యూస్**

కదిరి పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో 6వ వార్డుకు చెందిన కిష్ట గారి కుమార్తె వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. వారి వైవాహిక జీవితం ప్రేమానురాగాలు, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే హాజరై వధూవరులను ఆశీర్వదించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**అనంతపురం ఆగస్టు 30 అనంత జనశక్తి న్యూస్**



గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె, అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు కుమారుడి వివాహ వేడుకకు హాజరయ్యేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా శిల్పారామం సమీపంలోని హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ ఘన స్వాగతం పలికారు. సహచర ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా మాట్లాడారు.

# డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ ఆధ్వర్యంలో గుంటుపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**విజయవాడ ఆగస్టు 30, అనంత జనశక్తి న్యూస్**

విజయవాడలోని ప్రముఖ డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ సౌజన్యంతో గుంటుపల్లిలోని 'ది పార్క్ రెసిడెన్స్' అపార్ట్‌మెంట్‌లో ఉచిత కార్డియోమెడికల్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించబడింది.
ఈ ప్రాథమిక ఆరోగ్య పరీక్షల శిబిరానికి అపార్ట్‌మెంట్ లో నివాసం ఉంటున్న సుమారు 77 కుటుంబాల సభ్యులు హాజరై వైద్య సేవలు పొందారు. డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ హాస్పిటల్ ప్రముఖ కార్డియాలజిస్టులు మరియు క్లినికల్ స్పెషలిస్టులు డాక్టర్ శిరీష, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ అనిల్ నేతృత్వంలోని పారామెడికల్ బృందం బీపీ, షుగర్, ఈసీజీ, 2Dఎకో కార్డియోగ్రామ్ తదితర వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించింది.. ల్యాబ్ నివేదికల అనంతరం పరీక్షలు చేయించుకున్న వారి హృదయ స్పందనల పనితీరు, రక్తప్రసరణ, ఇతర జీవక్రియల స్థితిపై వైద్యులు వ్యక్తిగత వైద్య సలహాలు, దైనందిన జీవనశైలిలో తీసుకోవాల్సిన చర్యలు, అవసరమైన ముందస్తు జాగ్రత్తలను సూచించారు. ఈ సందర్భంగా ది పార్క్ రెసిడెన్స్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పెంటమరాజు గోపాల్ రావు మాట్లాడుతూ... "ఇలాంటి ప్రివెంటివ్ హెల్త్ చెకప్‌ల వల్ల గుండె సంబంధిత మరియు దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందే అవకాశం లభిస్తుంది" అని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి కార్డియోమెడికల్ క్యాంపులను మరిన్ని నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆర్థికంగా అందుబాటులో అత్యాధునిక వైద్యం అందిస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు పొందినడా. వరుణ్ కార్డియాక్ సైన్సెస్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..సమాజ ఆరోగ్య పరిరక్షణ దిశగా సేవలు అందించిన డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ వైద్య బృందాన్ని మరియు పారామెడికల్ సిబ్బందిని అపార్ట్‌మెంట్ యాజమాన్యం ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేసింది. కార్యక్రమంలో ది పార్క్ రెసిడెన్స్ కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సుజన్, సునీల్, పార్థసారథి, శ్రీనివాసులు, సతీష్, మునిప్రసాద్, అపార్ట్మెంట్ వాసులు నాగరాజు, రవితేజ, మాధవ్, హిమబిందు, విజయదుర్గ, గౌరీ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పరిటాల రవీంద్ర 68వ జయంతి వేడుకలు

**- ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పరిటాల రవీంద్ర ముద్ర.**
**- పరిటాల రవీంద్ర ఆశయాల సాధనకు పునరంకితం.**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, ఆగష్టు 30, అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కీర్తిశేషులు, మాజీ మంత్రివర్యులు, పెనుకొండ మాజీ శాసనసభ్యులు పరిటాల రవీంద్ర 68వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
ధర్మవరం పట్టణంలోని గాంధీనగర్ సర్కిల్‌లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి, ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం భారీగా తరలివచ్చిన కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి, పరిటాల రవీంద్ర అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ... ఒకప్పుడు ఫ్యాక్షన్ గొడవలతో అట్టుడికిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇరువర్గాలను రాజీ మార్గంలో నడిపించి శాంతి నెలకొల్పేందుకు పరిటాల రవీంద్ర చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో ప్రజలు, ముఖ్యంగా మహిళలు భయాందోళనలకు గురైన పరిస్థితుల్లో ప్రత్యేక దృష్టి సారించి అరాచక శక్తులను అణిచివేసి ప్రజలకు భరోసా కల్పించిన నాయకుడిగా పరిటాల రవీంద్రను కొనియాడారు. “నాయకుడు వెళ్లిపోయినా... ఆయన ఆశయం మిగిలిపోతుంది.
మనిషి దూరమైనా... ఆయన ముద్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది.”
1994-2004 మధ్య కాలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలిచి వారి రాజకీయ భవిష్యత్తుకు బాటలు వేసిన పరిటాల రవీంద్ర నాయకత్వాన్ని ఎప్పటికీ మరువలేమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. కార్యకర్తల కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఆయన సేవలను నిత్యం స్మరించుకుంటామని తెలిపారు. పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో పరిటాల రవీంద్ర ఆశయ సాధన కోసం కృషి చేస్తామని, ధర్మవరం నియోజకవర్గంలో శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజల ఆకాంక్షల సాధనకు ముందుకు సాగుతామని టీడీపీ నాయకులు ప్రతిజ్ఞ చేశారు.

# అమృతమూర్తి పల్లె ఉమాకు ఘన నివాళులు





**- పల్లె ఉమా ఒక వ్యక్తి కాదు.. ఒక వ్యవస్థ**
**- 8వ వర్ధంతి సందర్భంగా జనసంద్రంగా మారిన పల్లె వ్యవసాయ క్షేత్రం**

**రాప్తాడు ఆగస్టు 30, అనంత జనశక్తి న్యూస్**

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన అమృతమూర్తి, సేవామూర్తి, దివంగత పల్లె ఉమా 8వ వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం రాప్తాడు మండలం ప్రసన్నాయనపల్లి సమీపంలోని పల్లె వ్యవసాయ క్షేత్రంలోని పల్లె ఉమా ఘాట్ వద్ద జరిగిన వర్ధంతి కార్యక్రమం జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి, మనుమడు వియాన్, మనుమరాలు వన్షూ, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, ఆయన సతీమణి సౌభాగ్యరాణి తదితర కుటుంబ సభ్యులు పల్లె ఉమా ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించి అశ్రు నివాళులు అర్పించారు.

**వెనుకబడిన రాయలసీమ విద్యాభివృద్ధికి విశేష కృషి**

పల్లె ఉమా కేవలం ఒక వ్యక్తి కాదని.. ఒక వ్యవస్థ అని కుటుంబ సభ్యులు, అభిమానులు కొనియాడారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఆమె చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. పేద విద్యార్థులకు అండగా నిలవడంతో పాటు అనేక కుటుంబాలకు ఆపన్నహస్తం అందించిన ఆమె సేవలు ఎప్పటికీ మరువలేనివన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపిన దైవస్వరూపురాలిగా పల్లె ఉమా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆమె అందించిన ఆత్మీయత, అభిమానం, ఆదరణను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు.

**ప్రజలే దేవుళ్లుగా భావించే పల్లె కుటుంబం**

ప్రజలే దేవుళ్లుగా భావించే పల్లె కుటుంబం సేవా సంప్రదాయాన్ని కొనసాగిస్తోందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎలాంటి పదవిలో లేకపోయినా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నియోజకవర్గ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ వారి కష్టసుఖాల్లో అండగా నిలుస్తున్నారని అన్నారు. కులం, మతం, వర్గం, వర్ణం అనే తేడాలు లేకుండా ఆపదలో ఉన్న వారికి తన వంతు సహాయ సహకారాలు అందించడం పల్లె కుటుంబానికి అనవాయితీగా వస్తోందన్నారు. పల్లె ఉమా చూపిన సేవా మార్గాన్ని కుటుంబ సభ్యులు కొనసాగిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు.

**భారీగా తరలివచ్చిన ప్రజా ప్రతినిధులు**

పల్లె ఉమాకు నివాళులు అర్పించేందుకు పుట్టపర్తి నియోజకవర్గం నుంచే కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథి, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకటప్రసాద్, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర మాంసపు ఉత్పత్తుల కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్ నాయుడు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు శ్రీనివాసమూర్తి, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, మాజీ డైరెక్టర్ రాయల్ మురళి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బిల్లా పల్లవి, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, బీజేపీ నాయకులు చిరంజీవి రెడ్డి, హరికృష్ణ, సురేంద్ర, జ్యోతి ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆదినారాయణ, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, అబ్దుల్లా తదితరులు హాజరై నివాళులు అర్పించారు. టీడీపీ, బీజేపీ, జనసేనతో పాటు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల నాయకులు, కార్యకర్తలు, పల్లె ఉమా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**పల్లె ఉమా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం, సేవా కార్యక్రమాలు**

పల్లె ఉమా వర్ధంతి సందర్భంగా పల్లె ఉమా ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం , అన్నదానం ,నిత్యవసర సరుకులు,దుస్తుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలకు అన్నవితరణ చేశారు. పేదలకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులను అందజేశారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి, మనుమడు వియాన్, మనుమరాలు వన్షూ, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, సౌభాగ్యరాణి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి పేదలకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందజేశారు.

**పల్లె ఉమా సేవలు చిరస్మరణీయం**

పల్లె ఉమా భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆమె చేసిన సేవలు, చూపిన ఆత్మీయత, పేదల పట్ల ఆమెకున్న మానవత్వం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి,పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి లు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచి వేలాది మంది పల్లె అభిమానులు ,కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు,పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలు,కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

**- ఆగస్టు 31వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ**
**- సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ..**
**- రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలి**
**- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**అనంతపురం, ఆగస్టు 30 :అనంత జనశక్తి న్యూస్**



మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివోవి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

**ఆగస్టు 31వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ :**

ఆగస్టు 31వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సాప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.

# హామీల అమలుకే ప్రథమ ప్రాధాన్యం...





- పిఠాపురం ఆరోగ్య రంగానికి సరికొత్త రూపు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో ఆసుపత్రుల అభివృద్ధి
- ఆయుష్ సేవల విస్తరణ.. వైద్య విద్యకు నూతన ఊపిరి
- రూ.34 కోట్లతో ఏరియా ఆసుపత్రి ఆధునికీకరణ
- సుమారు రూ.100 కోట్లుతో ఆయుష్ వైద్య కళాశాల ఏర్పాటు
- రూ. కోటి వ్యయంతో కొమరగిరి, చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు
- విరవాడలో తుది దశకు చేరిన ప్రభుత్వ ఆయుష్ డిస్పెన్సరీ పనులు
- ఆసుపత్రులన్నింటికీ కనెక్టింగ్ రోడ్ల నిర్మాణం

**పిఠాపురం ఆగస్ట్ 30,అనంత జనశక్తి న్యూస్**

నాణ్యమైన వైద్యం ప్రతి ఒక్కరి హక్కు అనే గొప్ప ఆశయాన్ని ఆచరణలో సాకారం చేస్తూ పిఠాపురం నియోజకవర్గాన్ని సమగ్ర, అత్యున్నత ఆరోగ్య సేవలకు కేంద్రంగా, రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచే మోడల్ హెల్త్ హబ్‌గా ఉప ముఖ్యమంత్రి, స్థానిక శాసనసభ్యులు పవన్ కళ్యాణ్ తీర్చిదిద్దుతున్నారు. ప్రతి పేదవాడికీ ఎలాంటి ఆర్థిక భారం లేకుండా, అత్యున్నత ప్రమాణాలతో కూడిన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.ఈ మహత్తర లక్ష్య సాధనలో భాగంగా ఆధునిక సదుపాయాలతో ఆసుపత్రుల అభివృద్ధి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతం, ఆయుష్ వైద్య సేవల విస్తరణతోపాటు వైద్య విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.దీనితోపాటు రోగుల ప్రయాణ సౌకర్యార్థం ఈ ఆసుపత్రులన్నింటికీ కనెక్టింగ్ రోడ్లను కూడా నిర్మించారు.

శరవేగంగా ఏరియా ఆసుపత్రి అభివృద్ధి

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీకి అనుగుణంగా పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో పిఠాపురంలోని 30 పడకల పాత కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.34 కోట్ల అంచనా వ్యయంతో 100 పడకల సామర్థ్యంతో కూడిన అత్యాధునిక ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులు యుద్ధ ప్రాతిపాదికన సాగుతుండగా, ఇప్పటికే దాదాపు 50 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 4.67 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ అత్యాధునిక ఆసుపత్రిలో ఆధునిక ఐసీయూ, అధునాతన వైద్య పరీక్షా ప్రయోగశాలలు, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, 30 పడకల ప్రసూతి విభాగంతోపాటు చిన్నపిల్లల వైద్యం, కంటి వైద్యం, ఎముకల వైద్యానికి సంబంధించిన ప్రత్యేక విభాగాలు అందుబాటులోకి రానున్నాయి. ఆసుపత్రి నిర్మాణం పూర్తై ప్రజలకు అందుబాటులోకి వస్తే పిఠాపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఆరు మండలాలకు చెందిన సుమారు 3 లక్షల మంది ప్రజలకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉచిత, కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. ఆసుపత్రికి అనుబంధంగా బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ భవనం, మార్చురీ, లక్ష లీటర్ల సామర్థ్యం గల సంప్‌తోపాటు ఇతర అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణం కూడా చేపడుతున్నారు.ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ ఆయుష్ మెడికల్ కాలేజీ ఏర్పాటు

పిఠాపురం పేరును వైద్య విద్యా రంగంలో ప్రత్యేకంగా నిలబెట్టే లక్ష్యంతో, నేషనల్ ఆయుష్ మిషన్ కింద ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాల ఏర్పాటుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సుమారు రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఆయుష్ మెడికల్ కాలేజ్‌తోపాటు అనుబంధ అభివృద్ధి పనుల కోసం పిఠాపురం నియోజకవర్గంలో భూసేకరణ పనులు వేగవంతం చేశారు. ఈ కళాశాల నిర్వహణ, అనుబంధ సేవలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరగనున్నాయి.గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ఆయుష్, హెల్త్ యూనిట్లు

పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రజలకు కూడా తక్షణ వైద్య సేవలు అందించేలా యి. కొత్తపల్లి మండలం కొమరగిరిలో, గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రూ.50 లక్షల చొప్పున వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పటికే వంద శాతం పూర్తయి అందుబాటులోకి వచ్చాయి.వీటితోపాటు విరవాడలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆయుష్ డిస్పెన్సరీ పనులు చివరి దశకు చేరాయి. అదే సమయంలో పిఠాపురం నియోజకవర్గానికే పరిమితం కాకుండా కాకినాడ జిల్లా ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి రావాలనే లక్ష్యంతో శ్రీ పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృషి చేస్తున్నారు.ఆయన చొరవతో కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రూ.36.6 కోట్లతో అధునాతన క్యాన్సర్ చికిత్సా కేంద్రం ఏర్పాటు కానుంది. ఇందులో సీటీ సిమ్యులేటర్, హెచ్‌డీఆర్ బ్రాకీథెరపీ, డోసిమెట్రీ వంటి ఆధునిక పరికరాలతోపాటు, క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే

గుర్తించేందుకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. గ్రామీణ స్థాయి ఆరోగ్య కేంద్రాల నుంచి అత్యాధునిక క్యాన్సర్ చికిత్స వరకు అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరువయ్యేలా ఆరోగ్య రంగాన్ని అభివృద్ధి చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంతో పాటు కాకినాడ జిల్లా ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీ పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న చర్యలు ప్రజారోగ్యంపై ఆయనకున్న ప్రత్యేక శ్రద్ధకు, కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# ప్రశాంతంగా ముగిసిన నీట్ పీజీ–2026 పరీక్ష



- పకడ్బందీ ఏర్పాట్ల మధ్య విజయవంతంగా పరీక్ష నిర్వహణ
- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ, ఆగస్టు 30:అనంత జనశక్తి న్యూస్**

విజయవాడలో నీట్ పీజీ-2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. పరీక్షకు హాజరైన అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టి పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, విద్యుత్, తాగునీరు తదితర అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచడంతో అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షకు హాజరయ్యారు. పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ (ఎనికేపాడు) కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి 12.30 గంటల వరకు నీట్ పీజీ-2026 పరీక్ష నిర్వహించారు. రెండు పరీక్షా కేంద్రాల్లో కలిపి మొత్తం 843 మంది అభ్యర్థులకు గాను 818 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ పరీక్షా కేంద్రంలో 530 మంది అభ్యర్థులకు గాను 512 మంది హాజరయ్యారు. పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కేంద్రంలో 313 మంది అభ్యర్థులకు గాను 306 మంది పరీక్షకు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించడంతో పాటు అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను, భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేలా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థుల ప్రవేశం, పరీక్ష నిర్వహణ ప్రక్రియ, భద్రతా చర్యలను పరిశీలించిన కలెక్టర్.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# కరాయిగూడలో పీఎం జన్మన్ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

- నిర్మాణ పనుల పురోగతిపై ఎస్‌ఈ జై రామాచారి క్షేత్రస్థాయి సందర్శన

**అనంతగిరి,ఆగస్టు 30: అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండలంలో హౌసింగ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ) జై రామాచారి ఆదివారం కోనాపురం పంచాయతీ పరిధిలోని కరాయిగూడ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పీఎం జన్మన్ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.కరాయిగూడ గ్రామానికి పీఎం జన్మన్ పథకం కింద మొత్తం 77 ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 25 ఇళ్లకు పునాది పనులు పూర్తయ్యాయి. 42 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉండగా, 10 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇళ్ల నిర్మాణ పురోగతిని ఎస్‌ఈ జై రామాచారి పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడి పనుల వివరాలను తెలుసుకున్నారు.ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అలాగే నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.ఈ పర్యటనలో ఏఈ నాగేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, డీఈఓ,




ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలు, హౌసింగ్ లబ్ధిదారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికిన
# ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**అనంతపురం, ఆగస్టు 30:అనంత జనశక్తి న్యూస్**

ఆర్టీసీ రీజినల్ చైర్మెన్ పూల నాగరాజు కుమారుడు జయరాజ్ గుంతకల్ ఎంఎల్ఏ గుమ్మనూరు జయరాం కుమార్తె విద్యా వివాహా వేడుకలకు అనంతపురం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుకు పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ఘన స్వాగతం పలికారు.అనంతపురం నగరంలోని శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుకు ఉమ్మడి అనంతపురం జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కూటమి పార్టీల నాయకులు,జిల్లా కలెక్టర్ ఆనంద్ ,ఎస్పీ జగదీష్ ,ఇతర జిల్లా అధికారులు సీఎం కు అపూర్వ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమ అభివృద్ధి, అనంతపురం జిల్లా ప్రగతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే



తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తోందని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనతో జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

## అనంతపురం విచ్చేసిన సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం



**అనంతపురం ఆగస్టు 30, అనంత జనశక్తి న్యూస్**

గుంతకల్లు ఎమ్మెల్యే జయరామ్ కుమార్తె, అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పూల నాగరాజు కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం విచ్చేశారు.ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలసి కార్యక్రమానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## చిలకం ఇంట పెళ్లి సందడి



- ఘనంగా జయవర్ధన్ రెడ్డి వివాహ వేడుకలు...
- ఆత్మీయుల ఆశీస్సుల మధ్య ఒక్కటైన జయవర్ధన్ రెడ్డి–శ్రావ్య రెడ్డి.....

**ధర్మవరం ఆగష్టు 30 అనంత జనశక్తి న్యూస్ :**

బెంగళూరులోని దేవనహళ్లి వీర్దెన్సి రిసార్ట్స్ వేదికగా జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తనయుడు చిలకం జయవర్ధన్ రెడ్డి వివాహం అత్యంత వైభవంగా జరిగింది. నెల్లూరుకు చెందిన సోమశేఖర్ రెడ్డి కుమార్తె శ్రావ్య రెడ్డితో జరిగిన ఈ వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, మంత్రివర్యులు, జనసేన పార్టీ ముఖ్య నాయకులు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెళ్లి వేడుకకు హాజరైన అతిథుల సందడితో రిసార్ట్స్ ప్రాంగణం కళకళలాడింది. నూతన వధూవరులు జయవర్ధన్ రెడ్డి -శ్రావ్య రెడ్డిలకు ప్రతి ఒక్కరూ తమ ఆశీస్సులు అందిస్తూ నూతన జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. తన తనయుడి వివాహానికి విచ్చేసిన ప్రతి అతిథిని చిలకం మధుసూదన్ రెడ్డి ఆప్యాయంగా పలకరిస్తూ, వారి రాకకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖుల హాజరుతో వివాహ వేడుక మరింత ప్రత్యేకంగా నిలిచింది.
పెళ్లి పందిరిలో ఆనందం..
ఆత్మీయుల మధ్య అనురాగం..
అందరి ఆశీస్సులతో కొత్త జీవితంలోకి అడుగు పెట్టిన నూతన దంపతులు..
జయవర్ధన్ రెడ్డి -శ్రావ్య రెడ్డి దంపతులకు హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు.
వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందాలతో నిండాలని ఆకాంక్షిద్దాం.

## యూపీలో హిందూ లీడర్ ధీరేంద్ర ప్రతాప్ సింగ్ హత్య

**కాల్చి చంపి, కాలువలో పారేసిన దుండగులు**



ఉత్తర ప్రదేశ్‌లో ప్రముఖ హిందూ నాయకుడు ధీరేంద్ర ప్రతాప్ సింగ్‌ను కాల్చి చంపాను. లక్నోలోని దుబగ్గా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక కాలువలో ఆయన మృతదేహం లభ్యమైంది. అతడి ఫార్చ్యూనర్ కారులోనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత అదే కారులో మృతదేహాన్ని తీసుకెళ్లి, కాలువలో పడేశారు. ఈ ఘటన సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ధీరేంద్ర ప్రతాప్ సింగ్ సొంత ఊరు ఉన్నావ్ అయినప్పటికీ, లక్నోలో నివాసం ఉంటున్నారు. భూ వివాదం కారణంగా ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో తేల్చారు. ధీరేంద్ర డ్రైవర్ పాత్రపై కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ నేరం చేయడానికి అతడి ప్రత్యర్థులతో కుట్ర పన్ని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. పోలీసులు అన్ని కోణాల్లో హత్యను దర్యాప్తు చేస్తున్నారు. హత్య వెనక కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# క్రీడలు అభివృద్ధికి కృషి చేద్దాం

- ప్రభాకర్ బాబుకు ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలోఘన సన్మానం
- మచ్చా రామలింగారెడ్డి
- రాష్ట్ర అధ్యక్షులు ఏపీ ఒలంపిక్ అసోసియేషన్

**అనంతపురం ఆగస్టు 30, అనంత జనశక్తి న్యూస్**



క్రీడలు అభివృద్ధికి అన్ని క్రీడా అసోసియేషన్లు ఐకమత్యంతో కృషి చేయాలని జిల్లాలో ఎంతోమంది ప్రతిభ ఉన్న యువ క్రీడాకారులు ఉన్నారని వారిని గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని క్రీడాభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు వెళ్లాలని ఏపీ ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి అన్నారు
అనంతపురం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో ఇటీవల ఏపీ లాన్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన ప్రభాకర్ బాబుకు సన్మాన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ చౌదరి అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో ఏపీ టెన్నిస్అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ బాబ్జి ఖాదర్ బాషా టైక్వాండో అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ వెంకటేశులు వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి గువ్వల శ్రీకాంత్ రెడ్డి శ్రీధర్ రెడ్డి కుల్లాయి స్వామి కిషోర్ రఘు శ్రీనివాసులు రవి తిప్పయ్య మురళినాగరాజు రమేష్ రెడ్డిఒలంపిక్ అసోసియేషన్ జిల్లా సభ్యులు ఖాదర్ భాష రమేష్ వెంకటకృష్ణ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ముఖ్య అతిథి మచ్చ రామలింగారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో టెన్నిస్ అసోసియేషన్ రాబోవు రోజుల్లో మరింత అభివృద్ధి చెందాలని ప్రభాకర్ బాబు నాయకత్వంలో మరిన్ని టోర్నమెంట్లు నిర్వహించి జిల్లాలో ప్రతిభ ఉన్న టెన్నిస్ క్రీడాకారులను గుర్తించి వారికి అన్ని విధాలుగా అండగా ఉండాలని మచ్చ రామలింగారెడ్డి అన్నారు ప్రభాకర్ బాబు అనేక సంవత్సరాలుగా అనేక క్రీడా సంఘాల్లో పనిచేసిన అనుభవం ఉన్నదని ఇప్పుడు టెన్నిస్ అసోసియేషన్ మరింత అభివృద్ధి చెందేందుకు ఈ ఎంపిక ఎంతగానో ఉపయోగపడుతుందని మచ్చ రామలింగారెడ్డి అన్నారు సమావేశ అనంతరం ప్రభాకర్ బాబును మచ్చ రామలింగారెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు పెద్ద ఎత్తున క్రీడాకారులు క్రీడాభిమానులు పాల్గొని సన్మానించారు

# పేదల గుండెల్లో చిరస్థాయిగా పరిటాల రవీంద్ర...!!



- వెంకటాపురంలోని పరిటాల సమాధి వద్ద ఘన నివాళులు.
- జయంతి వేడుకల్లో ధర్మవరం టిడిపి నాయకులు.

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 30, అనంత జనశక్తి న్యూస్:**

పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పోరాడి, వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహనీయుడు పరిటాల రవీంద్ర అని ధర్మవరం టీడీపీ నాయకులు కొనియాడారు. పరిటాల రవీంద్ర జయంతిని పురస్కరించుకుని వెంకటాపురం గ్రామంలోని ఆయన సమాధి వద్ద టీడీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా పరిటాల రవీంద్ర సేవలను, ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావాన్ని నాయకులు స్మరించుకున్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని, ప్రజల గుండెల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. పరిటాల ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొట్టు కిష్ట, జింకల రాజన్న, పూజ మొబైల్ సాయి, అంగజాల వీరప్పతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పరిటాల రవీంద్ర సమాధికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపునకు నోటీసులు

- కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఆక్రమణలపై అధికారులు కొరడా..
- అనధికార నిర్మాణాలు తొలగించాలని ఆదేశాలు

**అనంతగిరి,ఆగస్టు 30:అనంత జనశక్తి న్యూస్**



అనంతగిరి మండలంలోని కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి,వై.సంతోషి, విఆర్ఓ,లక్ష్మి ప్రశాంతి నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు నోటీసులో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం,1994తో పాటు సంబంధిత నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం,అనధికారికంగా దుకాణాలు,ఇతర నిర్మాణాలు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు.ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించి,భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే చర్యలు చేపడతామని వారు తెలిపారు.ఈ మేరకు కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మువ్వల కృష్ణ,విజ్ఞాపు మహాలక్ష్మి,మూ నూరు. పరుశురాం,మజ్జి అప్పలరాజు, దొండపర్తి అక్కులు ,గొర్రె కోటేశ్వరమ్మ,కొట్యాడా కవిత, కొర్ర తులసి,దేవా భక్తుల చంటిబాబు తదితరులకు ముందస్తు నోటీసులు జారీ చేసినట్లు వారు తెలిపారు. నోటీసులు అందుకున్న వారు తమకు సంబంధించిన స్థలాల పై ఉన్న అనధికారిక నిర్మాణాలు, ఆక్రమణలను తొలగించు కోవాలని అధికారులు సూచించారు.లేదా ఆ స్థలాలకు సంబందించిన అధికారిక పత్రాలు,ఇతర అనుమతులు వారి వద్ద ఉంటే సచివాలయంలో సంప్రదించా లని వారు తెలిపారు .నిర్ణీత గడువులోగా ఆక్రమణలను తొలగించకపోతే పంచాయతీ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# హ్యాట్రిక్ విజయాలతో చిచ్చరపిడుగులు

- మండల పరిధిలో చిగిచెర్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థులు.
- 226 పాయింట్లు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుతో తిరుగులేని ఆదిపత్యం.
- హై స్కూల్ హెడ్మాస్టర్ తిమ్మారెడ్డి.

**శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 30, అనంత జనశక్తి న్యూస్:**



హ్యాట్రిక్ జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో మండల పరిధిలో చిగిచెర్ల జడ్పీ హైస్కూల్ 226 పాయింట్లతో "స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్" అవార్డుల్లో తిరుగులేని ఆధిపత్యం సాధించిందని హెడ్మాస్టర్ తిమ్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....
జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, డీఈఓ కృష్ణప్ప, ఎస్జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చేతుల మీదుగా అవార్డు ప్రదానం అందుకోవడం గర్వించ దగ్గర విషయం అని తెలిపారు.హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకుని నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవం (ఆగస్టు 29, 2026) సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా విద్యాశాఖ మరియు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రకటించిన "స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డ్స్ - 202627" లో ధర్మవరం మండలం చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సరికొత్త రికార్డు సృష్టించింది. క్రీడారంగంలో నిరంతర ప్రతిభ కనబరుస్తూ ఈ పాఠశాల వరుసగా మూడవసారి జిల్లా స్థాయి ప్రథమ స్థానాన్ని (హ్యాట్రిక్) దక్కించుకుంది అని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల క్రీడా విజయాల ఆధారంగా 5 మంది సభ్యుల కమిటీ పరిశీలన అనంతరం ప్రకటించిన జాబితాలో, చిగిచెర్ల ఉన్నత పాఠశాల ఏకంగా 226 పాయింట్లతో జిల్లాలోనే అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది అని సంతోషాన్ని వ్యక్తం చేశారు. పుట్టపర్తి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాశాఖాధికారి , స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చేతుల మీదుగా పాఠశాలకు ప్రథమ బహుమతి జ్ఞాపిక (ట్రోఫీ), ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు అని తెలిపారు. వరుసగా మూడవ ఏడాది కూడా పాఠశాల జిల్లాలోనే అగ్రగామిగా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డిను విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతక విజేతలుగా తీర్చిదిద్దుతున్న ఫిజికల్ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి ను, అలాగే ప్రతిభ కనబరిచిన విద్యార్థి క్రీడాకారులను జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా అభినందించడం మరుపురాని రోజుగా వారు వర్ణించారు.

# నీట్-పీజీ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి, ఆగస్టు 30: అనంత జనశక్తి న్యూస్**




శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆదివారం పుట్టపర్తిలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఏర్పాటు చేసిన నీట్‌పీజీ కంప్యూటర్ ఆధారిత పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన భద్రతా ఏర్పాట్లు, అభ్యర్థుల తనిఖీ ప్రక్రియ, కంప్యూటర్ సిస్టమ్‌లు, విద్యుత్ మరియు ఇంటర్నెట్ కనెక్టివిటీ, పోలీసు బందోబస్తును సమగ్రంగా పరిశీలించారు. ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 12:30 వరకు జరిగిన ఈ పరీక్షకు జిల్లాలో మొత్తం 100 మంది అభ్యర్థులకు గాను 96 మంది హాజరయ్యారని, 4 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.పరీక్షను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా స్థాయిలో సమర్థవంతమైన నిర్వహణకు గాను కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

# వివాహానికి హాజరైన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ బొంబాయి

**యాడికి, ఆగస్టు 30, అనంత జనశక్తి న్యూస్ :**

అవుకు మండలం శ్రీ కంబగిరి స్వామి దేవాలయంలో గుర్రాల వివాహ కార్యక్రమానికి హాజరైన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ బొంబాయి రమేష్ నాయుడు ఆదివారం హాజరయ్యారు.ముందుగా కంబగిరిస్వామి కి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గుర్రాల వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ( కంభగిరి స్వామి వెడ్స్ లక్ష్మి ) బొంబాయి రమేష్ నాయుడు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బొంబాయి బ్రదర్ ఎంపీటీసీ సభ్యులు వెంకటనాయుడు, గుర్రాల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం




**అనంతగిరి,ఆగస్టు 30:అనంత జనశక్తి న్యూస్**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ పరిధిలోని పెదకోట గ్రామానికి చెందిన సంతారి పరశురాం ఇటీవల ప్రమాదంలో మృతి చెందారు.ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు తెలుగుదేశం పార్టీ ఇన్సూరెన్స్ కార్యకర్తల సంక్షేమ నిధుల నుంచి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించారు.
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఈ ఆర్థిక సాయాన్ని మంజూరు చేసినట్లు కూటమి నాయకులు తెలిపారు. అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి దున్ను దొర చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దకోట గ్రామ కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకులు జంపరం దేవుడు, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ టి. కృష్ణమూర్తి, టీడీపీ కార్యకర్తలు, బొందం పంచాయతీకి చెందిన సుంకర్ జంపన్న, వీఆర్పీ ముత్యాలమ్మ, దారుపల్లి మండలానికి చెందిన వైసీపీ నాయకుడు తేడా సింహాచలం తదితరులు పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, పార్టీ నాయకులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# వివాహానికి హాజరైన ఎం.సంజీవరాయుడు



**యాడికి, ఆగస్టు 30, అనంత జనశక్తి న్యూస్:**

మండల పరిధిలోని పెద్దపెట గ్రామంలో ఆదివారం జరిగిన వివాహానికి మండల కన్వీనర్ ఎం.సంజీవరాయుడు హాజరయ్యారు. నూతన వధూవరులైన పైంటి అజేయ కుమార్,అక్షయ లను మండల కన్వీనర్ ఎం.సంజీవరాయుడు ఆశీర్వదించి, బహుమతి ని అందచేశారు. అనంతరం విందు ను స్వీకరించారు.ఈయన తో పాటు చెక్క నాగప్ప , ఓబులేసు, లక్ష్మి దేవి, తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



- 75 మందికి నేత్ర పరీక్షలు.....
- 41 మంది కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక....

**ధర్మవరం ఆగష్టు 30 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య, శస్త్రచికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి దాతగా శ్రీ చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్ వ్యవహరించారు. శిబిరంలో మొత్తం 75 మంది ఓపీ సేవలను వినియోగించుకోగా, 41 మంది కంటి శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారు. అవసరమైన వారికి తదుపరి దశలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గవ్వల రాధాకృష్ణ, కార్యదర్శి శ్రీరాములు, కోశాధికారి విజయ్ కుమార్, సీనియర్ లయన్ సభ్యులు వెంకటస్వామి, మోహన్ దాస్, పల్లె వేణుగోపాల్, వేణుగోపాలచార్యులు తదితరులు పాల్గొన్నారు.శిబిరానికి హాజరైన వారికి భోజన సౌకర్యాన్ని నల్లగుండ్ల వెంకటరాముడు కల్పించారు. కంటి వెలుగు ప్రతి ఒక్కరి హక్కు... సేవా దృక్పథంతో ఉచిత వైద్యం అందించడం అభినందనీయం.

# శ్రీకృష్ణాష్టమి వేడుకలకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ముస్తాబు

- సెప్టెంబర్ 4న ఘనంగా వేడుకలు – పోస్టర్లు విడుదల, విలేకరుల సమావేశం

**అనంతపురం ఆగస్ట్ 30,అనంత జనశక్తి న్యూస్**

శ్రీకృష్ణాష్టమి జయంతి వేడుకలను పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను శ్రీకృష్ణాష్టమి జయంతి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.సెప్టెంబర్ 4వ తేదీన నిర్వహించనున్న శ్రీకృష్ణాష్టమి జయంతి వేడుకలకు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ , గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి శ్రీ కోలుసు పార్థసారథి , స్థానిక శాసనసభ్యులు శ్రీమతి పరిటాల సునీత విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయి డైరెక్టర్లు, రాష్ట్ర నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, సాంస్కృతిక ప్రతిభను వెలికితీసే విధంగా వివిధ క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే క్రికెట్ టోర్నమెంట్‌తో పాటు ముగ్గుల పోటీలు తదితర కార్యక్రమాలను నిర్వహించేందుకు కమిటీ ఏర్పాట్లు చేసింది.ఈ సందర్భంగా శ్రీకృష్ణాష్టమి జయంతి కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేయడంతో పాటు విలేకరుల సమావేశాన్ని కమిటీ చైర్మన్ జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, సాంస్కృతిక చైతన్యం పెంపొందించడంతో పాటు శ్రీకృష్ణుడి సందేశాన్ని యువతలోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.శ్రీకృష్ణుడి జీవితం యువతకు ధైర్యం, కర్తవ్యనిష్ఠ, నాయకత్వ లక్షణాలకు ఆదర్శమని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఈ శ్రీకృష్ణాష్టమి జయంతి వేడుకలను విజయవంతం చేసేందుకు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, యాదవ సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కమిటీ చైర్మన్ జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు.



# స్మార్ట్ ఫోన్లపై ఆసక్తి..... చదువుపై విరక్తి...!

- ఆప్యాయత , అనురాగాలకు దూరం అవుతున్నారు.....
- ఆటలకు దూరం అవుతున్న చిన్నారులు
- స్మార్ట్ ఫోన్ లతో లాభాల కంటే నష్టాలే ఎక్కువ
- చివరకు స్మార్ట్ ఫోన్ లలోనే షాపింగ్.....
- విద్యార్థులు స్మార్ట్ ఫోన్ లకు దూరంగా ఉండాలి
- స్మార్ట్ ఫోన్ లతో అనేక రోగాలకు దగ్గర అవుతున్నారు
- సెల్ఫీతో ప్రాణాలను పోగోట్టుకోన్నారు....
- స్మార్ట్ ఫోన్ లతో తస్మాత్ జాగ్రత్త.....





**యాడికి, ఆగష్టు 30, అనంత జనశక్తి న్యూస్ :**

మా పిల్లవాడు ఇంట్లో సక్రమంగా చదవడం లేదు, ఎప్పుడు ఆటలు ఆడుతుంటారు అని ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేయడం 1990 సంవత్సరపు నాటి మాటి, మా పిల్లవాడు ఎప్పుడు టివి ని చూస్తుంటాడు.... సక్రమంగా చదవడం లేదు అనేది 2000 సంవత్సరపు మాట.....,, ప్రస్తుతం కాలం మారింది ........, టెక్నాలజీ పెరిగిపోయింది......, ఇలాంటి ప్రస్తుత తరుణంలో ఏలా ఉంది అంటే..... , మా పిల్లవాడు ఇంట్లో ఎప్పుడు సెల్ ఫోన్ లో గేమ్స్ అడుతుంటాడు ... ఏ మాత్రం చదవడం లేదు అని, నేడు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తున్నారు. చిన్న పిల్లల

నుంచి ముసలివాళ్ల వరకు స్మార్ట్ ఫోన్ల వినియోగం బాగా పెరిగింది. అందులో ఎక్కువగా యువత స్మార్ట్ ఫోన్ల వైపు మొగ్గు చూపుతున్నారు. గత 40 సంవత్సరాల క్రితం ఎలా ఉండేది అంటే..... ,చిన్న గ్రామంలోను,పెద్ద పట్టణం లోని వీధిలో ఒక ల్యాండ్ ఫోన్ మాత్రమే ఉండేది......, ఆ వీధిలో గాని, ఆ గ్రామంలో గాని ఎవరికైనా ఫోన్ వచ్చిందని కబురు వస్తే, చేసే పనిని ఆపేసి, ఎంతో సంతోషంతో ల్యాండ్ ఫోన్ వద్ద కు పరుగెడుతు వెళ్లి మాట్లాడే వాళ్లం.... అప్పుడు ఆ రోజు అంతా సంతోషంగా మాకు ఫోన్ వచ్చిందని అందరికి చెప్పేవాళ్లం. ప్రస్తుతం ప్రతి ఇంటిలో ఎంత మంది ఉంటే అందరికి సెల్ ఫోన్ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు తెలిపారు . ఒకప్పుడు ఇంటికి బంధులు వస్తే ఇళ్లంతా మాటలతో సందడిగా ఉండేదని, కానీ ఇప్పుడు సెల్ ఫోన్ ను ముందు పెట్టుకొంటే, ఇంట్లో ఎంత మంది బంధువులు ప్రక్కన ఉన్న, మాట్లాడక సెల్ ఫోన్లో బిజీ అయ్యిపోతున్నారని తెలిపారు. ప్రస్తుతం సెల్ ఫోన్ల వినియోగం రోజు రోజుకు మార్కెట్లో పెరిగిపోతున్నది. దీంతో ప్రతి గ్రామంలో స్మార్ట్ ఫోన్ల అందుబాటులో ఉన్నాయి. స్మార్ట్ ఫోన్ల వల్ల ప్రజలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని వినియోగదారులు తెలిపారు. స్మార్ట్ ఫోన్ ముందర ఉంటే ప్రపంచంలో ఏమి జరుగుతున్న అంతా గమనించవచ్చు అని, ప్రస్తుతం టెక్నాలజీ బాగా పెరిగిపోయిందని, స్మార్ట్ ఫోన్లలలోనే షాపింగ్, బ్యాంకులో ఉన్న నగదును ట్రాన్స్ ఫర్ చేయడం, రైల్వే, విద్యుత్ బిల్లులను చెల్లించడం, విమాన,బస్సు టిక్కెట్లను కుడా ముందే బుక్ చేస్తున్నామని తెలిపారు. ఇలా ప్రతి వస్తువును కొనుగోలు చేయడం జరుగుతున్నదని, ఏ విషయాన్ని అయిన ,ఎక్కడ ఉన్న వారికైనా ఒక్క క్షణంలో

విషయాన్ని చేరవేయవచ్చు అని తెలిపారు. ఒకప్పుడు బట్టలు కొనాలంటే, ఇంట్లో వారంతా బట్టల దుకాణానికి వెళ్లి నచ్చిన బట్టలను కొని ఆనందాన్ని పలువురికి పంచేవాళ్లమని, ప్రస్తుతం బట్టలను, చొప్పులను, షూస్ లను, ఫర్నిచర్ ను, ఫ్రిజ్, లాప్ టాప్,టివి ...., ఇలా ఒకటి కాదు ఏ వస్తువు అయిన ఆన్ లైన్ లో కొనేయవచ్చు అని తెలిపారు. అందుకే స్మార్ట్ ఫోన్లకు డిమాండ్ బాగా పెరిగి పోయిందన్నారు. అంతే గాక చిన్నారులు సైతం స్మార్ట్ ఫోన్లలతో గేమ్స్ ఆడడం, చెవులకు ఎయిర్ ఫోన్స్ పెట్టుకోని పాటలు వినడం, స్మార్ట్ ఫోన్లలోనే సినిమాలు చూడడం జరుగుతున్నదిని, దీంతో ప్రతి ఒక్కరిని స్మార్ట్ ఫోన్ ఆకర్షిస్తున్నదని తెలిపారు .నేటి తరం పిల్లలకు పాత కాలం నాటి ఆటలు చాలా మందికి తెలియడం లేదని చాలా మంది తల్లిదండ్రులు తెలియచేస్తున్నారు. చిల్లా కట్టి, దొంగా పోలీస్ ఆట, బంతి ఆట, కుంటాట, బొంగరాల ఆట, తొక్కడు బిల్ల ఆట, తదితర ఆటలు చిన్న పిల్లలకు చాలా మంది మరచిపోతున్నారని కొంత మంది తల్లిదండ్రులు తెలిపారు. అంతే గాక స్మార్ట్ ఫోన్ల వల్ల అప్యాయత అనురాగాలు కూడా తగ్గుతున్నాయని కొంత మంది వాపోయారు. విద్యార్థులు కూడా ఫోన్లకు బానిస అయ్యి, సక్రమంగా విద్యను కొందరు విద్యార్థులు అభ్యసించలేకపోతున్నారని తల్లిదండ్రులు తెలిపారు. ఈ స్మార్ట్ ఫోన్లను ఎక్కువగా వాడడం వల్ల, పలు అనేక సమస్యలు తలెత్తుతాయని వైద్యాధికారులు తెలియచేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ల వల్ల తలనొప్పి, మెడ నొప్పి,కంటి చూపు దెబ్బతినడం, మెదడుకు సంబందించిన వ్యాధులు, నరాలకు సంబంధించిన రోగాలు ఎక్కువగా వస్తాయని వైద్యాధికారులు తెలియచేశారు. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ అవసరం కాని, స్మార్ట్ ఫోన్ కు ఎవరు బానిస కాకుడదు అని అంటున్నారు. చివరకు సెల్ఫీ వల్ల ప్రాణాలు కూడా కోల్పోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. మనిషికి స్మార్ట్ ఫోన్ ఎంత లాభాకరంగా ఉందో.... అంతే నష్టాలు కూడా ఉన్నాయని, రోగాలకు దూరంగా ఉండాలంటే సెల్ ఫోన్ల తక్కువగా వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యాధికారుల సూచనగా తెలిపారు.







# సీఎం చంద్రబాబును కలిసిన జశ్వంత్ వ్యాస్



**అనంతపురం, ఆగస్టు 30 : అనంత జనశక్తి న్యూస్**

గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం కుమార్తె, అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పూల నాగరాజు కుమారుడు వివాహ వేడుకకు హాజరవడానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును హెలిప్యాడ్ వద్ద మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ యువజన అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

# సంధా రాఘవకు రాఖీ కట్టిన టీడీపీ వీర మహిళలు



- అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ వేడుకలు.....

**ధర్మవరం ఆగష్టు 30 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు ఆత్మీయంగా జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ వీర మహిళలు, మహిళా కార్యకర్తలు కలిసి టీడీపీ యువ నాయకులు సంధా రాఘవ కి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా మహిళా కార్యకర్తలు చూపిన ఆప్యాయతకు సంధా రాఘవ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. టీడీపీ కుటుంబంలో ఆత్మీయతకు ప్రతీకగా నిలిచిన రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి.

# *పరిహారం ఇవ్వకుంటే ఆత్మహత్యే మాకు శరణ్యం



**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 30 అనంత జన శక్తి న్యూస్.**

జాతీయ రహదారి నిర్మాణం కోసం తమ భూమిని స్వాధీనం చేసుకున్నప్పటికీ నేటికీ నష్టపరిహారం చెల్లించలేదని రైతులు ఓబులేష్ నాయక్, రాజ్‌కుమార్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం అందకుండా రోడ్డు పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తే అడ్డుకుంటామని, తమకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని హెచ్చరించారు.పుట్టపర్తి మండల పరిధిలోని కప్పలబండ గ్రామ పొలంలో గోనే నాయక్ తండా సమీపంలో తమ తండ్రి వాలే నాయక్ పేరిట 1.16 సెంట్ల భూమి ఉందని బాధితులు తెలిపారు. ఇందులో సర్వే నంబర్ 165-3హెచ్‌లో 28 సెంట్ల భూమిని జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు నష్టపరిహారం మాత్రం అందలేదని వాపోయారు.భూమి కొలతలు, హద్దుల నిర్ధారణ కోసం నాలుగుసార్లు చలానాలు చెల్లించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. తమకు సమీపంలోని భూముల విషయంలో తక్కువ విస్తీర్ణం ఉన్నా ఎక్కువగా చూపించి పరిహారం చెల్లించారని, ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులపై అనుమానాలు ఉన్నాయని ఓబులేష్ నాయక్ ఆరోపించారు. తమ వద్ద అన్ని రకాల భూ పత్రాలు ఉన్నప్పటికీ పరిహారం చెల్లించడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు.పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఆవేదనకు గురైన తన భర్త వాలే నాయక్ అనారోగ్యంతో మృతి చెందారని ఆయన భార్య లక్ష్మమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. సమస్యపై జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్ లో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇంతవరకు న్యాయం జరగలేదని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు పాల్పడేందుకు కూడా సిద్ధమని ఆమె హెచ్చరించారు. బాధితుల ఆవేదనను అధికారులు పరిగణనలోకి తీసుకుని భూమి వివరాలు, పరిహారం చెల్లింపు అంశంపై సమగ్ర విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆరోజు గుంతల రోడ్లలో నడిచాం... ఈరోజు నూతన రోడ్లు తీసుకొచ్చాం

- ఆత్మకూరు మండలంలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం సందర్భంగా పరిటాల సునీత
- రూ.4.10 కోట్లతో బి.టి.రోడ్లకు భూమిపూజ
- రూ.1కోటితో నిర్మించిన సి.సి. రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత
- పరిటాల రవి జయంతి సందర్భంగా తోపుడు బండ్లు పంపిణీ
- రైతులకు నూతన ట్రాన్స్ ఫార్మర్లను అందజేసిన ఎమ్మెల్యే సునీత
- నన్ను ఆదరించిన ఆత్మకూరు మండలాన్ని మరువనన్న ఎమ్మెల్యే సునీత



**రాప్తాడు ఆగష్టు 30 అనంత జనశక్తి న్యూస్**

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గుంతల రోడ్లమీద నడిచామని ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే చోట నూతన రోడ్లు వేసి చూపిస్తున్నామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆదివారం ఆమె ఆత్మకూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా వద్దుపల్లి సమీపంలోని...

33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద 25 మంది రైతులకు 25కే.వి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను పంపిణీ చేశారు. ఎన్నో రోజులుగా ట్రాన్స్ఫార్మర్ల కోసం ఎదురుచూస్తున్నామని.. ఇప్పుడు అవి రావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే సునీతకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అక్కడే పరిటాల రవీంద్ర 68వ జయంతి సందర్భంగా టిడిపి నాయకులు అభిమానులు తెచ్చిన కట్ చేశారు. ఆ తర్వాత నూతన రోడ్ల నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఆత్మకూరు మండల కేంద్రం నుంచి బి.యాలేరు మీదుగా కూడేరు మండల సరిహద్దు వరకు రూ.3కోట్ల పి.ఆర్. ఆర్ ఫ్లైన్ నిధులతో, 6కిలోమీటర్లు తారురోడ్డు, ఆత్మకూరు మండలకేంద్రంనుంచి, కళ్యాణదుర్గం నియోజకవర్గం, నుసి కొట్టాల గ్రామ సరిహద్దు వరకు 1.10 కోట్ల పి.ఆర్.ఆర్, ఫ్లైన్ నిధులతో, 2 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణం కోసం భూమి పూజలు చేశారు. అలాగే ఆత్మకూరు మండల కేంద్రంలోని ఓ.సి కాలనీలో, 65లక్షలు, బీసీ కాలనీలో 35లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సి.సి.రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఒక పండుగ వాతావరణంలో ఈ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు జరిగాయి. ఆత్మకూరు మండలం పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన చంద్రన్న అనే రైతుకు చెందిన గొర్రెలు విషపునీళ్లు తాగి చనిపోగా...ఎన్ఆర్ఐ ప్రభాకర్ 20వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే సునీత చేతుల మీదుగా అందజేశారు. అలాగే ఆత్మకూరు మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పరిటాల రవి 68వ జయంతి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. అక్కడ కేక్ కట్ చేసి.. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రవి జయంతి సందర్భంగా చిరు వ్యాపారులకు 20తోపుడు బండ్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పరిటాల రవీంద్ర జయంతి కార్యక్రమాన్ని ఆత్మకూరు మండలంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో నిర్వహించారని వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతున్నట్లు తెలిపారు. ఇంత మంచి రోజున అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం కూడా సంతోషంగా ఉందని అన్నారు. కక్కలపల్లి టమోటా మండీల నిర్వాహకులు రాప్తాడు నియోజకవర్గంలోని 6మండలాలలో ఉన్న చిరు వ్యాపారుల ఉపాధికి ఊతం కల్పించే ఆలోచనతో ముందుకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. 18లక్షల రూపాయలు విలువైన, 120 తోపుడు బండ్లను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. రాప్తాడు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బోయపాటి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఆత్మకూరు మండలంలో ప్రజలు నన్ను ఆదరించి మంచి మెజారిటీతో గెలిపించారని అందుకే.. గతంలో ఎప్పుడు లేని విధంగా ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు అసలు రోడ్లే లేని గ్రామాలకు కొత్త రోడ్లు తీసుకొచ్చామన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పాదయాత్ర చేసినప్పుడు గుంతలు పడ్డ రోడ్లమీద వెళ్లామని.. ఇప్పుడు ఆస్థానంలో కొత్త రోడ్లు కనిపిస్తున్నాయన్నారు. ఈ రెండేళ్లలోనే ఆత్మకూరు మండలంలో 60 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. ఇంకా చేయాల్సిన కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయని.. ఎమ్మెల్యే సునీత అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అప్పటి అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు ఎదుర్కొని నిలిచారని అలాంటి వారిని నేను ఎప్పటికీ మరువలేనని అన్నారు. చాలామంది కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారని త్వరలోనే అవి మంజూరవుతాయని ఎమ్మెల్యే సునీత తెలిపారు..



## శ్రీ సాయినిధి ఎంటర్‌ప్రైజెస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి..



**బనగానపల్లె ఆగస్టు 30, అనంత జనశక్తి న్యూస్**

బనగానపల్లె పట్టణంలోని నంద్యాల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి నిధి ఎంటర్‌ప్రైజెస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు డి. షేక్షావలి, డి. మహబుబ్ ఖాసిం సాహెబ్ మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి శ్రీ సాయినిధి ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రారంభించారు.ప్రారంభోత్సవం అనంతరం మంత్రి స్వయంగా ఐరన్, స్టీల్ వస్తువులను విక్రయించి సందడి చేశారు. సంస్థ నిర్వాహకులకు అభినందనలు తెలిపి, వ్యాపార రంగంలో సంస్థ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. స్థానికంగా వ్యాపార సంస్థలు అభివృద్ధి చెందడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు డి. షేక్షావలి, డి. మహబుబ్ ఖాసిం సాహెబ్, స్థానిక నాయకులు, వ్యాపార ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## అనంత పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు కు వీడ్కోలు పలికిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



**అనంతపురం ఆగస్ట్ 30, అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం నగరంలోని ఎం.వై.ఆర్. ఫంక్షన్ హాల్లో జరిగిన ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పూల నాగరాజు కుమారుడు జయరాజ్, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె విద్యా వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఘన వీడ్కోలు లభించింది. వివాహ వేడుక అనంతరం అనంతపురం శిల్పారామం సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మాజీ మంత్రి, టీడీపీ పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి పలు అంశాలపై ఆత్మీయంగా మాట్లాడారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెలికాప్టర్‌లో తదుపరి పర్యటనకు బయలుదేరారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఘనంగా వీడ్కోలు పలికారు.

## క్రికెట్ మైదానంలో యువత జోరు



- అటల్ జనహిత్ టోర్నమెంట్ హుషారు.....
- ఆటే కాదు.. యువతకు దిశానిర్దేశం....
- వాజపేయి స్ఫూర్తి.. మోదీ ఆలోచన..
- సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో క్రీడలకు పెద్దపీట....

**ధర్మవరం ఆగష్టు 30 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న అటల్ జనహిత్ వాజపేయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ – సీజన్ 3 ఉత్సాహభరితంగా కొనసాగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ యువతలో క్రీడా స్ఫూర్తిని మరింత పెంచుతోంది. టోర్నమెంట్‌లో భాగంగా 7వ రోజు 2వ రౌండ్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్ బాబు టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను కలుసుకుని వారి ఆటతీరుపై మాట్లాడి, మరింత ఉత్సాహంతో ఆడాలని ప్రోత్సహించారు. "గెలుపోటములు క్రీడల్లో సహజం.. కానీ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగడమే అసలైన విజయం"అంటూ యువ క్రీడాకారులకు హరీశ్ బాబు సూచించారు. మ్యాచ్ అనంతరం విజేత జట్ల క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీలను స్వయంగా అందజేసి అభినందించారు. వాజపేయి స్ఫూర్తితో.. ప్రధాని నరేంద్ర మోదీ యువతకు ప్రాధాన్యత ఇచ్చే ఆలోచనలతో.. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో.. యువత క్రీడల వైపు అడుగులు వేయాలి.. స్థానిక ప్రతిభకు సరైన వేదిక దక్కాలి.. మన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటాలి!

# కొటబొమ్మాలి కొత్తమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికే రూ.4.52 కోట్లు

- గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడుల కృషికి దక్కిన ఫలితం
- ప్రాకార మండపం నిర్మిస్తూ ఆలయాన్ని ముస్తాబు చేసేందుకు నిధులు మంజూరు
- రూ.48 లక్షల మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్‌తో అభివృద్ధికి బాట
- ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్



**కొటబొమ్మాలి, ఆగస్టు 30:అనంత జనశక్తి న్యూస్**

శ్రీకాకుళం జిల్లా కొటబొమ్మాలి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొత్తమ్మ అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధి పనులకు రూ.4.52 కోట్లు ఉమ్మడి నిధులు మంజూరయ్యాయి. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, అలాగే కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుల ప్రత్యేక కృషి ఫలితంగానే దేవాదాయ శాఖ నుంచి ఈ స్థాయి నిధులు విడుదలయ్యాయి. ఇప్పటికే కొత్తమ్మ తల్లి ఉత్సవాలను రాష్ట్రస్థాయి పండుగలా చేయడంలో వీరి కృషి మరవలేనిది.

**రూ.5 కోట్లతో సమగ్ర ప్రణాళిక..**

కొత్తమ్మ అమ్మవారి దేవాలయ ప్రాకార మండపం నిర్మాణం, ఇతర మరమ్మతులు, అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.5కోట్లతో అంచనాలు రూపొందించారు. ఇందులో భాగంగా స్థానిక మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ కింద రూ.48 లక్షలు డిపాజిట్ చేయగా, దేవాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్ కమిటీ మిగిలిన రూ.4,52,00,000 లను మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ కే. రామచంద్రమోహన్ అమరావతి నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

**వేగంగా టెండర్లు, నాణ్యమైన పనులు..**

మంజూరైన అంచనా వివరాలకు సాంకేతిక అనుమతులు పొంది, ఈటెండర్ల విధానంలో పారదర్శకంగా పనులు ప్రారంభించాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక ప్రజలు, భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ ప్రాకార మండప నిర్మాణం పూర్తయితే భక్తులకు మౌలిక వసతులు మెరుగవుతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఒకరి సరదా... మరొకరి ప్రాణ భయం

- NH-44పై అతివేగ బైక్ రేసులతో భయాందోళనలో ప్రయాణికులు

**రాప్తాడు, ఆగస్టు 30 అనంత జనశక్తి న్యూస్**




అనంతపురం-పెనుగొండ మధ్య 44వ నెంబర్ జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రజల్లో ఇటీవలి కాలంలో ఒక ఆందోళన పెరుగుతోంది. కొందరు యువకులు అతివేగంతో బైకులు నడుపుతూ, పెద్ద శబ్దాలు చేసే సైలెన్సర్లతో ప్రమాదకరంగా దూసుకెళ్తుండటంతో సాధారణ ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.

కొన్ని రోజుల క్రితం ఈ జాతీయ రహదారిపై ఒక కుటుంబం ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా, రెండు బైకులు ఒక్కసారిగా అతివేగంతో దూసుకెళ్లాయి. భారీ శబ్దానికి ఉలిక్కిపడిన చిన్నారి తల్లిని గట్టిగా పట్టుకోగా, బైక్ నడుపుతున్న వ్యక్తి క్షణికం పాటు అదుపు తప్పే పరిస్థితి ఏర్పడింది. అదృష్టవశాత్తూ ప్రమాదం తప్పినా, ఆ కుటుంబంలో కనిపించిన భయం పరిస్థితి తీవ్రతను తెలియజేసింది.

**అనారోగ్యంతో ప్రయాణించే వారికీ ముప్పే**

ఈ రహదారిపై కేవలం సాధారణ ప్రయాణికులే కాకుండా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు, ఇతర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వెళ్లే రోగులు, వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు కూడా నిత్యం ప్రయాణిస్తుంటారు. ఇలాంటి సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో, అత్యంత వేగంతో వాహనాలు పక్క నుంచి దూసుకెళ్తే వారు తీవ్ర భయాందోళనకు గురయ్యే అవకాశం ఉంది.

ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు ప్రశాంతంగా ప్రయాణించాల్సిన పరిస్థితిలో, రేసింగ్ తరహాలో దూసుకెళ్లే వాహనాలు సృష్టించే భయం, ఆకస్మిక శబ్దాలు వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకరి సరదా, మరొకరి ప్రాణాలకు ముప్పుగా మారకూడదని వారు కోరుతున్నారు.

ఇది ఒక్క సంఘటన మాత్రమే కాదని, ఈ మార్గంలో తరచూ ప్రయాణించే పలువురు వాహనదారులు చెబుతున్నారు. రహదారిపై అతివేగంతో దూసుకెళ్లడం, ఇతర వాహనాలను ప్రమాదకరంగా ఓవర్‌టేక్ చేయడం, అధిక శబ్దాలు చేసే సైలెన్సర్లతో ప్రజలను భయపెట్టడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారిపై ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులతో కూడిన కుటుంబాలు, అనారోగ్యంతో ఆసుపత్రులకు వెళ్లే రోగులు ప్రయాణిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా జరిగే బైక్ రేసింగ్ ఎప్పుడు ప్రమాదాలకు దారితీస్తుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ప్రజల అభిప్రాయం ప్రకారం తనిఖీలను మరింత విస్తృతంగా నిర్వహించి, పునరావృతంగా నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా అతివేగంగా నడిపే వాహనాలు, ప్రమాదకరంగా ఓవర్‌టేక్ చేసే వాహనాలు, అధిక శబ్దాలు చేసే సైలెన్సర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**రహదారి రేసింగ్ ట్రాక్ కాదు**

యువత రహదారి అనేది రేసింగ్ కోసం కాదనే విషయాన్ని గుర్తించాలి. బాధ్యతాయుతంగా వాహనాలు నడపడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడిన వారవుతారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు వాహనం ఇవ్వడమే కాకుండా ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యంగా అధికారులు, పోలీసులు, తల్లిదండ్రులు, యువత అందరూ కలిసి బాధ్యతగా వ్యవహరించినప్పుడే 44వ జాతీయ రహదారిపై ప్రయాణం మరింత సురక్షితంగా మారుతుంది.

# వెలిగొండతో మార్కాపురం రూపురేఖలు మారతాయి

- చరిత్ర సృష్టించాలన్నా.. తిరగరాయాలన్నా చంద్రబాబుకే సాధ్యం
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతి ఆగస్టు 30, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో చరిత్ర సృష్టించాలన్నా.. గత చరిత్రను తిరగరాయాలన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే సాధ్యమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వెనుకబడిన మార్కాపురం ప్రాంతాన్ని జిల్లాగా ఏర్పాటు చేయడంతో పాటు హార్టికల్చర్ హబ్‌లో చేర్చడం, వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభించే స్థాయికి తీసుకురావడం చంద్రబాబు నాయుడు నాయకత్వం లోనే సాధ్యమైందని పేర్కొన్నారు.

మార్కాపురం జిల్లా ప్రజలు మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారం కానుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరగనుందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలకు ఇది ఒక చారిత్రక ఘట్టమని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

**ప్రతిపక్షంలో ఉండగానే నికర జలాల కోసం పోరాటం**

వెలిగొండ ప్రాజెక్టుకు నికర జలాలు సాధించేందుకు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఢిల్లీ వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రాంతీయ ప్రజల ప్రయోజనాల కోసం అప్పట్లో చేసిన పోరాటం ఫలించిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల నిర్వహణను సైతం పట్టించుకోలేదని విమర్శించారు. జగన్ రెడ్డి ప్రభుత్వ కాలంలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందని, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ, గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు దెబ్బతిన్నాయని ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్వహణపై నిర్లక్ష్యం వహించిన వైసీపీ నేతలకు వెలిగొండ ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు.

**కరువు ప్రాంతాల్లోకి నీరు.. కొత్త చరిత్ర**

కొండలను బద్దలు కొట్టి కరువు ప్రాంతాల్లో నీరు పారించిన చరిత్ర చంద్రబాబుదేనని మంత్రి పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తవడంతో మార్కాపురం ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక పరిస్థితులు, వ్యవసాయ రంగం రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. వెలిగొండ నిర్వాసితులకు కేవలం 48 రోజుల్లో రూ.768 కోట్ల పరిహారం అందించడం రికార్డుగా నిలిచిందన్నారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో ప్రకాశం జిల్లాలోని కరువు పీడిత ప్రాంతాలకు సాగు, తాగునీటి భద్రత మరింత బలోపేతమవుతుందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలో వ్యవసాయం, ఉద్యానవనం, ఉపాధి అవకాశాలు పెరిగి మార్కాపురం ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా మార్కాపురం ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న కల



సాకారం అవుతున్న వేళ.. వెలిగొండ ప్రారంభోత్సవం చరిత్రలో నిలిచిపోయే ఘట్టంగా మారనుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.

# తెలంగాణలో గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని వెల్లడించారు. ఈ ఏర్పాట్లలో భాగంగా పుష్కరాల స్పెషల్ ఆఫీసర్ కార్యాలయాన్ని ప్రజాభవన్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు.

గోదావరి నది వెంట బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని కొండా సురేఖ తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆయా ప్రాంతాల్లోని దేవాలయాలను అభివృద్ధి చేసేలా పనులు చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పుష్కరాల పనులు ప్రారంభమయ్యాయని, మరికొన్ని పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. ముఖ్యమంత్రి డైరెక్షన్‌లో అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ పనులను



వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. తెలంగాణలో గోదావరి పుష్కరాలను భక్తుల



కు గుర్తుండిపోయేలా భారీ స్థాయిలో నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# సెప్టెంబర్ 5లోపు సానుకూల నిర్ణయం తీసుకోవాలి

**పీఐకాస ఛైర్మన్ విద్యాసాగర్**

విజయవాడ: పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, డీఏల బకాయిలు, సరెండర్ లీవుల చెల్లింపు తదితర సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 5న రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడలో నిర్వహిస్తున్నట్టు ఏపీఐకాస ఛైర్మన్ విద్యాసాగర్ ప్రకటించారు. అన్ని ఉద్యోగ సంఘాల కమిటీలు, నూతనంగా ఎన్నికైన 26 జిల్లాల కమిటీ సభ్యులు సమావేశానికి హాజరవుతారని, సమస్యల పరిష్కారంపై చర్చిస్తామని ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల, పెన్షన్‌దారుల బకాయిలను దశలవారీగా చెల్లించిందని గుర్తుచేశారు. అయితే పీఆర్సీ కమిటీ కోసం పోరాటం చేసిన సందర్భం గతంలో లేదన్నారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకునే ఇన్నాళ్లు ఓపికగా వ్యవహరించామన్నారు. ఉద్యోగుల సమస్యలపై ఇప్పుడు ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. ఎంతో అనుభవం కలిగిన సీఎం చంద్రబాబు ఉద్యోగులకు సంబంధించి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నారని చెప్పారు. ఇదే సామరస్యక వాతావరణంలో ఉద్యోగులకు ప్రయోజనాలు అందించాలనేది తమ ప్రయత్నమని పేర్కొన్నారు. సెప్టెంబర్ 5లోపు ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలకు పరిష్కారం చూపుతుందని తామంతా నమ్ముతున్నామన్నారు. ప్రభుత్వం పెండింగ్ డీఏలు, కనీసం రెండేళ్లకైనా సరెండర్ లీవులు చెల్లించాలని ఏపీఐకాస సెక్రటరీ జనరల్ ప్రసాద్ కోరారు.





# స్నానం చేసే నీటిలో కొద్దిగా ఇప్పుడు చెప్పే పదార్థాన్ని కలపండి, బాడీ పెయిన్స్ తగ్గడమే కాదు ఎన్నో సమస్యలు దూరం

ప్రజెంట్ సిట్చ్యువేషన్ ఎలా ఉందంటే ప్రతీ ఒక్కరూ కూడా లైఫ్‌లో స్ట్రెస్‌గా ఫీల్ అవుతున్నారు. దీంతో ఊరికే అలసిపోవడం, బాడీ పెయిన్స్ వంటివి కామన్ అయిపోయాయి. దీంతో ప్రతీ చిన్న విషయానికే నొప్పి మందులు తీసుకుంటున్నారు. కానీ, అలా కాకుండా కొన్ని సహజ పద్ధతులని ఫాలో అయితే మెడిసిన్ వాడకుండానే నొప్పులని తగ్గించుకోగలుగుతారు. అంటా సహజ పద్ధతుల్లో ఉప్పు నీటి స్నానం ఒకటి. సముద్రపు ఉప్పు నీటిని స్నానం చేసే నీటిలో కలిపి ఆ నీటితో స్నానం చేసి చూడండి. వచ్చే లాభాలు అన్నీ ఇన్నీ కావు.



**సముద్రపు ఉప్పు అంటే**

సముద్రపు ఉప్పు అంటే సముద్రంలోని నీటిని ఎండబెట్టి ఈ ఉప్పుని తయారుచేస్తారు. ఇందులో మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం, జింక్ వంటి ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి మన చర్మం, కండరాలు, కీళ్ళకి చాలా మంచివి. ఈ నీటితో స్నానం చేస్తే ఎన్నో ఎన్నెన్నో లాభాలు కూడా ఉన్నాయి.

**చర్మానికి మేలు**

సముద్రపు నీటితో స్నానం చేయడం వల్ల చర్మానికి మేలు జరుగుతుంది. ఇది చనిపోయిన చర్మ కణాలని తొలగించి కొత్త కణాలు ఏర్పడేలా చేస్తాయి. చర్మాన్ని హైడ్రేట్‌గా, మృదువుగా ఉండేలా చేస్తాయి. స్కిన్ ప్రాబ్లమ్స్‌తో బాధపడేవారు ఈ నీటితో స్నానం చేస్తే చాలా మంచిది. ఎలాంటి మెడిసిన్





వాడకుండానే స్కిన్ చక్కగా మెరుస్తుంది.

**బాడీ పెయిన్స్**

రోజంతా పనిచేయడం, ముఖ్యంగా కూర్చొని చేసే పనిలో 8 నుండి 9 గంటల పనిచేయడం వల్ల శరీర దృఢత్వం, కండరాల నొప్పులు పెరుగుతాయి. నొప్పి నివారణ మందులకి బదులుగా, ఉప్పు నీటితో స్నానం చేయడం వల్ల ఈ నొప్పులు తగ్గుతాయి. దీని వల్ల రక్తప్రసరణ పెరుగుతుంది. కండరాల నొప్పులు తగ్గుతాయి.ముఖ్యంగా, అలసిన పాదాలకి ఉపశమనం లభిస్తుంది.

**ఒత్తిడి తగ్గేందుకు**

ఉప్పు నీటితో స్నానం చేయడం వల్ల బాడీ మాత్రమే కాదు, మనసు కూడా రిలాక్స్ అవుతుంది. గోరువెచ్చని ఉప్పు నీటితో స్నానం చేస్తే ఒత్తిడి తగ్గుతుంది. మంచి నిద్ర వస్తుంది. పడుకునే ముందు, ఇలా నీటిలో ఉప్పు కలిపి స్నానం చేస్తే మంచి రిలాక్స్‌గా ఉంటుంది.

**ఎలా చేయాలి?**

- ఓ టబ్‌లో వేడి నీరు నింపండి.
- అందులో పావు కప్పు నుండి 2 కప్పుల వరకూ సముద్రపు ఉప్పు వేయండి.
- నీరు గోరువెచ్చగా అయ్యేవరకూ అలానే ఉంచితే ఉప్పు కరుగుతుంది. తర్వాత 15 నుంచి 20 నిమిషాలు నీటిలో కూర్చోండి.
- ఆ వీలు లేకపోతే మెల్లిగా నీరు పోసుకుంటూ ఎక్కువసేపు స్నానం చేయండి. తర్వాత మాయిశ్చరైజర్ రాయండి.
- రెగ్యులర్‌గా ఇలా చేసి చూడండి. మంచి రిజల్ట్స్ ఉంటాయి. మీ స్కిన్‌పై ఏవైనా గాయాలు, ఇన్ఫెక్షన్స్, అలర్జీలు ఉంటే ఉప్పు నీటితో స్నానం చేయొద్దు. ఇలా వారానికి 2 నుండి 3 సార్లు చేస్తే చాలు.

# పాదాల పగుళ్ళు పగులుతున్నాయా, ఇప్పుడు చెప్పేవి రాస్తే 7 రోజుల్లోనే కోమలంగా మారతాయి





పాదాల పగుళ్ళు ఉంటే చాలా సమస్యగా ఉంటుంది. నడవలేరు. ముఖ్యంగా చెప్పులు లేక నడిస్తే మరీ ఇబ్బందిగా ఉంటుంది. సమస్య రాగానే మట్టిలో నడిచినా, బట్టలు పిండినా కూడా సమస్య మరింత పెరుగుతుంది. కాబట్టి, దీనిని తగ్గించుకోవాలి. ఆయుర్వేదంలో ప్రతీ సమస్యకి పరిష్కారం ఉన్నట్లుగానే కాలి పగుళ్ళకి కూడా మంచి చిట్కాలు ఉన్నాయి. కొన్ని నూనెలతో ఆయుర్వేద పద్ధతిలో మసాజ్ చేస్తే గనుక 7 రోజుల్లోనే కాలి పగుళ్ళు తగ్గి పాదాలు సాఫ్ట్‌గా మాతాయి. కోమలంగా అనిపిస్తాయి. బయట కొనే క్రీమ్స్ కంటే ఎన్నో రెట్లు ఇవి ఎఫెక్టివ్‌గా పనిచేసి కాలి పగుళ్ళని తగ్గిస్తాయి. పైగా వీటి వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవు. నేచురల్‌గానే బేబి సాఫ్ట్ పాదాలు మీ సొంతమవుతాయి. ఇంట్లో వాడే కొన్ని నూనెల్ని వాడి పాదాల పగుళ్ళని చాలా వరకూ తగ్గించుకోవచ్చు శ్వేతా షా ప్రకారం, వీటిని ఎలా వాడాలో తెలుసుకోండి.

**కావాల్సిన పదార్థాలు**

కావాల్సిన పదార్థాలు

- నువ్వుల నూనె 90 మి.లీ
- వేప నూనె 30 మి.లీ
- అలోవెరా జెల్ 1 టీస్పూన్
- పసుపు 1 టీస్పూన్
- చందనం పొడి 1 టీస్పూన్
- వేప పొడి 1 టీస్పూన్

**ఏం చేయాలి?**

- పైన చెప్పిన పదార్థాలన్నీ ఓ గిన్నెలో కలపాలి.
- దీనిని డబుల్ బాయిల్ మెథడ్‌లో ఓ సారి వేడి చేయండి.
- పడుకునే ముందు కాళ్ళని శుభ్రంగా కడుక్కోవాలి.
- తర్వాత తయారుచేసి పెట్టుకున్న మిశ్రమాన్ని రాసి చక్కగా మసాజ్ చేయాలి.
- తర్వాత కాటన్ సాక్స్‌లు వేసుకుని రాత్రంతా అలానే ఉంచాలి.
- ఇలా రెగ్యులర్‌గా చేస్తే చాాలా వరకూ కాలి పగుళ్ళు తగ్గుతాయి.

**లాభాలు**

వీటిలోని గుణాలు పాదాలని లోతుగా మాయిశ్చరైజ్ చేసి కోమలంగా





మారుస్తాయి.

ఇందులోని యాంటీ మైక్రోబయల్ ప్రోటెక్షన్ స్కిన్‌ని త్వరగా రిపేర్ చేస్తుంది.

దీనిని రెగ్యులర్‌గా వాడడం వల్ల మృదువైన పగుళ్ళు లేని పాదాలు మీ సొంతమవుతాయి. ఇందులో వాడిన నువ్వులనూనె, వేపపొడి, అలోవెరా జెల్ వంటివన్నీ కూడా చర్మ సమస్యల్ని దూరం చేస్తాయి. దీంతో కాలి పగుళ్ళని తగ్గించి పాదాలని సాఫ్ట్‌గా మారుస్తాయి.

**తులసితో కూడా**

కాలి పగుళ్ళు తగ్గేందుకు తులసిని కూడా వాడొచ్చు. దీనికోసం

- తులసి పేస్ట్
- అలోవెరా జెల్
- కర్పూరం



వీటన్నింటిని బాగా కలిపి పాదాలకి మసాజ్ చేయండి. రెగ్యులర్‌గా చేస్తే మీ పాదాల పగుళ్ళు చాలా వరకూ తగ్గుతాయి.

**పాదాలు పగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

పగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- దీనికోసం రెగ్యులర్‌గా పాదాలను 15 నిమిషాల పాటు గోరువెచ్చని నీటిలో నానబెట్టండి.
- తర్వాత వాటిని ప్యూమిస్ రాయితో స్క్రబ్ చేయండి. దీంతో డెడ్ స్కిన్ సెల్స్ దూరమవుతాయి.
- తర్వాత హార్ష్, సువాసనలు ఉండే క్రీమ్స్ సోప్స్ బదులు కొబ్బరినూనె, ఆలివ్ ఆయిల్, బాదం ఆయిల్ రాయండి.
- రాత్రుళ్ళు రాసి మసాజ్ చేసి సాక్స్ వేసుకోండి. ఇలా చేస్తుంటే పాదాలు చాలా వరకూ సాఫ్ట్‌గా మారతాయి.



## యశ్‌ది చాలా సున్నితమైన మనస్తత్వం: తారా సుతారియా



పాన్ ఇండియా స్టార్ యశ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'టాక్సిక్' గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఇటీవల విడుదలై మిశ్రమ స్పందన అందుకుంటోంది. ఇందులో రెబెక్కా అనే కీలక పాత్రలో బాలీవుడ్ భామ తారా సుతారియా నటించిన విషయం తెలిసిందే. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఆమె.. యశ్ వ్యక్తిత్వం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమాలోని పాత్రలతో పోలిస్తే, నిజ జీవితంలో యశ్ పూర్తిగా భిన్నమని పేర్కొన్నారు.

యశ్‌ను 'మేల్ ఫెమినిస్ట్' అనొచ్చా?అన్న ప్రశ్నకు ఆమె బదులిచ్చారు 'కచ్చితంగా అనొచ్చు. ఆయన చాలా సున్నితమైన వ్యక్తి. ఎదుటివారి గురించే ఎక్కువగా ఆలోచిస్తుంటారు. సినీ పరిశ్రమలో ఇలాంటి వ్యక్తులు ఉండడం చాలా అరుదు. అందరిపైనా యశ్ ఎంతో గౌరవాన్ని ప్రదర్శిస్తారు' అని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో హీరోయిన్ల మధ్య పోలికలపైనా తారా స్పందించారు. 'సోషల్ మీడియాలో ఎప్పుడూ హీరోయిన్లను ఒకరితో మరొకరితో పోలుస్తుంటారు. పురుషులను అలా ఎప్పుడూ పోల్చరు కదా. ఇండస్ట్రీలో ఒక్కో నటికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఎవరికి తగ్గ పాత్రల్లో వాళ్లు నటిస్తుంటారు. అలాంటప్పుడు ఈ పోలికలు ఎందుకు?" అని తారా ఒకింత అసహనాన్ని వ్యక్తం చేశారు.

కాగా, 'కేజీఎఫ్-2' తర్వాత నాలుగేళ్ల విరామం తీసుకుని యశ్ నటించిన చిత్రమిది. ఇందులో నయనతార, కియారా అడ్వాణీ, హ్యూమా ఖురేషీ, రుక్మిణీ వసంత్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈనెల 26న ఈ చిత్రం థియేటర్లలో విడుదలైంది.

## 'మిసెస్' దర్శకురాలితో కరీనా?



వైవిధ్యమైన పాత్రలు, కథలతో వెండితెరపైనే కాకుండా.. ఓటీటీ వేదికగా కూడా అభిమానుల్ని అలరిస్తోంది బాలీవుడ్ కథానాయిక కరీనా కపూర్. ఇప్పుడామె మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వివాహం తర్వాత కొంత మంది యువతులకు ఎదురయ్యే ఇబ్బందుల నేపథ్యంలో 'మిసెస్' అనే సినిమాని రూపొందించి మంచి విజయాన్ని అందుకున్నారు దర్శకురాలు ఆరతి కడవ్. ఇప్పుడీమెతో తన రాబోయే ప్రాజెక్ట్ కోసం చేతులు కలిపిందట కరీనా. "1990ల నేపథ్యంలోనే సాగే క్రైమ్ డ్రామాగా రాబోయే చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో కరీనా మునుపెన్నడూ చూడని కొత్త కోణంలో కనిపించనుంది. హర్మన్ బావేజా నిర్మించనున్నారు. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు ప్రారంభించుకున్న ఈ ప్రాజెక్ట్ సెప్టెంబరులో పట్టాలెక్కడానికి సిద్ధంగా ఉంద"ని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

## కుటుంబం కోసం ఎంతదూరమైనా వెళ్తా!

బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'దృశ్యం: ది కన్‌క్లూజన్'. అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రియ, టబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా పోస్టర్లు సినీప్రియుల దృష్టిని ఆకర్షించాయి. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మరో కొత్త పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "కౌంట్‌డౌన్ షురూ.. తప్పు, ఒప్పు.. ఏదైనా సరే కుటుంబం కోసం నేను ఎంతదూరమైనా వెళ్తా" అనే వ్యాఖ్యల్ని జోడించింది. క్రైమ్, సస్పెన్స్, ఫ్యామిలీ డ్రామా లాంటి అంశాల కలయికతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులో విజయ్ సాల్గాంకర్ పాత్రలో మరోసారి ప్రేక్షకుల్ని అలరించనున్నారు అజయ్. పనోరమా స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబరు 2న థియేటర్లలోకి రాబోతుంది.



## అప్పుడు గర్వం తలకెక్కింది.. 'ఇలాగైతే ఇండస్ట్రీలో కష్టమే' అన్నారు: నమిత

కెరీర్ తొలినాళ్లలో వరుస సినిమాలతో తనకొచ్చిన పేరు, ప్రఖ్యాతుల కారణంగా అహంకారం, తలకెక్కి నష్టపోయినట్లు ఒకప్పటి క్రేజీ హీరోయిన్ నమిత అభిప్రాయపడ్డారు. వరుస విజయాలు, మీడియా ఇచ్చిన ప్రాధాన్యం కారణంగా తన ప్రవర్తన అసాధారణంగా ఉండేద న్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన కెరీర్‌కు సం బం ధించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

"నటి గా కెరీర్‌ను ప్రారంభించిన తొలిరోజుల్లో నాలో గర్వం ఉండేది. ఎవ రినీ లెక్క చేసేదాన్ని కాదు. ఈ విషయమై చాలా నన్ను మంది హెచ్చరిం చారు. 'నువ్వు ఇలాంటి వైఖరే అనుసరిస్తే, ఇండస్ట్రీలో ఎక్కువ రోజులు కొనసాగలేవు' అన్నారు. దీంతో నెమ్మదిగా నాలో మార్పు మొదలైంది. నా ప్రవర్తన కారణంగా సహనటులు, టెక్నీషియన్స్, జూనియర్ ఆర్టిస్ట్‌లు చాలా ఇబ్బంది పడ్డారట. ఒకరిద్దరు కాదు, చాలా మంది ఈ విషయాన్ని నాకు చెప్పారు" అని నమిత చెప్పుకొచ్చారు. 17ఏళ్ల వయసులో మిస్ సూరత్‌గా ఎంపికైన నమితను ఆ తర్వాత మిస్ ఇండియా పోటీల్లో థర్డ్ రన్నరప్‌గా నిలిచారు. దీంతో వరుస సినిమా అవకాశాలు ఆమెను పలకరించాయి. తెలుగులో 'సొంతం'తో వెండితెరకు పరిచయమైన ఆమె తమిళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.



## 'ఆ విషయంపై మాట్లాడొద్దు'.. పాక్ క్రికెటర్లకు పీసీబీ సూచన




మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైలుశిక్ష విషయంపై పాకిస్థానీ క్రికెటర్లు ఎలాంటి వ్యాఖ్యలూ చేయొద్దని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సూచించింది. పాక్ జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ ఆడుతోంది. ఇమ్రాన్ వ్యవహారంపై పాక్ క్రికెటర్లు స్పందించేలా బ్రిటిష్ మీడియా ప్రయత్నించిన నేపథ్యంలో పీసీబీ ఈమేరకు సూచన చేసింది. ఇమ్రాన్ ఖాన్ మూడేళ్లుగా జైలులో నరకం అనుభవిస్తున్నారని ఆయన కుమారులు ఇటీవల ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ మైక్ అథర్టన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆరోపించిన వేళ ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇమ్రాన్ కుమారుల ఇంటర్వ్యూను ఆటగాళ్లు చూశారా?అని పాక్ ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను విలేకరులు అడిగారు. ఆటగాళ్లు భోజనం చేస్తూ ఉండటంతో దానిని చూడలేదని సర్ఫరాజ్ మీడియాతో అన్నాడు.

మరోవైపు, రావల్పిండి జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం కూడా క్షీణించినట్లు అంతకుముందు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో పాకిస్థాన్ మాజీ కెప్టెన్ అయిన ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై క్రికెట్ ప్రపంచం కూడా స్పందించింది. ఇమ్రాన్ ఖాన్‌కు మెరుగైన వైద్యం అందించాలని సునీల్ గావస్కర్, గ్రెగ్ ఛాపెల్‌తో సహా దాదాపు 21 మంది మాజీ కెప్టెన్లు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు లేఖ రాశారు. ఆస్ట్రేలియా క్రికెటర్ ప్యాట్ కమిన్స్ కూడా తన మద్దతును తెలియజేశాడు.

## నోబాల్ వేస్తే.. ఆ ఇద్దరికీ ఫైన్ వేయండి: సునీల్ గావస్కర్



లశ్రీలంకతో టెస్టు సిరీస్‌లో భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఎక్కువగా నోబాల్స్ సంధించాడు. 2021 నుంచి ఇప్పటి వరకు దాదాపు 85 నో బాల్స్ విసరడం గమనార్హం. ఇటీవలే అరంగేట్రం చేసిన సారాంశ్ జైన్ కూడా కొన్నిసార్లు పాదాన్ని క్రీజ్ బయట పెట్టాడు. ఇదే విషయంపై స్పిన్ కోచ్ సాయిరాజ్ బహుతులే 'టెస్టుల్లోనూ నో బాల్ వేస్తే ఫ్రీహిట్ ఇస్తే బాగుంటుంది' అని సరదాగా వ్యాఖ్యానించాడు. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఓ కీలక సూచన చేశారు. ఇలా పదేపదే నోబాల్స్ విసిరిన బౌలర్లపై చర్యలు తీసుకోవాలని.. అదే సమయంలో బౌలింగ్ కోచ్‌నూ బాధ్యుడిని చేయాలని స్పష్టం చేశారు. "ఇటీవల నో బాల్స్‌ను వేయడంపై చర్చ సాగుతోంది. ఇది అత్యంత కీలక విషయమని గుర్తించాలి. మ్యాచ్ స్వరూపాన్నే మార్చేయగలదు. ఆటగాళ్లు కొన్నింటిని కంట్రోల్ చేయగలరు. బ్యాటర్ అయితే గార్డ్‌ను తీసుకోవడం.. అదే బౌలర్‌గా నో బాల్స్ వేయకుండా ఉండటం. ఇప్పుడున్న కాలంలో ప్రతి దానిని గణించడం జరుగుతుంది. అలాంటప్పుడు బౌలింగ్ క్రీజ్‌ను ఎందుకు దాటాలి. ఈ తప్పిదాలు క్షమించరానివి" అని గావస్కర్ వ్యాఖ్యానించారు.

ఫ్రీ హిట్స్ వద్దు

"భారత స్పిన్ బౌలింగ్ కోచ్ సరదాగా ఆ వ్యాఖ్యలు చేశాడు. నో బాల్ వేసిన తర్వాత ఫ్రీ హిట్ అంటే పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఉంటుంది. టెస్టులనూ ఆ దారిలోకి తీసుకెళ్లొద్దు. ఇలా చేయడం వల్ల పరుగులు రాబట్టడం బ్యాటర్లకు తేలికగా మారుతుంది. అలా కాకుండా.. ప్రతి నో బాల్‌కు బౌలర్‌కు జరిమానా విధించాలి. ఆ సంఖ్య పెరుగుతూ ఉంటే రెట్టింపు చేయాలి. అదే సమయంలో సగం జరిమానాను బౌలింగ్ కోచ్‌కూ విధించాలి. ఆ నిధులను జట్టు డిన్నర్ కోసం కేటాయించాలి. ఇతర అంశాల్లోనూ ఫైన్‌లు వేయాలి. ఫీల్డింగ్ సరిగా చేయకపోయినా కూడా విధించాలి. అందుకోసం ఓటింగ్ పెట్టాలి. ఇలాంటివి జట్టులో ఫన్‌ను తీసుకొస్తాయి. ఆటగాళ్ల మధ్య సఖ్యత పెంచుతాయి" అని గావస్కర్ సూచించారు.

## మహిళల ఆసియా కప్.. భారత్ శుభారంభం



మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత్ శుభారంభం చేసింది. థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 94 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 160 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన థాయ్‌లాండ్ .. 16.1 ఓవర్లలో 65 పరుగులకే ఆలౌటైంది. కొంచారోయింకై 41 రన్స్ చేసింది. మిగతా బ్యాటర్లెవరూ అంతగా రాణించలేదు. భారత బౌలర్లలో నందనీ శర్మ, దీప్తిశర్మ చెరో 3 వికెట్లు పడగొట్టారు. క్రాంతి గౌడ్ ఒక వికెట్, శ్రీచరణి 2 వికెట్లు తీశారు. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఓపెనర్ షెఫాలి వర్మ (64; 36 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు అర్ధ శతకం బాదింది. ఈ మ్యాచ్‌తోనే టీ20ల్లోకి అరంగేట్రం చేసిన ప్రతీకా రావల్ (22; 18 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించింది. థాయ్‌లాండ్ బౌలర్లలో లావోమి 3, సునిద 2, పుత్తవాంగ్, చనిదా తలో వికెట్ తీశారు.

## కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ.. నాయకత్వ బాధ్యతల్లోకి యువ సంచలనం



టీమ్‌ఇండియా యువ సంచలనం వైభవ్ సూర్యవం అప్పుడే కెప్టెన్ అయిపోయాడు. అదీనూ ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీలో హేమాహేమీ ఆటగాళ్లు ఉన్న ఈస్ట్ జోన్ జట్టుకు నాయకత్వం బాధ్యతలను స్వీకరించాడు. అదేంటి ఇషాన్ కిషన్‌కు అతడిని డిప్యూటీగా చేశారు కదా.. అనే సందేహం రాకమానదు. అవునండి.. సూర్యవం శీ వైస్ కెప్టెనే. కాకపోతే సెంట్రల్ జోన్‌తో జరుగుతోన్న సెమీస్‌లో ఇషా న్‌కు గాయమైంది. దీంతో అతడు మైదా నం వీడాడు. మరి జట్టును నడి పించే బాధ్యతలు ఎవరికి వస్తాయి? ఆటోమేటిక్‌గా ఉప సారథికేగా. అలా ఈస్ట్‌జోన్ కెప్టెన్‌గా వైభవ్ విధులు నిర్వర్తిస్తున్నాడన్నమాట.

సీనియర్లను ముందుకు నడిపిస్తూ..

ఈస్ట్‌జోన్ జట్టులో సీనియర్ పేసర్ మహ్మద్ షమీతోపాటు ముకేశ్ కుమార్, అభిమన్యు ఈశ్వరన్, కుమార్ కుషాంగ్రా, అనుకుల్ రాయ్ వంటి ఆటగాళ్లను వైభవ్ ముందుండి నడిపిస్తున్నాడు. టాస్ గెలిచిన ఈస్ట్ జోన్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. కాసేటికే ఇషాన్ గాయంతో మైదానం వీడాడు.

అయితే, షమీ పదునైనా బౌలింగ్‌తో ఆకట్టుకోగా.. అభిజిత్ సర్కార్ 2, ముకేశ్ కుమార్ ఒక వికెట్ తీశారు. అనుకుల్ రాయ్ కూడా పొదుపుగా బౌలింగ్ చేస్తున్నాడు. ప్రస్తుతం తొలి రోజు లంచ్ బ్రేక్ సమయానికి సెంట్రల్ జోన్ 32 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 81 పరుగులు చేసింది. కెప్టెన్ రజత్ పాటీదార్ (12) నిరాశ పరిచాడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314